సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 349

శనివారం 11-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'రిలయన్స్ గ్యాస్ అందుబాటులోకి వస్తే మూడో పంటకు కూడా విద్యుత్ సరఫరా చేస్తాం. అప్పడిక ప్రతి రైతు ఇంట రోజూ సంక్రాంతే'

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 11-3-2023



కందేపి రాణీప్రసాద్

● సాక్షరం

# రాయని రోజు లేదు

**30 ఏళ్ల అక్షరయానం.**
**46 పుస్తకాల ఆవిష్కరణ.**
**ఆ దారిలో మరో 40 పుస్తకాలు.**
**అంతా పిల్లల సాహిత్యమే.**
**బాలల నీతి కథలు కావవి...**
**సామాన్యశాస్త్ర కథలు.**
**సామాన్యులకు అర్థమయ్యే కథలు.**
**పిల్లలకు జ్ఞాపకముండే కథలు.**
**ఆ సేవకు అందిన పురస్కారమే...**
**ఈ రచయిత్రి అందుకున్న సత్కారం.**



మంత్రి సత్యవతి రాథోడ్ నుంచి సత్కారం అందుకుంటూ...

కందేపి రాణీప్రసాద్ అసలు పేరు సులోచనారాణి. యద్దనపూడి సులోచనారాణి అంతటి రచయిత్రి కావాలనే ఆకాంక్షతో ఆమె తండ్రి పెట్టుకున్న పేర ది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బాపట్ల జిల్లా, చీరాలలో సాహితీకారుల కుటుంబంలో పుట్టిన రాణీప్రసాద్ పెళ్లితో తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లలో అడుగుపెట్టారు. సిరిసిల్ల ఆమె సృజనాత్మకతకు వేదిక అయింది. ముప్పై ఏళ్లలో రాయని రోజంటూ లేకుండా సాగింది ఆమె అక్షరప్రస్థానం. బాలసాహిత్యానికి ఆమె చేసిన సేవకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ఆమెను అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మార్చి ఎనిమిదవ తేదీన వరంగల్, కాకతీయ యూనివర్సిటీలో సత్కరించింది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

■ **అక్షరం 'మొగ్గ' తొడిగింది!**

''అవార్డు అందుకోవడం ఎవరికైనా సంతోషకరమే. అవార్డు అందుకున్న రోజు ఒక్కటే కాదు, ప్రతి కవిత రాసినప్పుడు, కథ రాసినప్పుడు కూడా సంతోషమేస్తుంది. మాది ప్రకాశం జిల్లా (అప్పట్లో) చీరాల, నా అక్షరాభ్యాసం నాటికి ఇంకొల్లులో ఉన్నాం. మా నాన్న ఎంతటి సాహిత్యాభిలాషి అంటే నా అక్షరాభ్యాసాన్ని రావూరి భరద్వాజ, విశ్వనాథ సత్యనారాయణ, కొండూరి రాఘవాచారి, భుజంగరాయశర్మ వంటి ప్రముఖ కవుల సమక్షంలో చేశారు. చదువుకునే రోజుల్లో సైన్స్ వ్యాసాలు రాశాను. పెళ్లితో సిరిసిల్లలో అడుగుపెట్టాను. పెద్ద బాబు పుట్టినప్పుడు నాకు ఆపరేషన్ కావడంతో చాలాకాలం కదలకుండా ఉండాల్సి వచ్చింది. అప్పుడు మొదలు పెట్టిన రచనావ్యాసంగం నిరంతరాయంగా కొనసాగుతోంది. నా కవితకు స్వాతి పత్రిక వారిచ్చిన పారితోషికం పది రూపాయల నోటును ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాను.

■ **రాయడమే వినోదం**

డాక్టర్ల భార్యలు కూడా డాక్టర్లైతేనే వృత్తి బాధలు అర్థమవుతాయి. సినిమాలు, పిక్నిక్‌లు, సరదాగా గడిపే టైమ్ ఉండదు. నేను వైద్యపరమైన డాక్టర్‌ని కాదు, కానీ పీహెచ్‌డీ డాక్టర్‌ని. మా వారు పిల్లలకు వైద్యం చేయడంలో బిజీ. నేను పిల్లలకు బొమ్మలు చేయడం, కథలు రాయడంలో బిజీ. దేహ భాగాలు, వాటి పనులతో పొడుపు కథలు రాశాను. అనారోగ్యాల గురించి కవితలు, బాలగేయాలు రాశాను. చెట్ల విడిభాగాలతో 750 బొమ్మలను బాలికా వికాసం థీమ్‌తో చేశాను. సైన్స్ పాఠాలు సామాన్యులకు కూడా అర్థమయ్యేలా 'జలచక్రం' వంటి కథలతో ఏడు పుస్తకాలు రాశాను. ఇప్పుడు బాలల మాసపత్రికలకు, దిన పత్రికలకు కాలమ్స్ రాస్తున్నాను.

■ **ఇంటి గోడలే మ్యూజియాలు**

హాస్పిటల్ నుంచి సేకరించిన వేస్ట్ మెటీరియల్‌తో అందమైన బొమ్మలు చేయడం నా హాబీ. షో పీస్‌లు, టీచింగ్ ఎయిడ్‌ల కోసం నాలుగు వేల బొమ్మలు చేశాను. 15 వందల చార్టులు 30కి పైగా థీమ్‌లతో చేశాను. మా ఇంట్లో నేను పని చేసుకునే గది 'మిల్కీ మ్యూజియం', ఊరి వాళ్ల కోసం కేటాయించిన లైబ్రరీ గది పేరు 'స్వీటీ లైబ్రరీ', హాస్పిటల్ ల్యాబ్‌లో శాస్త్రవేత్తల చిత్రాలు, ఒక గదిలో స్వాతంత్ర్య సమరయోధులు, భారతీయ చిత్రకళ, శిల్పకళ, ఆటోమొబైల్ ఇండస్ట్రీ పరిణామ క్రమం, అరుదైన మొక్కలు, అంతరించి పోతున్న జంతువులు... ఇలా గదికో థీమ్ అన్నమాట. 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలకు 75 జాతీయ పతాకాలతో ప్రదర్శన పెట్టాను. ఆ ప్రదర్శన చూసిన మా వారి స్నేహితులు 'ప్రసాద్ అర్ధరాత్రి వరకు హాస్పిటల్‌లో ఉంటాడు. ఈవిడకు బొమ్మలు చేసుకోవడానికి, కథలు రాసుకోవడానికి కావలసినంత టైమ్ ఇస్తున్నాడు' అని చమత్కరించారు. సిరిసిల్ల వంటి చిన్న పట్టణంలో నాకు ఆనందం నేను రాసుకునే అక్షరాల్లోనే దొరుకుతోంది. అదే నా జీవనశైలిగా మారింది. వంద పుస్తకాలు పూర్తి చేయాలనేది నా ఆకాంక్ష. పూర్తి చేయగలననే నమ్మకం ఉంది'' అని సాలోచనగా అన్నారు సులోచనా రాణీప్రసాద్.

– వాకా మంజులారెడ్డి



కెప్టెన్ దీక్షా సి.ఎం.

కెప్టెన్ దీక్షా సి.ఎం. పారా స్పెషల్ ఫోర్సెస్‌లో ఎంపికైన తొలి, ఏకైక మహిళా ఆఫీసర్.
స్పెషల్ ఫోర్సెస్‌లో మహిళలను తీసుకోరు.
కాని దీక్ష ఆర్మీ డాక్టర్ కావడంతో అటాచ్ చేశారు.
స్పెషల్ ఫోర్సెస్‌లో చేరాక ఇతర సభ్యులతో పాటుగా కఠినమైన కమెండో శిక్షణ తీసుకోవాల్సిందే.
అది ఆమె పూర్తి చేసింది.
'నన్ను భిన్నంగా ఉంచే పని చేస్తూ దేశానికి సేవ చేయాలన్నదే నా లక్ష్యం' అంటోంది దీక్షా.
ఆమె శిక్షణ ఫొటోలను చూసి దేశం గర్వపడుతోందిప్పుడు.

● న్యూస్ మేకర్

# డాక్టర్ ఫైటర్



ఆర్మీలో డాక్టర్ అంటే క్షతగాత్రులకు వైద్యం చేసే డాక్టర్లే గుర్తుకు వస్తారు. కాని ఈ డాక్టర్ వేరు. ఈ డాక్టర్ అవసరం అయితే ఏ.కె.47 ఉపయోగించగలదు. దేశద్రోహులను తుద ముట్టించగలదు. మంటల్లో దూసుకుపోగలదు. కుండపోత వానలో శతృవుతో తలపడగలదు. అదే సమయంలో తన వారికి వైద్యం చేసి భుజాల మీద మోసుకొని స్థావరానికి చేర్చగలదు. ఇండియన్ ఆర్మీకి చెందిన పారాచూట్ రెజిమెంట్‌లోని పారా స్పెషల్ ఫోర్స్‌లో నియామకమైన కెప్టెన్ దీక్షా సి.ఎం. ప్రత్యేకత ఇది.

■ **కర్నాటక యోధురాలు**

దీక్షా సి.ఎం.ది కర్ణాటకలోని దావణగెరె. బాల్యం నుంచి ఎన్.సి.సిలో శిక్షణ పొందింది. ఆ సమయంలో సైన్య కార్యకలాపాలు తెలుసుకుంటూ ఆర్మీలో చేరాలని, ప్రత్యేకమైన ముద్ర నిరూపించుకోవాలని భావించింది. వైద్య విద్య అభ్యసించాక 2019లో ఎస్.ఎస్.సి (షార్ట్ సర్వీస్ కమిషన్) రాసి ఆర్మీకి ఎంపికైంది. కొద్ది కాలం గోల్కొండ మిలటరీ హాస్పిటల్‌లో పని చేశాక ఆర్మీ డాక్టర్లకు తప్పనిసరి అయిన ఎం.ఓ.బి.సి (మెడికల్ ఆఫీసర్స్ బేసిక్ కోర్స్) శిక్షణ కోసం లక్నో వెళ్లింది. వైద్యం చేయడమే డాక్టర్ల పని అయినప్పటికీ ఆర్మీలో చేరాక సైన్యం తాలూకు కనీస పరిజ్ఞానం, శారీరక దారుఢ్యం, ప్రత్యేక పరిస్థితుల్లో సైనికులకు ఎటువంటి వైద్యం చేయాలి అనే విషయాల మీద ఆ కోర్స్ ఉంటుంది. అది పూర్తి చేశాక లేహ్‌లోని టంగ్‌సే మిలటరీ హాస్పిటల్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

■ **మైనస్ 40 డిగ్రీల వద్ద**

టంగ్‌సే మిలటరీ హాస్పిటల్‌లో పని చేయడం మహిళా ఆఫీసర్లకు చాలెంజ్. అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 40 వరకూ పడిపోతుంటాయి. అయినా సరే తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రశంసలు అందుకుంది దీక్ష. కాని ఆమెకు ఇతర మహిళా ఆఫీసర్లు చేరని స్థాయికి చేరాలనే కోరిక ఉండిపోయింది. పారా స్పెషల్ ఫోర్స్‌లో చేరితే ఆ స్థాయికి ఉన్న గొప్పదనం వేరు అని తెలుసుకుంది. పారా స్పెషల్ ఫోర్స్‌లో మహిళలను నేరుగా తీసుకోరు. కాని స్త్రీ/పురుష డాక్టర్లు ఆ ఫోర్స్‌లో భాగం కావచ్చు. ఇప్పటి వరకూ ఒక్క మహిళా డాక్టర్ కూడా అందుకు ముందుకు రాలేదు. కెప్టెన్ దీక్ష మొదటిసారి ప్రయత్నించింది. 2021లో పారా స్పెషల్ ఫోర్స్‌కు ఎంపికైతే నాలుగు నెలల ప్రొబెషన్ ఇచ్చారు. అంటే కఠినమైన కమెండో శిక్షణ. మగ ఆఫీసర్లతో కలిసి అన్ని రకాల యుద్ధ విద్యలను నేర్వాలి. ఇందుకు భౌతిక శక్తి చాలా కావాలి. ఆ భౌతిక శక్తిని ప్రదర్శించలేక విఫలమైంది దీక్ష. అధికారులు ఆమెను లేహ్‌కు తిరిగి పంపించేశారు.

■ **రెండోసారి ప్రయత్నించి...**

పారా స్పెషల్ ఫోర్స్‌లో చేరాలన్న కోరిక నెరవేరకుండా తిరిగి వచ్చిన దీక్ష మెడికల్ ఆఫీసర్‌గా విధులను కొనసాగించింది. కాని ఆమె కమాండింగ్ ఆఫీసర్‌గా ఉన్న శివేష్ సింగ్ 'నీ కలను సగంలో ముగించకు' అని ఉత్సాహపరిచాడు. అతని ప్రోత్సాహంతో రెండోసారి 2022లో పారా ఫోర్స్‌కు ఎంపికై ప్రొబెషన్‌కు వెళ్లింది. ఈసారి ఆమె అద్భుతమైన శక్తిని, బలాన్ని, ధైర్యాన్ని, దీక్షను ప్రదర్శించింది. ట్రయినింగ్‌లో కాలికి గాయమైనా అధికారులు ఆమె పట్టుదలను చూసి పారా స్పెషల్‌ఫోర్స్‌కు ఎంపిక చేశారు. అలా భారతదేశంలో ఈ స్థాయికి వచ్చిన తొలి మహిళగా రికార్డు సాధించింది.

■ **ఎన్నో సవాళ్లు**

'పారా స్పెషల్ ఫోర్స్ విధులు చాలా అనూహ్యంగా ఉంటాయి. ఒక్కోసారి యుద్ధ క్షేత్రానికి వెళ్లాలి. మరోసారి గెరిల్లా దళాలతో తలపడాలి. భూకంపాలలో చిక్కుకున్నవారిని కాపాడాలి. జనావాసాలలో నక్కిన టెర్రరిస్టులను హతమార్చాలి. ఈ పనుల్లో ఆర్మీకి గాయాలవక తప్పదు. వైద్య సేవలు అందించక తప్పదు. అందుకని ఒకవైపు నేను పోరాటం చేస్తూనే మరోవైపు గాయపడకుండా, జబ్బు పడకుండా కాపాడుకోవాలి. నేను ఆరోగ్యంగా ఉంటేనే నా జట్టుకు వైద్యం చేయగలను' అంటుంది దీక్ష.

టర్కీలో వచ్చిన భూకంప బాధితులను కాపాడడానికి వెళ్లిన బృందంలో దీక్ష కూడా ఉంది. 'ఇండియన్ ఆర్మీలో స్త్రీలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి వివక్ష లేదు. నేటి యువతులు వారి సంశయాలను విడిచి ధైర్యంగా ముందుకొస్తే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చు' అంటుంది దీక్ష.



**బ్యూటిప్**

తాజా కొబ్బరి పాలతో ముఖాన్ని మర్దన చేస్తే చర్మం తెల్లబడుతుంది. పెదవులు నల్లగా ఉన్నా పొడిబారి ఉన్నా కొబ్బరి పాలతో మర్దన చేస్తే నలుపు వదులుతుంది, పెదవులు మృదుత్వాన్ని సంతరించుకుంటాయి.

వైరల్



**అనుకుంటాంగానీ...**
**సుఖంలోనూ కష్టం ఉంటుంది.**
**'అయ్యో! ఏమీ చెయ్యలేకపోతున్నానే' అని.**
**కష్టంలోనూ బోలెడు సుఖం ఉంటుంది.**
**'నేను కష్టపడుతున్నాను.**
**ఇప్పుడు ఎంత సుఖంగా ఉందో'**
**ఢిల్లీ అమ్మాయి తాప్సీ ఉపాధ్యాయ్‌ను చూస్తే**
**'నిజమే సుమీ!' అనిపిస్తుంది...**

# పానీపూరి వాలీ, బీటెక్





'నా చదువుకు తగ్గ ఉద్యోగం దొరికితేగానీ ఉద్యోగం చేయను' అనుకునే వాళ్లు కొందరు.

'చిన్న ఉద్యోగం అయినా సరే ఖాళీగా మాత్రం కూర్చోను' అనుకునేవాళ్లు కొందరు.

తాప్సీ ఉపాధ్యాయ్ రెండో కోవకు చెందిన వ్యక్తి. బీటెక్ చేసిన తాప్సీ ఢిల్లీ తిలక్‌నగర్‌లో ఉన్న మెట్రోస్టేషన్‌కు సమీపంలో పానీపూరి స్టాల్ నడుపుతుంది.

21 సంవత్సరాల తాప్సీ తనను తాను 'బీటెక్ పానీపురి వాలీ'గా పిలుచుకుంటుంది.

స్టాల్ దగ్గర ఆమెకు రోజూ తప్పనిసరిగా ఎదురయ్యే ప్రశ్న...

'బీటెక్ చేసి పానీపూరి స్టాల్ నడపడం ఏమిటి?'

అయితే వారి ప్రశ్నకు ప్రశ్నతోనే జవాబు ఇస్తుంది తాప్సీ.

'బీటెక్ చేసిన వాళ్లు పానీపూరి స్టాల్ నడపవద్దని ఎక్కడైనా రాసి పెట్టి ఉందా?'

ఇది ఇలా ఉండగా ఒక ఫుడ్‌బ్లాగర్ తాప్సీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాప్సీ దర్జాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మీద వస్తున్న దృశ్యం, పానీపూరి అమ్ముతున్న దృశ్యాలు ఉంటాయి. ఈ వీడియోకు అయిదు మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.

తాప్సీ వీడియో రకరకాల కామెంట్స్‌తో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'ఇతరులు మన గురించి ఏమనుకుంటారో అంటూ జీవితాంతం ఇతరుల గురించి ఆలోచిస్తూ తమను తాము మరచిపోయి, ఏమీ సాధించకుండా మిగిలిపోయేవారు ఎందరో ఉన్నారు. ఇలాంటి వాళ్లకు తాప్సీ కనువిప్పు కలిగిస్తుంది. కష్టాన్ని ఎప్పుడూ గౌరవించాల్సిందే'

'ఆర్థిక స్వాతంత్ర్యం గురించి అక్షరాల్లో కాదు దృశ్య రూపంలో చూసినట్లు ఉంది. తాప్సీ తనకు తానే బాస్. తనకు తానే ఉద్యోగి'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి. ఆకాశానికెత్తే కామెంట్స్ మాత్రమే కాదు...

'బీటెక్ చేసిన వాళ్లు టెక్నాలజీ, కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టకుండా ఈ పనిచేయడం ఏమిటో! చదివిన చదువు వృథా అయిపోవడం లేదా!!' అంటూ సన్నాయి నొక్కులు నొక్కిన వారు కూడా ఉన్నారు. అయితే దీనికి ఒకరు ఇలా సమాధానం ఇచ్చారు...'మీరు చెప్పింది నిజమే కావచ్చుగానీ, ఏ పని చేయకుండా ఇంట్లో ఖాళీగా కూర్చున్నంత మాత్రాన కొత్త ఆవిష్కరణలు జరుగుతాయా?'

సరే, వీటి సంగతి పక్కన పెడితే ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనేది తాప్సీ ఉపాధ్యాయ్ కల. అందులో పానీపూరి స్టాల్ తొలి అడుగు మాత్రమే.

* అస్తిత్వ

# కళే ఉపాధి అయింది

**ఒక చిన్న గది నుంచి మధుబని పెయింటింగ్ వేయడం మొదలుపెట్టింది ఆమె. గది నుంచి పట్టణ వీధులు దాటుకుంటూ పెయింటింగ్స్‌తో అలంకరించిన చీరలు, డ్రెస్సులు, బ్యాగులకు దేశవ్యాప్తంగా డిమాండ్ తీసుకువచ్చింది. ఆమె తపనకు గుర్తింపు లభించింది. ఆమె కృషికి మెచ్చుకోలుగా ఎన్నో అవార్డులు వెదుక్కుంటూ వచ్చాయి. ఆమె పేరు ఉషా ఝా. బీహార్‌వాసి. ప్రముఖ మధుబని కళాకారిణులలో ఒకరిగా పేరుతెచ్చుకున్న ఆమె కృషి, పట్టుదల ఆమె పనితనం ద్వారానే మన కళ్లకు కడతాయి.**



ఉషా ఝా

''భర్త, పిల్లలు, సపోర్ట్‌నిచ్చే కుటుంబం ఉంది. కానీ ఇంకా ఏదో వెలితిగానే ఉండేది. ఏదో చేయాలనే తపన నన్ను ఇంత దూరం తీసుకువచ్చింది'' అని చెప్పే ఈ కళాకారిణి నేడు 300 మందికి పైగా మహిళా కళాకారులు ఆమెతో వారితో చేరారు. తమ జీవితాలనూ మెరుగుపరుచుకుంటున్నారు. ఆమె అంతరంగం మనకు ఓ పాఠం.

''చిన్న వయసులోనే పెళ్లయినా చదువు మాత్రం కొనసాగించాను. బీహార్‌లోని భద్రేశ్వర్ అనే చిన్న గ్రామంలో పుట్టి పెరిగాను. చిన్న పట్టణాల్లో అమ్మాయిలకు చిన్న వయసులోనే జరుగుతాయి. దాంతో 10వ తరగతి పాస్ అయిన వెంటనే మా తల్లిదండ్రులు నాకు పెళ్లి చేశారు. ఆ తర్వాత భర్తతో కలిసి పట్నం వచ్చాను. మనసులో ఎన్నో కలలు చెదిరిపోయాయి. ఇంక చేసేదేముంది అని లోలోపల భయపడ్డాను. చాలా మంది అమ్మాయిలకు పెళ్లి తర్వాత తదుపరి చదువులు ఆగిపోతాయి. కానీ అదృష్టవశాత్తూ, మా అత్తమామల ఇంట్లో అందరూ నా చదువు కొనసాగించాలనే నా నిర్ణయాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు. అలాగని, ఎవరూ సపోర్ట్ చేయలేదు. ప్రైవేట్ ట్యూషన్, కరస్పాండెన్స్ ద్వారా మాస్టర్స్ డిగ్రీ చేశాను.

**చిన్ననాటి నుంచి వస్తున్న కళ**

చదువుతో పాటు నాకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలనే తపన ఉండేది. పిల్లలు పుట్టడం, వారు పెద్దవడం, కుటుంబ పనులతో తీరికలేని రోజులు ఒక్కొక్కటి దాటుకుంటూ వచ్చేశాను. పిల్లలు పెద్దయ్యేనాటికి నాకు చాలా ఖాళీ సమయం ఉండేది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని నాదైన ముద్ర వేయాలని నిర్ణయించుకున్నాను. 'ఏం చెయ్యాలి' అనేది ప్రతీక్షణం ఆలోచన. మిథిలా కళలో నా చేతి కళను ప్రయత్నించడం ప్రారంభించాను. భవిష్యత్తులో ఇదే నా గుర్తింపుగా మారుతుందని అప్పుడు నాకు తెలియదు. కుటుంబంలో ఎవరిఎవరి వైనా వివాహాలు జరిగేటప్పుడు కోహ్బర్ (ఆవు పేడ, ఎరుపు రంగుతో కలిపి వేసే పెయింటింగ్) వేసేదాన్ని. ఇది మిథిలా కళ. ఆ రోజుల్లో మేం కోహ్బర్ నుండి వేడుకను ప్రారంభించేవాళ్లం. మొదట్లో గోడలపై మధుబని పెయింటింగ్స్ వేయడం మొదలు పెట్టాను. తర్వాత చీరలు, ఇతర క్లాత్స్, కాగితంపై పెయింటింగ్ కూడా వేశా. ఆ రోజుల్లో గోడపై పెయింటింగ్ చేస్తున్నప్పుడు డబ్బు సంపాదించడానికి, కుటుంబాన్ని పోషించడానికి సాధనం అవుతుంద నుకోలేదు. కాలక్రమేణా అది ఉపాధిగా మారింది.

**కొద్ది మందితో ప్రారంభమై..**

1991లో పాట్నాలోని బోరింగ్ రోడ్‌లోని మా ఇంటి నుంచి 'పెటల్స్ క్రాఫ్ట్' ప్రారంభించాను. మొదట్లో ఒక గదిలో పెయింటింగ్ వేయడం మొదలుపెట్టాను. దీని తర్వాత పని బాగా పెరిగి, ఇప్పుడు ఆర్టిస్టులతో ఇంటింటా పెయింటింగ్ వర్క్ చేయిస్తున్నాను. నా కస్టమర్ల కోసం మధుబని కళతో అలంకరించిన చీరలు, బ్యాగులు, స్టోల్స్‌ని డిజైన్ చేస్తాను. ఇతర గృహోపకరణాలు వంటి 50 రకాల ఉత్పత్తులపై మధుబని పెయింటింగ్ వేస్తుంటాను. ప్రభుత్వం నుండి అనేక మంది పర్యాటకులు, ప్రపంచం నలుమూలల నుండి ప్రసిద్ధ వ్యక్తులు మా కస్టమర్లు అయ్యారు. మొదట్లో ఇద్దరు కళాకారులు నాతో పని చేసేవాళ్లు. ఈ రోజు నాతో పని చేస్తున్న 300 మందికి పైగా మహిళలు జీవనోపాధిని పొందుతున్నారు.



మధుబని పెయింటింగ్ చేస్తున్న మహిళలు

**సొంత వ్యాపారాలు**

2008లో గ్రామాల్లో నేను చేస్తున్న పనులను అధికారికం చేయాలని భావించి 'మిథిలా వికాస కేంద్రం' ఏర్పాటు చేసి, దాని ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. మహిళలు అక్షరాస్యులైతే తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించగలుగుతారు. అలాగే మహిళా కళాకారులకు వారి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తాం. నా దగ్గర మధుబని ఆర్ట్‌లో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించుకున్నారు. నేను మిథిలా పెయింటింగ్స్ అమ్మడం ప్రారంభించినప్పుడు ఆన్‌లైన్‌లో అమ్మే ప్లాట్‌ఫారమ్‌లు లేవు. నేను నా పెయింటింగ్‌లను అమ్మడానికి ఇంటింటికీ, నగరానికి, విదేశాలకు కూడా వెళ్ళాను. అక్కడ పెయింటింగ్ స్టాల్ ఏర్పాటు చేసేదాన్ని.

**రాష్ట్రపతి భవన్‌లో**

నేను నా ఉత్పత్తులను ఎప్పుడూ మార్కెట్ చేయలేదు కానీ నా పనిని ఇష్టపడే వ్యక్తులు నా పెయింటింగ్‌లను కొనుగోలు చేసి, వాటిని మెచ్చుకునేవారు. ఈ ప్రశంసల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పుడు సాంకేతికత, ఆన్‌లైన్ అమ్మకం నా పనిని చాలా సులభతరం చేశాయి. ఇప్పుడు వాట్సాప్‌లోనూ ఆర్డర్లు తీసుకుంటున్నాం. మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ బీహార్‌లో పర్యటించినప్పుడు ఆమెకు 14 అడుగుల మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ఇచ్చాను. నేటికీ ఆ పెయింటింగ్ రాష్ట్రపతి భవన్‌లో దానిని చూడచ్చు.

**మహిళా ఉద్యోగ్ సంఘ్ కార్యదర్శి**

కొన్నేళ్లుగా పాట్నాలోని ఒక కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పిల్లలకు బోధించాను. 17 సంవత్సరాలు బీహార్ మహిళా ఉద్యోగ్ సంఘ్‌కి కార్యదర్శిగా ఉన్నాను. తొలినాళ్లలో ఆర్ట్ ట్రైనింగ్ ఇచ్చిన చాలా మంది మహిళలు ఇప్పుడు కొత్త తరం మహిళలకు మధుబని ఆర్ట్ ట్రైనింగ్ ఇస్తున్నారు. ఇక్కడితో ఆగిపోకూడదనుకుంటున్నా.. ఇంకా ముందుకు వెళితే బీహార్ నేపాల్ సరిహద్దుల్లోని గ్రామాలు, పట్టణాల్లో మరిన్ని శిక్షణా కేంద్రాలను ప్రారంభించాలనుకుంటున్నాను. నేటికీ ప్రభుత్వం రాని చోట్ల అనేకం ఉన్నాయి. మరింత మంది మహిళలు నాతో చేరి స్వావలంబన కావాలని కోరుకుంటున్నాను. నా విజయాలకు ఉమెన్స్ ఎకనామిక్ ఫోరమ్ నుంచి అవార్డు కూడా అందుకున్నాను. నేను చేయగలిగినప్పుడు మీరూ చేయగలరనేది నా నమ్మకం'' అని వివరించే ఈ కళాకారిణి ప్రయాణం ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకం.

శనివారం 11-3-2023



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 349

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



# ఒత్తిడికి దూరంగా ఉండాలంటే..?

ఈ రోజుల్లో చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి కారణం సరైన జీవనశైలి, మంచి ఆహారపు అలవాట్లు లేకపోవడమే. డైట్ నుంచి కొన్ని ఆహారాలని మినహాయించడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడవచ్చు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం...

### చక్కెర

మీరు ఎప్పుడూ ఒత్తిడికి లోనవుతున్నట్లయితే ముందుగా ఆహారం నుంచి చక్కెరను మినహాయించండి. ఎందుకంటే తీపి పదార్థాలు మీ శక్తి స్థాయిని ప్రభావితం చేస్తాయి. శరీర అసమతుల్యతను కలిగిస్తాయి. దీనివల్ల మనిషిలో టెన్షన్ పెరగడం మొదలవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారు చక్కెరను ఎక్కువగా తినకూడదు.

### ఆల్కహాల్

ఆల్కహాల్ కాలేయానికి మాత్రమే కాకుండా మొత్తం ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఆల్కహాల్ మెదడులోని సెరోటోనిన్ చర్యను మారుస్తుంది. ఇది ఆందోళనను పెంచుతుంది. అందుకే మద్యం తాగకూడదు. ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఆందోళన పెరుగుతుంది.

### కెఫిన్

కెఫిన్ కలిగిన పానీయాలు అధికంగా తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి, నిద్రలేమికి కారణమవుతాయి. కెఫిన్ అనేది కాఫీలోనే కాదు, టీలో కూడా ఉంటుంది. అందువల్ల కాఫీ, టీ, చాక్లెట్లు, కొన్ని రకాల శీతల పానీయాలలో కూడా కెఫిన్ ఉంటుంది కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకోకూడదు. ఎందుకంటే వీటివల్ల డిప్రెషన్‌కు గురవుతారు.

### ఉప్పు

ఉప్పు మానసిక స్థితిని పాడు చేస్తుంది. మీరు అలసిపోయేలా చేస్తుంది. అలాగని ఉప్పు తీసుకోవడాన్ని పూర్తిగా మానేయకూడదు. తగ్గించి తీసుకుంటే ఉత్తమం. కొందరికి మజ్జిగన్నంలో ఉప్పు తప్పనిసరి. ప్రాసెస్‌డ్ ఫుడ్ అంటే నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, వడియాలలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అలాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది.

# ఆరోగ్య రసాలు

వేసవి వచ్చేసింది. చలికాలంలో లాగే వేసవిలో కూడా చర్మ సంరక్షణ చాలా అవసరం. ఎందుకంటే, వేసవిలో చర్మం ట్యానింగ్, నిగారింపు కోల్పోవడం, పొడిగా మారడం వంటి సమస్యలు ఎదుర్కొంటుంది. ఈ సమస్యల్నించి ఉపశమనం పొందాలంటే రోజూ ఈ డ్రింక్స్ తప్పనిసరిగా తీసుకోవల్సిందే. వీటివల్ల చర్మకాంతి పెరిగి యౌవనంగా కనిపిస్తారు.



### దానిమ్మ జ్యూస్

శరీరానికి కావలసిన అన్ని రకాల విటమిన్లు సమృద్ధిగా ఉండేది దానిమ్మలోనే. అందువల్ల రోజూ దానిమ్మ జ్యూస్ సేవించడం ద్వారా చర్మంలో నిగారింపు వస్తుంది. ముఖంలో కాంతి వస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్థులు కూడా దానిమ్మ జ్యూస్ తీసుకోవచ్చు. అయితే అందులో రుచికి పంచదార కలుపుకోకూడదు.



### ఆరెంజ్ జ్యూస్

చర్మకాంతిని పెంచే విటమిన్ సి సమృద్ధిగా ఉండేవాటిలో నారింజ లేదా కమలా పండ్లు ముందుంటాయి. నారింజ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది కాబట్టి క్రమం తప్పకుండా ఆరెంజ్ జ్యూస్ తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి.



### గ్రీన్ టీ

కేవలం బరువు తగ్గించేందుకే కాకుండా చర్మ సంరక్షణకు అద్భుతంగా పనిచేస్తుంది గ్రీన్ టీ. రోజుకు రెండు సార్లు గ్రీన్ టీ తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి



### బీట్ రూట్ జ్యూస్

ఆరోగ్యానికి అద్భుత ఔషధం బీట్ రూట్ జ్యూస్. ప్రతిరోజూ బీట్‌రూట్ జ్యూస్ తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



### టొమాటో జ్యూస్

టొమాటోలో ఎన్నో రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వ్యాధి నిరోధకత శక్తిని కలిగిస్తాయి. రోజూ టొమాటో జ్యూస్ తీసుకోవడం వల్ల చర్మం యౌవనంగా, కాంతిమంతంగా ఉంటుంది. టొమాటోను సలాడ్ రూపంలో కూడా తీసుకోవచ్చు.



### ● మీకు తెలుసా



● రోజూ ఉదయాన్నే రెండు లేదా మూడు టొమాటోలను తింటే చాలా మంచిది. టొమాటోలలో ఉన్న విటమిన్ కె, కాల్షియం, లైకోపీన్ ఎముకలను బలోపేతం చేయడానికి, వాటి పనితనాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి.

● బరువు తగ్గాలనుకునేవారు రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రెండు గ్లాసుల టమాటా రసం తాగాలి. ఇలా చేయడం వల్ల బరువు త్వరగా తగ్గి, కొద్ది రోజుల్లోనే స్థూలకాయాన్ని దూరం చేసుకోవచ్చు.

● టమోటాలో బీటా కెరోటిన్ అధిక మోతాదులో ఉంటుంది కనక టమోటాను తీసుకుంటే.. శరీరానికి కావలసిన ఎనర్జీ అందుతుంది. దాంతో చర్మం, జుట్టు, అధిక బరువు సమస్య కూడా రాదు.

● టమోటాలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్ ఖనిజాలు అధికం. ఇవి క్యాన్సర్ వ్యాధి నుండి ఉపశమనం కలిగేలా చేస్తాయి. టమోటా తీసుకుంటే.. శరీరంలోని 80 శాతం చెడు కొలెస్ట్రాల్ పోతుంది.

● చాలామందికి గుండె వ్యాధుల కారణంగా రక్తపోటు వస్తూ ఉంటుంది. అందుకు ఏం చేయాలంటే.. టమోటాలు తీసుకోవాలి. టమోటాలోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.



# పిల్లలకు తగిన సమయం కేటాయిస్తున్నారా?

నేటి బిజీ లైఫ్‌లో గజిబిజి సమయాలతో పిల్లలు చెప్పే కబుర్లు వినగలిగే స్థిమితం కోల్పోతున్నారు తల్లిదండ్రులు. అయితే దానివల్ల ఎన్నో అనర్థాలు తలెత్తే ప్రమాదం ఉంది. ఎందుకంటే, పిల్లలు సహజంగానే తల్లిదండ్రులతో ప్రతి విషయాన్నీ పంచుకోవాలని చూస్తారు. చాలాసార్లు తల్లిదండ్రులు ఆ అవకాశాన్ని పిల్లలకు ఇవ్వరు. నిర్లక్ష్యం చేస్తారు. దాంతో పిల్లల్లో మొండితనం పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల అసలు పిల్లలు ఏం చెప్పాలనుకుంటున్నారు అనేది తెలుసుకోవడం అవసరం. వాళ్ళు చెప్పే చిన్న చిన్న ఫిర్యాదులు వినండి. వారికి సమయాన్ని ఇచ్చి చూడండి.

పిల్లల మీద అరవకండి. మాట వినడం లేదని బలవంతం చేయకండి. ఎందుకంటే పిల్లల మీద అరవడం వల్ల వాళ్ళు ఆందోళకు గురవుతారు. దీనితో దూకుడుగా మారి, మొండిగా ప్రవర్తిస్తారు. వాళ్ళతో ప్రశాంతంగా... నెమ్మదిగా మాట్లాడాలి. పదేపదే పిల్లలకు నువ్వు క్రమశిక్షణతో ఉండాలని, నేను చెప్పినట్లు వినాలి అంటూ బెదిరింపు ధోరణితో చెప్పటం వల్ల మరింత మొండిగా మారే అవకాశాలున్నాయి. అందువల్ల ఓపికగా, నేర్పుగా వారిని దారిలోకి తెచ్చుకోవాలి. అప్పుడప్పుడు కథలు చెప్పడం, వారికి నచ్చే మంచి సినిమాలు చూపించడం లేదా పార్కులకు తీసుకెళ్లడం వంటి వాటివల్ల వారు మన దారిలోకి వస్తారని గుర్తించాలి.

### ● హెల్త్ టిప్స్



కప్పు నీళ్ళల్లో గుప్పెడు తులసి ఆకులు, చెంచా మిరియాల పొడి వేసి బాగా మరిగించి అందులో కాస్తంత తేనె లేదా పంచదార కలిపి వేడిగా తాగితే జలుబు, దగ్గు తగ్గుతాయి.





వేపాకులను మజ్జిగలో మెత్తగా రుబ్బి ఆ పేస్టును కాలిన గాయాలపై రాస్తే ఉపశమనంగా ఉంటుంది.

శరీరం పై కాలిన చోట పాలమీగడ రాస్తే బాధ తగ్గటమే కాదు, శరీరం రంగు కూడా మారుతుంది.



మూత్ర విసర్జనలో బాధగా లేదా మంటగా ఉంటే క్యాబేజీని తినకూడదు





● దీపికా పదుకోన్
● జాన్వీ కపూర్

# ఈ గ్లామర్ ముంబై ఫ్లేవర్

**తెలుగు తెరపై ముంబై హీరోయిన్లు మెరవడం అనేది కొత్తేం కాదు. ఈ ముంబై గ్లామర్ ఫ్లేవర్ ఈ ఏడాది బాగానే కనిపిస్తోంది. మరి.. బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ టాలీవుడ్ స్క్రీన్‌పై మెరవనున్న ఆ కథానాయికలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.**

### ప్రాజెక్ట్ కె పిలిచింది

బాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరైన దీపికా పదుకోన్ ఇండస్ట్రీకి వచ్చిన పదిహేనేళ్ల తర్వాత తొలి తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆమెను టాలీవుడ్‌కు పిలిచిన కథ 'ప్రాజెక్ట్ కె'. ఈ సినిమాలో దీపికా పాత్రకు యాక్షన్ సీన్స్ కూడా ఉంటాయన్నది ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ మూవీకి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. యాభై శాతానికి పైగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను ముందు ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల అధికారికంగా ప్రకటించారు. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఆస్కార్ అవార్డుల వేడుకలో దీపికా పదుకోన్ ఓ ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకలో పాల్గొనడానికి శుక్రవారం దీపికా ముంబై నుంచి లాస్ ఏంజిల్స్ ప్రయాణమయ్యారు.

### జాన్వీ ఎంట్రీ షురూ

తెలుగు ప్రేక్షకులకు దివంగత ప్రముఖ నటి శ్రీదేవితో ప్రత్యేకమైన ఎమోషనల్ బాండింగ్ ఉంటుందనడంలో సందేహం లేదు. తెలుగు ప్రేక్షకుల నుంచి అంత గొప్ప ప్రేమను పొందారామె. మరి.. అలాంటి శ్రీదేవి కుమార్తె అయిన జాన్వీ కపూర్ (ఇద్దరు కుమార్తెలు జాన్వీ కపూర్, చిన్న కుమార్తె ఖుషీ కపూర్) హీరోయిన్‌గా కెరీర్‌ను ఆరంభించినప్పుడు తెలుగు ప్రేక్షకులు ఆమె రాక కోసం ఎదురు చూడకుండా ఉంటారా? ఆ ఎదురు చూపుల నిరీక్షణ ఐదేళ్లకు ఫలించింది. 2018లో వచ్చిన హిందీ చిత్రం 'ధడక్'తో హీరోయిన్‌గా పరిచయమైన జాన్వీ కపూర్ ఐదేళ్ల తర్వాత తొలి తెలుగు సినిమాకు సైన్ చేశారు. 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం ఈ నెల 18న జరుగుతుందని, నెలాఖర్లో షూటింగ్‌ను ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆల్రెడీ ప్రకటించింది.

### ఢిల్లీ టు హైదరాబాద్

ఒకే సినిమాతో ఇద్దరు ఢిల్లీ బ్యూటీలు తెలుగుకు వస్తున్నారు. టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రవితేజ టైటిల్ రోల్‌లో 'టైగర్ నాగేశ్వరరావు' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు నూపుర్ సనన్. అలాగే మరో ఢిల్లీ బ్యూటీ గాయత్రీ భరద్వాజ్ కూడా ఇదే సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. తెలుగులో మహేశ్‌బాబు 'వన్: నేనొక్కడినే', నాగచైతన్య 'దోచేయ్' చిత్రాల్లో నటించిన కృతీ సనన్ తాజాగా ప్రభాస్ సరసన 'ఆదిపురుష్'లో హీరోయిన్‌గా నటించారు. కృతీ చెల్లెలే నూపుర్.

### ప్రపంచ సుందరికి స్వాగతం

ఐదేళ్ల క్రితం.. అంటే 2017లో మిస్ వరల్డ్‌గా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించారు మానుషీ చిల్లర్. గతంలో మిస్ వరల్డ్‌గా నిలిచి, సినిమాల్లోకి వచ్చిన లారా దత్తా, ఐశ్వర్యా రాయ్, సుస్మితా సేన్, ప్రియాంకా చోప్రా తదితరుల మాదిరిగానే మానుషీ చిల్లర్ కూడా నటనను ఓ వృత్తిగా తీసుకున్నారు. హిందీలో అక్షయ్ కుమార్ నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్' హీరోయిన్‌గా మానుషీ చిల్లర్‌కు తొలి సినిమా. ఇక ఈ బ్యూటీ రీసెంట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ్ తేజ్ హీరోగా హిందీకి పరిచయం అవుతున్న ఈ సినిమాతో శక్తి ప్రతాప్ సింగ్ దర్శకుడిగా తొలిసారి మెగాఫోన్ పట్టారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది. ఈ చిత్రంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్, రాడార్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా మానుషీ చిల్లర్ నటిస్తున్నారు.

### మోడల్ టు యాక్టర్

మోడల్‌గా కెరీర్ ఆరంభించి, ఆ తర్వాత హీరోయిన్‌గా సెటిలైన బాలీవుడ్ అమ్మాయిల జాబితా చాలానే ఉంది. ఈ లిస్ట్‌లో తాజాగా సాక్షీ వైద్య చేరారు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'ఏజెంట్' సినిమాతో సాక్షీ వైద్య హీరోయిన్‌గా తెలుగుకు పరిచయం అవుతున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నట్లుగా తెలిసింది. అఖిల్, సాక్షీలపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారట. ఈ చిత్రం ఏప్రిల్ 28న విడుదల కానుంది.

**వీరితోపాటు మరి కొంతమంది హిందీ తారలు తెలుగు తెరకు పరిచయం కానున్నారు.**



● నూపుర్
● మానుషీ చిల్లర్
● సాక్షీ వైద్య



# ఆ క్షణం కోసం ఎదురు చూస్తున్నా! - ఎన్టీఆర్

'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం ప్రస్తుతం అమెరికాలో సందడి చేస్తోంది. ఆస్కార్ అవార్డుల వేడుక ఈ నెల 12న (భారత కాలమానం ప్రకారం 13) జరగనుంది. 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఇంటర్వ్యూలు, టీవీ షోలు, ప్రమోషన్స్‌తో బిజీబిజీగా గడుపుతోంది 'ఆర్ఆర్ఆర్' టీమ్. మంగళవారం లాస్ ఏంజిల్స్ చేరుకున్న ఎన్టీఆర్ ఓ టాక్ షోలో రెడ్ కార్పెట్‌పై నడవడం గురించి మాట్లాడుతూ– ''రెడ్ కార్పెట్‌పై నడవనున్నది ఎన్టీఆర్ లేదా కొమురం భీమ్ ('ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ పాత్ర) అని నేను అనుకోను. అలాగే రాజమౌళి, రామ్ చరణ్ అని కూడా అనుకోవడం లేదు. రెడ్ కార్పెట్‌పై మేము నడిచేటప్పుడు మొత్తం భారతదేశాన్ని మా హృదయాల్లో మోయనున్నాం.. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నాను. ఆస్కార్ వేదికపై 'నాటు నాటు..' పాటను లైవ్‌లో చూడాలని ఆసక్తిగా ఉన్నాను. ఆ పాటకు నేను, రామ్ చరణ్ డ్యాన్స్ వేస్తామని కచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే మాకు రిహార్సల్స్ చేసే టైమ్ లేదు. అయితే ఆ పాట ఎప్పుడు విన్నా నా కాళ్లు డ్యాన్స్ చేస్తుంటాయి'' అన్నారు.

# ఉగాదికి భయపెట్టనున్న కాజల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఈ ఉగాదికి ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమయ్యారు. కాజల్ అగర్వాల్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'ఘోస్టీ'. ఈ చిత్రం గంగ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై తెలుగులో విడుదల కానుంది. ''ఘోస్టీ'లో పోలీస్‌గా, సినిమా హీరోయిన్‌గా కాజల్ ద్విపాత్రాభినయం చేశారు. ఆత్మలకు, కాజల్ పాత్రలకు సంబంధం ఏంటి? అనేది ఆసక్తిగా ఉంటుంది. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు ఉత్కంఠకు గురి చేసే చిత్రమిది. ఉగాదికి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● కాజల్

# మధ్య తరగతి కుటుంబ కథ



● రాహుల్, నవ్య స్వామి

''ప్రేక్షకులు చిన్న చిత్రాలను ఆదరించాలి. ముఖ్యంగా 'ఇంటింటి రామాయణం' లాంటి మంచి చిత్రాలను ప్రోత్సహించాలి'' అన్నారు డైరెక్టర్ మారుతి. వీకే నరేష్, రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, సురభి ప్రభావతి, గంగవ్వ ప్రధాన పాత్రల్లో సురేష్ నరెడ్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇంటింటి రామాయణం'. ఎస్. నాగవంశీ, మారుతి టీమ్ సమర్పణలో వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ యిన్నమూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. నాగవంశీ మాట్లాడుతూ– ''ఇంటింటి రామాయణం'ని ముందు ఓటీటీ కోసమే ప్రారంభించాం. అవుట్‌పుట్ చూశాక థియేటర్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబ కథగా తెరకెక్కిన చిత్రం ఇది'' అన్నారు సురేష్ నరెడ్ల. ''మాకు మద్దతుగా నిలిచిన నాగవంశీ, మారుతిలకు థ్యాంక్స్'' అన్నారు వెంకట్, గోపీచంద్.




● నరేశ్, పవిత్ర

# సినిమా పెళ్లి?

'ఒక పవిత్ర బంధం.. రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడడుగులు.. మీ ఆశీస్సులు కోరుకుంటూ.. ఇట్లు పవిత్రానరేశ్' అంటూ ట్విట్టర్‌లో ఓ వీడియోను షేర్ చేశారు వీకే నరేశ్. ఈ పెళ్లి వీడియో ఓ సినిమాకి సంబంధించినది అనే ప్రచారం సాగుతోంది. కాగా 'ఇంటింటి రామాయణం' సినిమా ప్రెస్‌మీట్‌లో వీకే నరేశ్‌ని పెళ్లి వీడియో గురించి ప్రశ్నించగా.. ''అందరికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. నాకూ రీల్ లైఫ్, రియల్ లైఫ్ ఉన్నాయి. ఈ అంశంపై (పెళ్లి) త్వరలో మాట్లాడతాను. అప్పటిదాకా ఓపిక పట్టండి'' అన్నారు.

# భీష్మ పర్వం షురూ



● చేతన్ శీను

'రాజుగారి గది, మంత్ర 2, విద్యార్థి, జెంటిల్ మేన్ 2' వంటి చిత్రాల్లో నటించిన చేతన్ శీను హీరోగా 'భీష్మ పర్వం' సినిమా రూపొందుతోంది. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రోషిని సహోతా కథానాయిక. ప్రేమ్ కుమార్, చేతన్ శీను నిర్మాతలు. తొలి సీన్‌కి బెక్కం వేణుగోపాల్ క్లాప్ కొట్టగా, ఎర్రవెల్లి భాస్కర్, ఎర్రవెల్లి ప్రవీణ్, తరణి భాస్కర్, జయశంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ''ఈ చిత్రం కోసం వేసిన 40 అడుగుల కాళీ మాత సెట్‌లో వంద మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 349
శనివారం 11-3-2023


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'


**కామెరాన్ గ్రీన్ సెంచరీ**
అహ్మదాబాద్ టెస్టులో ఆస్ట్రేలియా 480 ఆలౌట్...భారత్ 36/0 -13లో



**మార్కెట్లకు గ్లోబల్ షాక్**
'ఎస్వీబీ' గ్రూప్ నిధుల సంక్షోభంతో రెండోరోజూ మార్కెట్ల పతనం -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


**ఆలయాలపై దాడులు ఆందోళనకరం**
ఆస్ట్రేలియాలో హిందూ ఆలయాలపై జరిగిన దాడులను ఆస్ట్రేలియా ప్రధాని అల్బానీస్ వద్ద ప్రస్తావించిన భారత ప్రధాని నరేంద్రమోదీ.
వివరాలు 6లో ▸


**తేజస్వీ నివాసంలో సోదాలు**
'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణంలో ఆర్జేడీ నేతల నివాసాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు.
వివరాలు 6లో ▸


**చరిత్రకెక్కిన షీ జిన్‌పింగ్**
దేశాధ్యక్షుడిగా, సైన్యాధిపతిగా వరుసగా మూడోసారి ఎన్నికవడం ద్వారా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చరిత్ర సృష్టించారు.
వివరాలు 6లో ▸


**హెచ్3ఎన్2.. రెండు మరణాలు**
ప్రమాదకరంగా ఇన్‌ఫ్లూయెంజా హెచ్3ఎన్2. కర్ణాటక, హరియాణాల్లో వైరస్ కారణంగా ఇద్దరు మృతి చెందారు.
వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### కవిత వాటా ఎంతో చెప్పాలి: తరుణ్ ఛుగ్



ఢిల్లీ మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సంస్థలకు ఎమ్మెల్సీ కవిత సహకరించి కుట్ర కోణాన్ని వివరించాలని, మద్యం కుంభకోణంలో తన వాటా ఎంతో స్పష్టం చేయాలని బీజేపీ నేత తరుణ్ ఛుగ్ అన్నారు.
- వివరాలు 2లో▶

### ముందే అనుబంధ గుర్తింపు సాధ్యమేనా?




ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను ఈసారి మేలోగా పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించినా దాని అమలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
- వివరాలు 14లో▶

### బీఆర్ఎస్‌తో కాంగ్రెస్‌కు పొత్తుండదు: జైరాం రమేశ్



వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పొత్తు పెట్టుకోబోదని కేంద్ర మాజీమంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కాకుండా మిగిలిన పార్టీలతో పొత్తుల గురించి ఆలోచిస్తామని, వివిధ రాష్ట్రాల్లో పలు పార్టీలతో తమకు పొత్తు ఉందని ఆయన చెప్పారు.
- వివరాలు 12లో▶

# ముందస్తు మాటే లేదు!



**రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి**

**బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్ స్పష్టత**

- కేంద్రానిది కక్షసాధింపు ధోరణి
- మంత్రులు గంగుల, మల్లారెడ్డిలకు నోటీసులిచ్చారు
- ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయొచ్చు.. చేస్తే చేయనీయండి
- ఈ కేసులు, వేధింపులకు భయపడేది లేదు..
- బీజేపీని దేశం నుంచి తరిమికొట్టడమే మన లక్ష్యం
- సిట్టింగ్‌లందరికీ టికెట్లు
- నేతలంతా జనంలో ఉండాలి.. పాదయాత్రలు చేయాలి
- ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని ఆదేశం

**కవితను అరెస్టు చేస్తరా.. చేయనీయండి..**

బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి అవలంబిస్తోందని కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది. ''తెలంగాణ ప్రగతిని బీజేపీ ఓర్వడం లేదు. ఈ అక్కసుతో కుట్రలకు పాల్పడుతోంది. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వేధిస్తోంది. మంత్రి గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ రవిచంద్రలతోపాటు మరికొందరిపై సీబీఐ, ఐటీ, ఈడీ తప్పుడు ఆరోపణలతో దాడులు చేశాయి. ఇప్పుడు ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారు. కవితను మహా అయితే ఏం చేస్తారు? అరెస్టు చేస్తరా, జైలుకు పంపుతరా.. అంతేకదా! ఎన్ని అరెస్టులు చేసినా, ఎంత వేధించినా భయపడేది లేదు. ఏం చేస్తారో చేసుకోనివ్వండి. ప్రజలే అంతిమ నిర్ణేతలు. కేంద్రంలో దుర్మార్గపు ప్రభుత్వం ఉంది. బీజేపీలో చేరని వారిని కేసులతో వేధిస్తున్నారు. కవితను కూడా బీజేపీలో చేరాలని అడిగారు. ఏం చేసినా కేంద్రంపై రాజకీయ పోరాటం ఆపేది లేదు. '' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేసినట్టు సమాచారం
12లో

# ఆమోదించే వరకు పోరాటం

**మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఎమ్మెల్సీ కవిత**

- కేంద్రం మెడలు వంచే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టీకరణ
- ధరణిలో సగం.. ఆకాశంలో సగం.. అవకాశాల్లోనూ సగం కావాలంటూ డిమాండ్
- అన్ని పార్టీలూ మద్దతు పలకాలని పిలుపు
- రాష్ట్రపతి ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష
- హాజరైన సీతారాం ఏచూరి, నారాయణ సహా పలు పార్టీల నేతలు


దీక్షలో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో సీతారాం ఏచూరి

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో 33% మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేవరకు పోరాటాన్ని ఆపబోమని భారత్ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం మెడలు వంచే వరకు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని చెప్పారు. మహిళలకు ధరణిలో సగం, ఆకాశంలో సగం, అవకాశాల్లోనూ సగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా
మిగతా 2వ పేజీలో ▶

## ఏప్రిల్ 30న కొత్త సచివాలయం ప్రారంభం

- అంబేడ్కర్ జయంతి రోజున 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ
- రాష్ట్రావతరణ దినోత్సవమైన జూన్ 2న అమరుల స్మారకం ప్రారంభం.. హుస్సేన్‌సాగర్ తీరాన మూడు ప్రధాన నిర్మాణాల ముహూర్తాలు ఖరారు
- ఆయా పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్


12లో

## నేడు ఈడీ ముందుకు కవిత

**ఢిల్లీ మద్యం కుంభకోణంలో విచారణ**

- సౌత్‌గ్రూపు లావాదేవీలు, ఆరోపణలపై ప్రశ్నించే అవకాశం
- న్యాయనిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన కవిత
- వాంగ్మూలం వెనక్కి తీసుకుంటానన్న అరుణ్ పిళ్లై


2లో

## హస్తినకు కేటీఆర్...

ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ఈడీ ముందు విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమె సోదరుడు, మంత్రి కె.తారక రామారావు శుక్రవారం ఢిల్లీ వెళ్లారు.


2లో

## కవితకు దీక్ష చేసే అర్హత లేదు

- రాష్ట్రంలో మహిళల సమస్యలపై ఇన్నాళ్లు స్పందించలేదేం?
- 'మహిళా గోస–బీజేపీ భరోసా' దీక్షలో బండి సంజయ్ మండిపాటు
- బీఆర్ఎస్, ఎంఐఎంల జెండాలను చూస్తేనే మహిళలు భయపడుతున్నారని వ్యాఖ్య
- తప్పు చేయనప్పుడు కవిత భయపడటం దేనికి: డీకే అరుణ


- వివరాలు 2లో▶

## కాంగ్రెస్ 'హామీ కార్డు'

**ధరణి పోర్టల్ సమస్యల నుంచి విముక్తి పేరుతో కార్డుల జారీ**

- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా పరిష్కరిస్తామని కార్డుపై లిఖితపూర్వక హామీ
- ఈ కార్డును తహసీల్దార్ లేదా రెవెన్యూ సిబ్బందికి చూపిస్తే పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- పెద్దపల్లిలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ


- వివరాలు 5లో▶

## విరాసత్ నుంచి నాలా వరకు..



- ధరణి పోర్టల్‌లోని 10కిపైగా సమస్యలకు త్వరలోనే మోక్షం
- కంపెనీల పేరిట భూముల రిజిస్ట్రేషన్లు తదితర సమస్యల చిట్టాను రూపొందించిన సీసీఎల్ఏ
- వారంలోపే ఆయా సమస్యలకు పరిష్కారం

- వివరాలు 5లో▶

## అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు



**సోమవారం వరకు అరెస్టు సహా.. ఏ చర్యలూ వద్దన్న తెలంగాణ హైకోర్టు**

- సీబీఐకి మధ్యంతర ఉత్తర్వులు
- వైఎస్ వివేకా హత్య కేసు ఫైళ్లు, రికార్డులు కోర్టు ముందుంచాలి
- అవినాశ్ వెంట ఆయన లాయర్‌ను అనుమతించాలి
- తదుపరి విచారణ 13కు వాయిదా
- అప్పటి వరకు బలవంతపు చర్యలొద్దని ఆదేశం
- విచారణ పారదర్శకంగా సాగడం లేదన్న పిటిషనర్

10లో

## వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య



**సీబీఐ విచారణ అనంతరం మీడియాతో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి**

- ఆయన పేరు మార్చుకుని ఓ ముస్లిం మహిళను పెళ్లాడారు
- వారికి ఓ కుమారుడు.. తననే వారసుడిగా ప్రకటించాలనుకున్నారు
- వారికి ఆస్తిని కేటాయిస్తూ విల్లు కూడా రాశారంటున్నారు..
- హత్య జరిగిన రోజు బహుశా ఈ పత్రాల కోసమే వెతికి ఉండొచ్చు
- మరి, ఈ హత్యలో ఎవరికి ఆసక్తి ఉందనుకోవాలి?
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

10లో








**ఇదండీ సంగతి**



రోజూ 0.4 మి.మి. పెరిగే చిట్టెలుకల కోర పళ్లు
ఏదో ఒకటి కొరుకుతూ అరగదీయకుంటే.. పెరిగి ప్రాణాలకే ముప్పు
అందుకే అన్నీ కొరుకుతూ ప్రతిచోటా విధ్వంసం
ఏడాదికి తినేది 10 కిలోలు.. నష్టపరిచేది 100 కేజీలు
మూషికాలతో దేశంలో 25 శాతం పంట నష్టం




## ఎలుక కష్టం ఎవరికి ఎరుక

# కొరికితేనే బతికేది!

సాక్షి, అమరావతి: ఎలుకలు సృష్టించే విధ్వంసం గురించి అందరికీ తెలిసిందే. కనిపించిన ప్రతీదీ కొరికేస్తూ.. బోలెడంత నష్టాన్ని కలిగిస్తుంటాయి. అయితే.. ఈ విధ్వంసం వెనుక ఓ చిన్నపాటి విషాదమూ ఉంది. చిట్టెలుకల్లో ఉండే రెండు కొరుకుడు (ఇన్‌సైజర్స్) దంతాలు రోజూ 0.4 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతాయట. దీని వల్ల ఈ కోరపళ్లను అవి ఎప్పటికప్పుడు అరగదీయాల్సిందే! లేదంటే అవి ఎలుకల దవడలను చీల్చుకుని బయటకు రావడంతో ఆహారం తినలేవట. దీంతో తిండిలేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందట. అందుకే అవి బతకాలంటే నిరంతరం దేన్నైనా కొరుకుతూ ఉండాలి. అయితే.. దాని వల్ల జరుగుతున్న నష్టం మాత్రం అపారం. తినటానికి పనికిరాకున్నా బలమైన విద్యుత్ తీగలు, ప్లాస్టిక్ వస్తువులను సైతం కొరికేస్తాయి. చిట్టెలుకలు తీసుకునే ఆహారం రోజుకు 28 గ్రాములే.. కానీ అవి కలిగించే నష్టం మనందరికీ తెలిసిందే. అమెరికాలో ఏటా 19 నుంచి 21 బిలియన్ డాలర్ల పంట నష్టం జరుగుతున్నట్లు లెక్కగట్టారు. ఎలుకలు తమ శరీర బరువులో దాదాపు 20 శాతం వరకు ఆహారంగా తీసుకుంటాయని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వన్యప్రాణి పరిశోధకుడు డాక్టర్ గ్రాంట్ సింగిల్టన్ తెలిపారు. ఒకేసారి కాకుండా రోజుకు 3–4 సార్లు తింటాయి. ఎలుక ఏడాదిలో 10 కేజీల ఆహారం తీసుకుంటే అది కొరికి నాశనం చేసే పంట తినేదానికి పదిరెట్లు అంటే.. దాదాపు 100 కిలోలు ఉంటుందని అంచనా.

- దేశంలో వరి, గోధుమ పంటలకు ఎలుకలు ఏటా 5 నుంచి 15% నష్టం కలిగిస్తున్నాయి. ఇతర అన్ని పంట లను కలిపితే నష్టం సుమారు 25%వరకు ఉంటుంది.
- ఎలుకల కారణంగా కాలిఫోర్నియాలో 504 మిలియన్ డాలర్ల పంట నష్టం జరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్–నేషనల్ వైల్డ్‌లైఫ్ రీసెర్చ్ సెంటర్ అంచనా వేసింది.
- ప్రపంచవ్యాప్తంగా 84 రకాల ఎలుకలున్నా 18 రకాల మూషికాలు పెద్ద ఎత్తున నష్టం కలిగిస్తున్నట్లు ఒడిశా స్టేట్ ఎన్విరాన్‌మెంట్ విభాగంతెలిపింది.
- ఒడిశాలోని 4 గ్రామాల్లో ఎలుకలు 3.60 టన్నుల ఆహార ధాన్యాలను నాశనం చేసినట్లు తేలింది. దుకాణాల్లోని గోడల్లో ఎలుకలు దాచిన ఆహార పదార్థాలను వెలికితీయగాఒక్కోచోట 16.64 నుంచి 21.5 కిలోలు గుర్తించారు.
- సుమారు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల పాటు జీవించే గోధుమ రంగు ఎలుకలు 21 రోజుల్లో 10 నుంచి 14 పిల్లలను పెడుతుంది. ఇవి నాలుగైదు వారాల్లోనే పరిపక్వ దశకు చేరి సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి. ఎలుకలు జతకడితే ఏడాదిలో వాటి సంతానం 1,000 దాటిపోతుంది.

వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఎలుకలతో పంటనష్టం




## క్లుప్తంగా...

### కవిత వాటా ఎంతో చెప్పాలి: తరుణ్ ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: కొన్ని కుటుంబాలవారు దొంగతనం, నేరాలు కుట్రలు, కుతంత్రాలు చేసినా, దేశాన్ని దోచుకున్నా విచారణ చేయకుండా మినహాయించాలని భారత శిక్షా స్మృతిలో ఎక్కడా లేదని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సంస్థలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకరించి కుట్ర కోణాన్ని వివరించాలన్నారు. అంతేగాక మద్యం కుంభకోణంలో వచ్చిన డబ్బులు ఎవరికి ఇచ్చారో, అందులో తన వాటా ఎంతో కవిత దర్యాప్తు సంస్థలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో తరుణ్ ఛుగ్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. దేశంలో దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పని చేస్తాయని, దేశానికి సంబంధించిన నిధులను దోచుకున్నవారిపై విచారణ తప్పకుండా జరగాల్సిందేనని అన్నారు. అంతేగాక ఆమ్‌ఆద్మీ పార్టీ మద్యం కుంభకోణం కోసం ఢిల్లీలో ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలను తెరిచి యువతను మత్తులో ముంచేందుకు ప్రయత్నించిందని మండిపడ్డారు. కుట్రలో భాగంగానే సెవెన్ స్టార్ హోటళ్లలో కూర్చొని మద్యం పాలసీని పలువురు ప్రముఖులు తయారు చేశారని, ఇప్పుడు దర్యాప్తు సంస్థల విచారణలో కుట్ర కుతంత్రాలు పూర్తిగా బట్టబయలవుతాయని తరుణ్ ఛుగ్ పేర్కొన్నారు.

### మహిళల రిజర్వేషన్ల కోసమే కవిత దీక్ష

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దీక్ష చేస్తున్నారని, దానిని వేరేగా చూడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసుకు, మహిళా రిజర్వేషన్ల అంశానికి సంబంధం లేదని, అవి రెండూ వేర్వేరు అంశాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, బీజేపీ నాయకురాలు డీకే అరుణ వ్యాఖ్యల తీరు విస్మయాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచేడమే కవిత, బీఆర్ఎస్ లక్ష్యమని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలి రోజుల్లోనే అసెంబ్లీలో సీఎం కేసీఆర్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

### ప్రభుత్వం మిల్లర్లకు అండగా ఉంటుంది

హైదరాబాద్/మాదాపూర్: మాదాపూర్ హైటెక్స్‌లో తెలంగాణ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 13వ ముఖాంబిక రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో –2023ను రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ శుక్రవారం ప్రారంభించారు. మంత్రులు మాట్లాడుతూ మిల్లింగ్ ఇండస్ట్రీ ఆధునీకరణ, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే ఉద్దేశంతో నిర్వహించే ఈ ఎక్స్‌పోకు హైదారాబాద్ వేదిక కావడం ఇది నాలుగోసారి అని సంతోషం వ్యక్తం చేశారు. మంత్రులు ఆధునిక యంత్రాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పరిశ్రమలు పవర్ హాలీడేలతో ఇబ్బందిపడేవని, ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి బయటపడ్డామని, బియ్యంపై మార్కెటింగ్ ఒక శాతం మాఫీ చేయడం, టీ–ఫారం సమస్యల పరిష్కారం, నూతన మిల్లుల ఏర్పాటు కోసం తెలంగాణ స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటుతో రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు అండగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మిల్లింగ్ ఇండస్ట్రీకి సహాయ సహకారాలు అందించాలని కోరారు. పెద్ద ఎత్తున జరుగుతున్న మిల్లింగ్‌కు అనుగుణంగా తగినన్ని గోదాములు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేందర్, ప్రధాన కార్యదర్శులు అన్నమనేని సుధాకర్‌రావు, మోహన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఈడీ ముందుకు కవిత

## ఢిల్లీ మద్యం కుంభకోణంలో విచారణ

- సౌత్‌గ్రూపు లావాదేవీలు, ఆరోపణలపై ప్రశ్నించే అవకాశం
- న్యాయనిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన కవిత
- వాంగ్మూలం వెనక్కి తీసుకుంటానన్న అరుణ్ పిళ్లై



అరుణ్ పిళ్లై

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి శనివారం ఉదయం 10.30 గంటలకు ఈడీ కార్యాలయంలో జరిగే విచారణకు ఎమ్మెల్సీ కవిత హాజరుకానున్నారు. సౌత్ గ్రూపు లావాదేవీలు, ఆప్ నేతలకు రూ.100 కోట్ల ముడుపులు, కిక్ బ్యాక్‌లు, ఫోన్లు మార్చడం, ధ్వంసం చేయడం తదితర ఆరోపణలపై విచారించే అవకాశం ఉందని తెలిసింది. హైదరాబాద్ నివాసంలో, ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో జరిగినట్టుగా చెబుతున్న సమావేశాలపై కూడా ప్రశ్నించవచ్చని సమాచారం. ఇండో స్పిరిట్స్ ఎల్1 దరఖాస్తుపై సమస్యలు వస్తే అరుణ్ పిళ్లై ద్వారా తనకు తెలియజేస్తే, తన స్థాయిలో పరిష్కరిస్తానని సమీర్ మహేంద్రుకు ఎమ్మెల్సీ కవిత తెలిపారని ఈడీ చార్జిషీట్‌లో ఆరోపించిన నేపథ్యంలో దీనిపైనా విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలావుండగా జంతర్‌మంతర్ వద్ద దీక్ష అనంతరం బసకు చేరుకున్న కవిత న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు.

**ప్రత్యేక కోర్టులో పిళ్లై పిటిషన్**

లిక్కర్ కేసులో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. తాను ఈడీకి ఇచ్చిన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకోవడానికి అవకాశం ఇవ్వాలని.. కవిత బినామీ అని ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లై విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో దీనిపై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఈడీని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. లిక్కర్ స్కామ్ కేసులో అరుణ్ పిళ్లైను ఈడీ ఇటీవల అరెస్టు చేసిన విషయం విదితమే. తాజాగా కవితను ఈడీ అధికారులు విచారించనున్న నేపథ్యంలో.. పిళ్లై వేసిన పిటిషన్ చర్చనీయాంశమయ్యింది.

# 'కోహినూర్'లో కుట్ర

- హైదరాబాద్‌లోని హోటల్‌లో లిక్కర్ పాలసీ, ఇతర కీలక అంశాలపై చర్చ
- ఇండో స్పిరిట్స్‌లో ఎమ్మెల్సీ కవితకు 32.5 శాతం వాటా
- పాలసీ తమకు అనుకూలంగా ఉంటే లాభాల్లో కొంత మొత్తం ఆప్‌కు ఇస్తామన్నారు
- సిసోడియా రిమాండ్ రిపోర్టులో ఈడీ ఆరోపణలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం అమలు ఎలా? లాభాలేంటి? అనే కీలక అంశాలపై చర్చంతా హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లోనే జరిగిందని ఈడీ పేర్కొంది. ఇండో స్పిరిట్స్‌లో ఎమ్మెల్సీ కవితకు 32.5 శాతం, మాగుంట రాఘవకు 32.5 శాతం, పరోక్షంగా సమీర్ మహేంద్రుకు 35 శాతం వాటా ఉందని తెలిపింది. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా రిమాండ్ రిపోర్టులో ఈడీ ఈ మేరకు ఆరోపణలు చేసింది.

**కవిత ప్రతినిధిగా అరుణ్ పిళ్లై**

'మనీశ్ సిసోడియా అనుచరుడు విజయ్ నాయర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను బట్టి చూస్తే.. ఇండో స్పిరిట్స్‌లో కవిత ప్రతినిధిగా అరుణ్ పిళ్లై వ్యవహరించారు. ఢిల్లీ సీఎం, డిప్యూటీ సీఎంలతో ఎమ్మెల్సీ కవితకు రాజకీయ అవగాహన ఉన్నట్టు ఆడిటర్ బుచ్చిబాబు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 2021 మార్చిలో విజయ్ నాయర్‌తో కవిత ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సమయంలో కవితను ఆకట్టుకొనేలా ఈ పాలసీ విషయంలో తానేం చేయగలనో విజయ్ నాయర్ స్పష్టం చేశారు. కాగా పాలసీ తమకు అనుకూలంగా ఉంటే వచ్చే లాభాల్లో కొంత మొత్తం ఆప్‌కు ఇస్తామని కవిత తెలిపారు. ఢిల్లీలో ఈ సమావేశం అనంతరం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో 2021 జూన్‌లో మరో సమావేశం జరిగింది.

**కోహినూర్‌లో ఏం జరిగిందంటే..**

ఐటీసీ కోహినూర్‌లో జరిగిన సమావేశ వివరాలను కూడా ఈడీ వివరించింది. 'తనతో పాటు విజయ్ నాయర్, అర్జున్ పాండే, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు, అరుణ్‌పిళ్లైలు సమావేశమయ్యారని దినేష్ అరోరా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ సమావేశంలోనే అభిషేక్ బోయినపల్లితో సమన్వయం చేసుకొని రూ. 30 కోట్ల వరకు తీసుకోవాలని దినేష్ అరోరాకు విజయ్‌నాయర్ సూచించారు. కవిత సభ్యురాలిగా ఉన్న సౌత్ గ్రూపు, విజయ్ నాయర్‌ల మధ్య రూ.100 కోట్ల అడ్వాన్స్ పేమెంట్ ఇవ్వాలన్న ఒప్పందం జరిగిందని దినేష్ అరోరా తెలిపారు., దీన్ని అరుణ్ పిళ్లై తన స్టేట్‌మెంట్‌లో ధ్రువీకరించారు. 2022 ఏప్రిల్‌లో ఢిల్లీలోని ఒబెరాయ్ మైడెన్స్‌లో జరిగిన సమావేశానికి దినేష్ అరోరా, అరుణ్ పిళ్లై, విజయ్ నాయర్, కవిత వచ్చారని, సౌత్ గ్రూపు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి వెనక్కి రావడం ఎలా అన్నదానిపై చర్చించారని.. దినేష్ అరోరా, అరుణ్ పిళ్లైలు స్టేట్‌మెంట్‌లు ఇచ్చారు..' అని ఈడీ పేర్కొంది.

**కవితకు వాటాలు దక్కాయి..**

హైదరాబాద్ నుంచి కొన్ని నిధులు బదిలీ చేయాలని విజయ్ నాయర్ కోరగా అభిషేక్ బోయినపల్లితో సమన్వయం చేసుకోవాలని సౌత్ గ్రూపు సూచించింది. అనంతరం విజయ్ నాయర్ వాట్సాప్ చాట్‌ల ద్వారా సమీర్ మహేంద్రు, మాగుంట రాఘవ, కవితలకు 33 శాతం చొప్పున వాటా అనుకుంటున్నామని తెలిపారు. అయితే 75% కన్నా తక్కువ వాటా ఉంటేతన తండ్రి ఎంఎస్ రెడ్డి సంతోషంగా ఉండరని రాఘవ రిప్లై ఇచ్చారు. కవిత, అగ్రశ్రేణి ఆప్ లీడర్ల మధ్య కుదిరిన డీల్‌లో భాగంగా సమీర్, పెర్నార్డ్‌ల భాగస్వామ్యంతో కవితకు వాటాలు దక్కాయి..'అని ఈడీ ఆరోపించింది.

# ఢిల్లీకి మంత్రి కేటీఆర్

## నేడు, రేపు హస్తినలోనే మకాం



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ముందు విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమె సోదరుడు, మంత్రి కేటీఆర్ శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. శని, ఆదివారాలు ఢిల్లీలోనే ఉండనున్నట్లు సమాచారం. లిక్కర్ స్కామ్‌లో వంద కోట్ల ముడుపుల ఆరోపణలపై కవిత, అరుణ్ రామచంద్ర పిళ్లై, ఆడిటర్ బుచ్చిబాబులను ఏకకాలంలో విచారించ వచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురు సౌత్ గ్రూపులో కీలక భూమిక పోషించారనే ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల విచారణ తరువాత కవితను అరెస్టు చేయవచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కవితకు నైతిక మద్దతుగా నిలిచేందుకు కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయమై న్యాయ నిపుణులతోనూ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కొంతమంది బీఆర్ఎస్ నేతలు కూడా ఢిల్లీకి వెళ్తున్నారు. కవితకు న్యాయవాదులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

# కవితకు దీక్ష చేసే అర్హత లేదు

- రాష్ట్రంలో మహిళల సమస్యలపై ఇన్నాళ్లు స్పందించలేదేం?
- 'మహిళా గోస– బీజేపీ భరోసా' దీక్షలో బండి సంజయ్ మండిపాటు
- బీఆర్ఎస్, ఎంఐఎంల జెండాలను చూస్తేనే మహిళలు భయపడుతున్నారని వ్యాఖ్య
- తప్పు చేయనప్పుడు కవిత భయపడటం దేనికి: డీకే అరుణ



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన దీక్షలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో డీకే అరుణ, లక్ష్మణ్, చింతల రాంచంద్రారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''సీఎం కేసీఆర్ బిడ్డ కవితకు మహిళా బిల్లుపై ఢిల్లీలో దీక్ష చేసే అర్హత, మాట్లాడే నైతికహక్కు లేవు. రాష్ట్రంలో మహిళల సమస్యలు, వారిపై సాగుతున్న అఘాయిత్యాలు, అన్యాయంపై కవిత ఏనాడూ నోరు మెదపలేదు. రాష్ట్రంలో మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా, నడిరోడ్డుపై హత్యలు జరుగుతున్నా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మొదట కవిత తన తండ్రి ఇంటి ఎదుట ధర్నా చేసి మహిళలకు జరుగుతున్న అన్యాయంపై స్పందించడం లేదేమని నిలదీస్తే బాగుండేది''అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'మహిళా గోస– బీజేపీ భరోసా'పేరిట పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పలువురు మహిళా నేతలు నిరసన దీక్ష నిర్వహించారు. బండి సంజయ్ ఈ దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఏమైనా సంబంధం ఉందా, దీనిపై ఎందుకు స్పందించడం లేదని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తుంటే ప్రజాసమస్యలపై పోరాడుతున్న పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, ఎంఐఎంల జెండాలను చూస్తేనే మహిళలు భయపడే పరిస్థితి నెలకొందని బండి సంజయ్ విమర్శించారు. గతంలో మహిళా బిల్లు ప్రతులను పార్లమెంటులోనే చించి పడేసిన ఎస్పీ, ఆర్జేడీ, ఎంఐఎంలతో బీఆర్ఎస్ అంటకాగుతూ దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

**మరి ఈ కేసులు బీఆర్ఎస్ పెట్టించినవా?: కె.లక్ష్మణ్**

సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తోందని కేటీఆర్ అంటున్నారని.. మరి రాష్ట్ర పోలీస్, ఏసీబీ పెట్టిన కేసులన్నీ బీఆర్ఎస్ పెట్టించినవేనా? అని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. తెలంగాణలో మద్యం ఆదాయ మార్గంగా మారి ఢిల్లీ నుంచి పంజాబ్ దాకా పాకిందని విమర్శించారు.

**లిక్కర్ స్కామ్‌పై కాంగ్రెస్ మాట్లాడదేం?: డీకే అరుణ**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై కాంగ్రెస్ ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. ఎలాంటి తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ఈడీ కేసులకు, కవిత ధర్నాకు ఏమైనా సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానిస్తుంటే.. మహిళా ప్రజాప్రతినిధులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ దీక్షలో పార్టీ నేతలు జి.ప్రేమేందర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, ఆకుల విజయ, డాక్టర్ పద్మ, మాజీ మేయర్ కార్తీకరెడ్డి, సులోచన, గీతారాణి తదితరులు పాల్గొన్నారు. కాగా మహిళా దీక్ష సందర్భంగా బండి సంజయ్, డీకే అరుణలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఫోన్ చేసి అభినందించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హత్యలను నిరసిస్తూ దీక్ష చేయడం అభినందనీయమన్నారు.

**కేసీఆర్ ఫ్యామిలీని వదిలిపెట్టే ప్రసక్తే లేదు**

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''సీఎం నిర్వహించిన బీఆర్ఎస్ నేతల సమావేశం సంతాప సభను తలపించింది. ఆయన ముఖంలో భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అవినీతికి పాల్పడ్డ కేసీఆర్ ఫ్యామిలీని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆ కుటుంబంలో ఒక వికెట్ క్లీన్‌బౌల్డ్ అయింది. తప్పు చేసినోళ్ల సంగతి తేలుస్తాం''అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండేది మరో మూడు, నాలుగు నెలలేనని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. టీఎన్జీవో నాయకుల చిట్టా తీస్తున్నామని, తాము అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తామని హెచ్చరించారు.

# ఆమోదించే వరకు పోరాటం



కవితకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న సీపీఐ నేత నారాయణ

▶ మొదటి పేజీ తరువాయి

భారత్ జాగృతి ఆధ్వర్యంలో కవిత చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షను సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించారు. కాగా సాయంత్రం 4 గంటలకు సీపీఐ కార్యదర్శి నారాయణ, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావులు కవితకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.

**బిల్లుతో దేశ ప్రజాస్వామ్యం బలోపేతం**

మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం తన సమస్యో, తన రాష్ట్రం సమస్యో కాదని, మొత్తం దేశానికి సంబంధించిన సమస్య అని కవిత చెప్పారు. ఇది రాజకీయ పరమైన అంశం కూడా కాదని స్పష్టం చేశారు. ఈ బిల్లుపై ప్రతిపక్షం సహా అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నాయని, కానీ పార్లమెంటులో ఆమోదం పొందేలా ఏ పార్టీ కూడా కృషి చేయడం లేదని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందాలంటే పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన ప్రాతినిధ్యం అవసరమని అన్నారు. ఈ బిల్లు చారిత్రక అవసరమని, మహిళలకు 33% రిజర్వేషన్లు అందించడం వల్ల దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

**మహిళా భాగస్వామ్యంతోనే అభివృద్ధి: ఏచూరి**

రాజకీయ రంగంలో మహిళా రిజర్వేషన్లు చాలా అవసరమని ఏచూరి అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమానత్వం ఎప్పటివరకు రాదో అప్పటివరకు అభివృద్ధి జరగదని తెలిపారు. మహిళా భాగస్వామ్యం లేని ఏ దేశం కూడా ఆర్థికంగా పురోగతి సాధించలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై ప్రధాని మోదీ హామీ ఇచ్చి 9 ఏళ్లు గడిచినా ఇప్పటికీ బిల్లు తీసుకురాలేదని విమర్శించారు. భారత్ జాగృతి, బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తామని, ఈ పోరాటానికి తమ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.

**మోదీ జవాబు చెప్పాలి: ఆప్ ఎంపీ**

అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నప్పుడు ఆ బిల్లు ఎందుకు ఆమోదం పొందడం లేదో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. మరోమంత్రి సబిత, బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, వెంకటేశ్ నేత, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆకుల లలిత, భారత్ జాగృతి నేతలు దీక్షలో పాల్గొన్నారు. వివిధ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు.

**తలుచుకుంటే రెండు గంటల్లో ఆమోదించొచ్చు**

పార్లమెంటులో పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకురావాలని, ఆ పార్టీ తలుచుకుంటే రెండు గంటల్లో ఈ బిల్లును ఆమోదించవచ్చని కవిత చెప్పారు. పార్లమెంటులో బిల్లు పెడితే మద్దతు ఇవ్వడానికి అనేక పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, తాము కూడా మద్దతు ఇస్తామని చెప్పారు. 1992లో స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఫలితంగా నేడు 21 రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల్లో 50 శాతానికి పైగా మహిళా ప్రాతినిధ్యం ఉందని వివరించారు. చట్టసభల్లో కూడా 33% రిజర్వేషన్లు కల్పిస్తే.. 10–20 ఏళ్ల తర్వాత పార్లమెంటు, అసెంబ్లీల్లో సైతం మహిళల ప్రాతినిధ్యం 50 శాతానికి పైగా పెరుగుతుందని తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లు తెచ్చేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని పార్టీలను కోరారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీక్షకు వచ్చిన మహిళల సంతకాలతో కూడిన లేఖను రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపిస్తామని వెల్లడించారు.



జంతర్ మంతర్ వద్ద దీక్షలో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో వేణుగోపాలచారి, రవిచంద్ర, నారాయణ, కేశవరావు, సబిత, సత్యవతి తదితరులు

# కవిత దీక్ష విజయవంతం

- సుమారు 5 వేల మంది హాజరు
- యూపీ, ఢిల్లీ, పంజాబ్ నుంచే ఎక్కువమంది
- 18 పార్టీల సంఘీభావం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలంటూ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్ష విజయవంతం అయింది. శుక్రవారం జంతర్‌మంతర్‌లో చేపట్టిన ఈ దీక్షకు తెలంగాణతోపాటు ఢిల్లీ, దాని పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. భారత్ జాగృతి చెప్పినట్లుగానే సుమారు 5 వేల మంది ఈ దీక్షలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి వచ్చిన బీఆర్ఎస్ నేతలు, కవిత అనుచరులు కలిపి ఐదారువందల మంది రాష్ట్రనేతలు హాజరుకాగా, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు దీక్షకు తరలివచ్చారు. ఢిల్లీలోని జేఎన్‌యూ, జామియా యూనివర్సిటీలతో పాటు చుట్టుపక్కల వర్సిటీల నుంచి వచ్చిన యువతులు ఆరంభం నుంచి ముగింపు వరకు దీక్షలో పాల్గొన్నారు. 18 పార్టీల నేతలు, ప్రతినిధులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దీక్షను ఆరంభించగా, సీపీఐ నేత నారాయణ తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. సంజయ్ సింగ్, చిత్ర సర్వార (ఆప్), నరేష్ గుజ్రాల్ (అకాలీదళ్), అంజుమ్ జావెద్ మిర్జా (పీడీపీ), షమీ ఫిర్దౌజ్ (నేషనల్ కాన్ఫరెన్స్), సుస్మితా దేవ్ (టీఎంసీ), కేసీ త్యాగి (జేడీయూ), సీమా మాలిక్ (ఎన్‌సీపీ), పూజ శుక్లా (ఎస్పీ), శ్యామ్ రజక్ (ఆర్జేడీ)తోపాటు శివసేన నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ కిసాన్ యూనియన్, నేషనల్ క్రిస్టియన్ బోర్డు, తమిళనాడు, కేరళ రైతు సంఘాల ప్రతినిధులు, సింగరేణి కోల్ మైన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాలుపంచుకున్నారు.

**కేంద్ర ఇంటెలిజెన్స్ నిఘా**

కవిత చేపట్టిన దీక్షపై కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టాయి. దీక్షకు హాజరైన రాష్ట్ర నేతలతో పాటు, వివిధ పార్టీల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువత వివరాలన్నింటినీ సేకరించాయి. సివిల్ దుస్తుల్లో ఉన్న సుమారు 20 మందికి పైగా ఇంటెలిజెన్స్ అధికారులు దీక్ష జరిగినంత సేపూ అక్కడే ఉండి ప్రతి విషయాన్ని నోట్ చేసుకున్నారు. వేర్వేరు భాషల్లో మాట్లాడిన నేతల ప్రసంగాలను అక్కడే మీడియా ప్రతినిధులు, ఇతరులతో తర్జుమా చేయించుకోవడం కనిపించింది. కవిత శనివారం ఈడీ ముందు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల వైఫల్యం చోటు చేసుకోకూడదన్న ఉద్దేశంతోనే ఇంటెలిజెన్స్ కన్నేసినట్లు చెబుతున్నారు.

## కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించేలా ఒత్తిడి పెంచండి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జేరిపోతుల పరశురామ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ నెల 13 నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ పరశురామ్ చేపట్టిన ప్రజాపోరు రథయాత్ర శుక్రవారం ఢిల్లీ చేరుకుంది. ఈ సందర్భంగా కవితను ఆయన కలిశారు. మహిళా బిల్లు కోసం కవిత చేపట్టిన దీక్షకు పరశురామ్ సంఘీభావం తెలిపారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించేలా బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో మాట్లాడాలని కోరారు. కొంతకాలంగా ఈ డిమాండ్ సాధనకై పాదయాత్ర, ప్రజాచైతన్య రథయాత్ర, నిర్వహించిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ చింత అనురాధ లోక్‌సభలో మాట్లాడారని తెలిపారు.

# చిన్నారుల కోసం 'సంసిద్ధ'ం!




మూడేళ్లలోపు పిల్లల ఆలన–పాలన కోసం ప్రత్యేక యాప్

రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపకల్పన

- 'ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్' కాన్సెప్ట్‌తో నిర్వహణ
- వచ్చే వారంలో లింకు విడుదల చేయనున్న డబ్ల్యూడీసీడబ్ల్యూ
- ఆ తర్వాత గూగుల్ ప్లేస్టోర్ ద్వారా అందుబాటులోకి..

సాక్షి, హైదరాబాద్: చిన్న పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, అభ్యసన కార్యక్రమాలపై అవగాహన కోసం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యూడీసీడబ్ల్యూ) సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతం చేస్తోంది. ప్రత్యేకంగా యాప్ (అప్లికేషన్) రూపొందించి అందుబాటులోకి తీసుకొస్తోంది. సంసిద్ధ పేరిట తయారు చేసిన ఈ యాప్‌ను అతి త్వరలో తల్లిదండ్రులు, ప్రీస్కూల్ నిర్వాహకులకు వినియోగంలోకి తేనుంది. చిన్నారుల ఆరోగ్య సలహాలు, ప్రీస్కూల్ అంశాలపై ఇప్పటికే పలు సామాజిక మాధ్యమాలు, వివిధ యాప్‌లు అందుబాటులో ఉండగా... సంసిద్ధ ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) లక్ష్యంతో రూపొందించిన ఈ యాప్ పూర్తిగా తెలుగులో, ప్రతిఒక్కరికీ అర్థమయ్యే రీతిలో ఉంటుంది. ప్రస్తుతం యాప్ తయారీ పూర్తికాగా, వివిధ రకాల వీడియోలను ఇందులో అప్‌లోడ్ చేస్తున్న రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ యంత్రాంగం... వచ్చే వారంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు వేగవంతం చేసింది.

## రెండు మాడ్యూల్స్‌తో..

సంసిద్ధ యాప్‌లో రెండు రకాల మాడ్యూల్స్ ఉన్నాయి. మూడేళ్లలోపు చిన్నారులకు ప్రీస్కూల్ విద్యపట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు ఒక మాడ్యూల్‌లో ఉంటాయి. ఇందులో తెలుగు ఇంగ్లిష్, హిందీ పద్యాలు, చిన్నపాటి కథలు వినొచ్చు. వీటితోపాటు ప్రీస్కూల్ కోసం చేసిన పుస్తకాలు, పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలు, అసెస్‌మెంట్ విధానాలన్నీ ఉంటాయి. ఈ యాప్ ప్రతి అంగన్‌వాడీ టీచర్ వద్ద అందుబాటులో ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, బోధించాల్సిన అంశాలను ప్రతిరోజూ గుర్తు చేస్తుంది. పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల, చైతన్యపరిచే అంశాలతో మరో మాడ్యూల్ ఉంటుంది. పిల్లలకు ఏయే వయసులో ఎలాంటి ఆహారాన్ని అందించాలి, అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బరువు కొలతలు, ఆహార పదార్థాల పంపిణీ తదితరాలన్నీ వివరంగా ఉంటాయి. ఈ యాప్‌ను కేవలం అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లే కాకుండా చిన్నారుల తల్లిదండ్రులు సైతం ఇన్‌స్టాల్ చేసుకోవచ్చని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం యాప్ రూపకల్పన పూర్తికాగా... వీడియోల అప్‌లోడ్, ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. వచ్చే వారంలో ఈ యాప్‌కు సంబంధించిన లింకును వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ముందుగా అంగన్‌వాడీ సిబ్బంది ఈ యాప్‌ను పరిశీలించనున్నారు. ఆ తర్వాత గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## 'మిల్లెట్లను ప్రాచుర్యంలోకి తీసుకురావాలి'

సాక్షి, హైదరాబాద్: మిల్లెట్ల (చిరుధాన్యాలు)ను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని నాబార్డు సీజీఎం సుశీల చింతల పిలుపునిచ్చారు. నాబార్డు, ఐకార్–నార్మ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి మిల్లెట్ సదస్సు జరిగింది. ఇక్రిశాట్, ఐకార్–క్రిడా, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అపెడా, రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు, స్టార్టప్‌ల నుంచి 300 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ, 2023ను మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో నాబార్డు దేశవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మిల్లెట్లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతినిధులను కోరారు.



సర్వ కర్మలన్నీ నాలో వదిలి, నన్నే లక్ష్యముగా ధ్యానిస్తూ ఎవరు ఉపాసిస్తారో, వాళ్ళను మృత్యుసంసార సాగరం నుండి నేనే ఉద్ధరిస్తాను.
– భగవద్గీత



సాక్షి
శనివారం, మార్చి, 11

# భారత్‌–ఆస్ట్రేలియా బంధం

దేశాల మధ్య బంధాలు బలపడటం, అవి కొత్త పుంతలు తొక్కటం, కూటమిగా కలిసి కదలాలను కోవటంవంటి పరిణామాలు మారుతున్న అంతర్జాతీయ స్థితిగతులకు అద్దం పడతాయి. ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌ ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల సందర్భంగా రెండు దేశాలమధ్యా పలు ఒప్పందాలు కుదరటం ఆ కోణంలో కీలక పరిణామమనే చెప్పాలి. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య ఏడాదికిపైగా సాగుతున్న లడాయి కారణంగా చైనాపై మునుపటంత దృష్టి కేంద్రీకరించటం లేదని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్న తరుణంలో గతవారం ఢిల్లీలో చతుర్భుజ కూటమి(క్వాడ్‌) విదేశాంగ మంత్రుల సదస్సు జరిగింది. అందులో మన విదేశాంగమంత్రి జైశంకర్‌తోపాటు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, జపాన్‌ విదేశాంగ మంత్రి హయాషీ యొషిమసా, ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పెన్నీ వాంగ్‌లు పాల్గొన్నారు. దానికి కొనసాగింపుగానే ఆల్బనీస్‌ బుధవారం మన దేశం వచ్చారు. వచ్చేవారం జపాన్‌ ప్రధాని ఫుమియో కిషిదా రాబోతున్నారు. ఈ సందడంతా సహజంగానే చైనాకు కంటగింపుగా ఉంటుంది. దక్షిణాసియాలో, హిందూ మహా సముద్ర ప్రాంతంలో తన ప్రాబల్యాన్ని పెంచుకోవటానికి ప్రయత్నించటం, బెల్ట్‌ అండ్‌ రోడ్‌ ఇన్షియేటివ్‌(బీఆర్‌ఐ) పేరిట మన వ్యూహాత్మక ప్రాంతాలను తాకేలా ప్రాజెక్టు రూపకల్పన చేయటం వగైరా పనులు చైనావైపు నుంచి ముమ్మరమయ్యాక మన దేశం క్వాడ్‌పై ఆసక్తి ప్రదర్శించటం మొదలుపెట్టింది. వాస్తవాధీన రేఖ వద్ద చైనా గిల్లికజ్జాలు పెట్టుకునే రీతిలో వ్యవహరించటం కూడా మన దేశానికి ఆగ్రహం తెప్పించింది. మొదట పదహారేళ్లక్రితం క్వాడ్‌ ఏర్పాటు ప్రతిపాదన వచ్చినప్పుడు భారత్‌ పెద్దగా స్పందించలేదు. కేవలం చైనా వ్యతిరేకత ఒక్కటే క్వాడ్‌కు ప్రాతిపదిక కారాదని చెప్పింది. వాస్తవానికి చైనాతో మనకన్నా జపాన్‌కూ, ఆస్ట్రేలియాకూ సమస్యలు అధికం. దక్షిణ చైనా సముద్ర జలాల్లో జపాన్‌కూ, పశ్చిమ పసిఫిక్‌ ప్రాంతంలో ఆస్ట్రేలియాకూ చైనా తలనొప్పిగా మారింది. ఇక చైనాతో అమెరికాకు ఉన్న సమస్యలు సరేసరి. ప్రపంచ ఆధిపత్యం కోసం చైనా తనతో పోటీపడుతోందని, దీన్ని సకాలంలో కట్టడి చేయకపోతే తన పలుకుబడి తగ్గినా తగ్గొచ్చని అమెరికా ఎప్పటినుంచో భావిస్తోంది. అందువల్లే దీర్ఘకాలంగా తనకు నమ్మదగ్గ మిత్రులుగా ఉన్న నాటో కూటమినీ, ఆస్ట్రేలియా, జపాన్‌లనూ అందుకు అనుగుణంగా అడుగులేయిస్తోంది. తాజాగా మలబార్‌ తీరంలో తమ ఆధ్వర్యంలో తొలిసారి క్వాడ్‌ దేశాల నావికా దళాల విన్యాసాలు నిర్వహించటంతోపాటు ఆస్ట్రేలియాలో జరపబోయే నావికాదళ విన్యాసాలకు భారత్‌ను ఆహ్వానిస్తున్నామని ఆల్బనీస్‌ ప్రకటించటం భద్రత, రక్షణ రంగాల్లో రెండు దేశాలమధ్యా పెరిగిన సహకారాన్ని సూచిస్తోంది.

ఇతరేతర రంగాలకు సైతం క్వాడ్‌ దేశాల సహకారం పెంపొందాలని రెండేళ్లక్రితం ఆన్‌లైన్‌ వేదికగా జరిగిన తొలి శిఖరాగ్ర సదస్సు నిర్ణయించింది. అటుపై అనేకానేక అంశాలపై క్వాడ్‌ దేశాల మధ్య ఒప్పందాలు కుదురుతున్నాయి. కరోనా వైరస్‌ వ్యాక్సిన్‌ ఉత్పత్తి, వాతావరణ మార్పులు, కీలక సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపువంటి అంశాలపై పరస్పర అవగాహన ఏర్పడింది. ఆంథోనీ ఆల్బనీస్‌ పర్యటన దానికి కొనసాగింపే. నిరుడు రెండు దేశాలూ ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందం (ఈసీటీఏ) కుదుర్చుకున్నాయి. అయితే అంతకు చాన్నాళ్లముందే... అంటే 2011లో మొదలై 2016 వరకూ చర్చలు సాగి అర్థంతరంగా నిలిచిపోయిన సమగ్ర ఆర్థిక సహకారం ఒప్పందం(సీఈసీఏ)పై మాత్రం కదలిక లేదు. రెండేళ్లనుంచీ మళ్లీ చర్చలు సాగుతున్నా ఇంతవరకూ అవి ఓ కొలిక్కి రాలేదు. కానీ ఆల్బనీస్‌ మాత్రం ఈ ఏడాదే ఆ ఒప్పందంపై సంతకాలవుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. దాని సంగతలావుంచి విద్యారంగంలో ఇరు దేశాలమధ్యా చాన్నాళ్లనుంచి తలెత్తిన సమస్యలు పరిష్కారం కావటం లక్షలాదిమంది విద్యార్థులకు ఊరటనిస్తుంది. నిరుడు మన దేశంనుంచి 7.7 లక్షలమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, బ్రిటన్‌ తదితర దేశాలకు వెళ్లారు. అక్కడ లక్షలాది రూపాయలు వ్యయం చేసి చదువుకుని డిగ్రీలు, డిప్లొమోలు తెచ్చుకున్నా మన దేశంలో ఉద్యోగాలకు వాటిని పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఈ సమస్య పరిష్కారానికి భారత్, ఆస్ట్రేలియాలు రెండూ తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. రెండు దేశాల విశ్వవిద్యాలయాలూ తాము విద్యార్థులకు ప్రదానం చేసే పట్టాలను పరస్పరం గుర్తించాలన్న నిర్ణయం జరిగింది.

వాతావరణం, సౌర శక్తి, హైడ్రోజన్‌ వంటి హరిత ఇంధనాల విషయంలో సహకారం మరింత పెంపొందాలని ఇరు దేశాలూ భావించాయి. ఇప్పటికే వ్యవసాయం, దుస్తులు, రైల్వే ఇంజిన్లు, టెలికాం పరికరాలు తదితరాలు మన దేశం నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతుండగా, అక్కడి నుంచి మన పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలూ, ఖనిజ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంథోనీ ఆల్బనీస్‌ల మధ్య జరిగిన చర్చల్లో ఖనిజాల ఎగుమతులు, దిగుమతులపై మరింత శ్రద్ధ పెట్టాలని నిర్ణయించటం ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణకు తోడ్పడుతుంది. వచ్చే మే నెలలో ఆస్ట్రేలియాలో క్వాడ్‌ దేశాల శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. పరస్పర సహకారం, సమానత్వ ప్రాతిపదికన దౌత్య సంబంధాలు దేశాల చెలిమిని కొత్త పుంతలు తొక్కిస్తాయి. దేశాలమధ్య వైషమ్యాలు, ఘర్షణలు అంతిమంగా ఆ దేశాలు నష్టపోవటానికే దోహదపడతాయి. ఈ సంగతిని అందరూ గ్రహించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది.

## గ్రహం అనుగ్రహం

**శ్రీ శుభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు.**
ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చవితి రా.8.16 వరకు, తదుపరి పంచమి,
**నక్షత్రం:** స్వాతి పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.11.41 నుండి 1.19 వరకు,
**దుర్ముహూర్తం:** ఉ.6.17 నుండి 7.51 వరకు,
**అమృతఘడియలు:** రా.9.24 నుండి 11.02 వరకు.

**సూర్యోదయం :** 6.16
**సూర్యాస్తమయం:** 6.04
**రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు

# పంజాబ్‌లో పొంచి ఉన్న ముప్పు

విశ్లేషణ



జూలియో రిబేరో

**'రాడికల్‌ మతబోధకుడు' అమృత్‌పాల్‌ సింగ్‌ గత సంవత్సరం దాకా నీట్‌గా షేవ్‌ చేసుకున్నాడు. తనలోని సహజ ప్రతిభలకు అవకాశం లభించనుందని గ్రహించి గడ్డం పెంచడం ప్రారంభించాడు. పోలీసులు చర్య తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు గురు గ్రంథ్‌ సాహిబ్‌ను తన అనుచరులు నిత్యం వెంట ఉంచుకునేలా చేశాడు. ఇప్పుడు సమస్యల్లా పంజాబ్‌లో ఉగ్రవాదం తిరిగి పొడసూపే అవకాశం ఉండటమే. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన పొరుగుదేశం మళ్లీ సరిహద్దు పొడవునా ఘర్షణలు రేపడానికి ప్రయత్నించవచ్చు. అందుకే ఆప్‌ సర్కారు వైఫల్యం పేరుతో తనకు స్వాగతం పలకని రాష్ట్రంలో ప్రయోజనాలు పొందడానికి కేంద్రం ప్రయత్నించకూడదు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ద్విముఖ వ్యూహం అవసరం.**

'రాడికల్‌ మతబోధకుడి'గా అభివర్ణిస్తున్న అమృత్‌పాల్‌ సింగ్‌ మరో భింద్రాన్‌వాలే కావాలని ఆశ పడుతున్నాడు. అయితే, ఈ లక్ష్యాన్ని సాధించడం అంత సులభం కాదు. తప్పుదోవ పట్టిన రాజకీయ తంత్రాల ఉత్పత్తి – భింద్రాన్‌వాలే. నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, తీవ్రరూపం దాల్చిన రష్యా–ఉక్రెయిన్‌ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కలిగించిన ప్రభావాలు వంటి వాటి కారణంగా పంజాబ్‌ యువతలో ఏర్పడిన ప్రస్తుత నిస్పృహ స్థితిని వాడుకోవాలని అమృత్‌పాల్‌ స్పష్టంగా కోరుకుంటున్నాడు.

మీడియా నివేదికల ప్రకారం, అమృత్‌పాల్‌ అనుయాయుల్లో ఒకరైన లవ్‌ ప్రీత్‌ సింగ్‌ 'తూఫాన్‌'ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చామ్‌కౌర్‌ సాహిబ్‌కు చెందిన వరీందర్‌ సింగ్‌ను అపహరించి, దాడి చేశారనే ఆరోపణలపై అతడిని అరెస్టు చేశారు. దీనిపై అజ్‌నాలా పోలీస్‌ స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లో అమృత్‌పాల్‌ పేరు కూడా జోడించారు. లవ్‌ప్రీత్‌ విడుదలకు డిమాండ్‌ చేస్తూ పోలీసు స్టేషన్‌ వరకు మార్చ్‌ చేయాలని అమృత్‌పాల్‌ ప్రకటించాడు. సమస్య తీవ్రతను గ్రహించడంతో చుట్టుపక్కల పోలీసు స్టేషన్ల నుంచి పోలీసు బలగాలను రప్పించి అజ్‌నాలా వద్ద మోహరించారు.

అమృత్‌పాల్, అతడి 'వారిస్‌ పంజాబ్‌ దే' సంస్థకు చెందిన మద్దతు దారులు భారీస్థాయిలో కత్తులు, కొందరు తుపాకులు కూడా ధరించి బారికేడ్లను ఛేదించుకుని పోలీసు స్టేషన్‌లో ప్రవేశించారు. ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం కలిగించారు. గుంపు తమపై దాడిచేస్తే ఏం చేయాలనే విషయమై వందమంది శిక్షణ పొందిన పోలీసులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చివుంటే సాధారణ పరిస్థితుల్లో వీరు గుంపుతో సమర్థంగా వ్యవహరించి వారిని చెదరగొట్టి ఉండేవారు. అయితే మూకహింసను ఎదుర్కోవడానికి ఎంతమేరకు బలాన్ని ప్రయోగించవచ్చో స్పష్టంగా వారికి చెప్పనట్లయితే, పరిస్థితి అదుపు తప్పడానికే ఆస్కార ముంటుంది. అదే జరిగింది కూడా. సదరు పోలీసు స్టేషన్‌లో జరిగిన ఘటన పోలీసు నాయకత్వం, రాష్ట్ర రాజకీయ నాయకత్వం వైఫల్య మేనని నేను కచ్చితంగా చెబుతాను.

వార్తల ప్రకారం సీనియర్‌ ఐపీఎస్‌ అధికారులు తర్వాత స్పందించి, అమృత్‌పాల్‌తో మాట్లాడారు. వరీందర్‌ కిడ్నాప్‌ వ్యవహారంలో లవ్‌ప్రీత్‌ పాత్ర లేదని అమృత్‌సర్‌ పోలీస్‌ కమిషనర్, అజ్‌నాలా ఎస్‌ఎస్‌పీకి అమృత్‌పాల్‌ నచ్చజెప్పినట్లు కనబడుతోంది. దాంతో లవ్‌ప్రీత్‌ను విడుదల చేయడానికి సీనియర్‌ అధికారులు అంగీకరించారు. ఇలా లొంగిపోవడం ఇకనుంచీ పోలీసు, రాజకీయ నాయకత్వానికి సమస్యలు తీసుకొస్తుంది.

తన ప్రాథమిక ఫిర్యాదులో లవ్‌ప్రీత్‌ పేరును వరీందర్‌ బయట పెట్టారు. అలాంటప్పుడు నిజంగా కిడ్నాప్‌ ఘటన జరిగిందా అని



పోలీసులు తనిఖీ చేసివుండవలసింది. వరీందర్‌ను కొట్టిందెవరు? అమృత్‌పాల్‌ వ్యాఖ్యలను అతడు వ్యతిరేకించినట్లు చెబుతున్నారు. అదే నిజమైతే, దాడి వెనుక ఉద్దేశం అర్థమవుతోంది.

ఇలాంటి ముఖ్యమైన రాజకీయ పరిణామం పట్ల అజ్‌నాలా పోలీసులు తమ పైఅధికార్లను లూపులో పెట్టివుండవచ్చు. అయిదు పోలీసు స్టేషన్లపై అధికారం కలిగిన ఆఫీసర్‌ మాత్రమే సమీప పోలీసు స్టేషన్ల నుంచి అదనపు బలగాల మోహరింపునకు ఆదేశాలు ఇవ్వగలడు. ఒకవేళ సాయుధ బటాలియన్‌ నుంచి రిజర్వ్‌ బలగాలను తరలించి ఉంటే, అలాంటి ఆదేశం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి మాత్రమే వచ్చి ఉంటుంది. అలాంటప్పుడు ఎఫ్‌ఐఆర్‌లో పొందుపర్చిన వ్యక్తిని అరెస్టు చేయాలనే నిర్ణయం గురించి తమకు తెలీదని సీనియర్లు చెప్పుకొనే అవకాశమే లేదు.

చట్టవిరుద్ధమైన డిమాండ్లకు లొంగిపోవడంలో రాజకీయ నాయకత్వం పాత్రను నేను చూస్తున్నాను. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రికి తెలీకుండా పోయే ప్రశ్నే లేదు. భగవంత్‌ మాన్‌ నేతృత్వంలోని ఆమ్‌ ఆద్మీ ప్రభుత్వం ఇంకా భద్రతా రంగంపై పట్టు సాధించవలసే ఉంది. లేదంటే ఇది 'ఆప్‌' ప్రభుత్వ ఆయువు పట్టును దెబ్బకొడుతుంది.

ఇప్పుడు ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే, అతి సున్నితమైన ఈ సరిహద్దు రాష్ట్రంలో ఉగ్రవాదం తిరిగి పొడసూపే అవకాశం ఉండటమే. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన పొరుగుదేశం మళ్లీ సరిహద్దు పొడవునా ఘర్షణలు రేపడానికి ప్రయత్నించవచ్చు. 1980లలో మన పొరుగు దేశమే ఖాలిస్తానీ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి ఆశ్రయం కల్పించింది. పైగా సరిహద్దు పొడవునా ఆయుధాలను సరఫరా చేసింది. అమృత్‌పాల్‌తో కూడా మన పొరుగు దేశం సంబంధాలు పెట్టుకోవచ్చు. ఇప్పటికే ఆ ప్రయత్నం జరిగిందో!

ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి తగిన వ్యక్తి– జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ దోబాల్‌. ఏం చేయాలో ఆయనకు తెలుసు. ఇదంతా ఎలా జరిగింది, దీన్ని పరిష్కరించడానికి ఎవరిపై విశ్వాసం ఉంచాలి వంటి వివరాలు ఆయనకు తెలుసు. అమృత్‌పాల్‌కు అసమంజసమైన ఆకర్షణ రావడాన్ని అనుమతించకూడదు. జయింపశక్యం కాని వలయం అతడి చుట్టూ ఏర్పడకముందే అతడిని అదుపు చేయాలి. అజ్‌నాలాలో అతడు విజయాన్ని రుచిచూశాడు. దానికి అనుగుణంగా పంజాబ్‌లో అతడికి మద్దతు పెరుగుతుంది.

బీజేపీకి స్వాగతం పలకని రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనం పొందడానికి అజ్‌నాలాలో పంజాబ్‌ ప్రభుత్వ వైఫల్యాన్ని ముందు పీటికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించవచ్చు. అలా చేస్తే అది కూడా తప్పిదమే అవుతుంది. ఆప్‌ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఆప్‌ సిక్కు ముఖచిత్రంగా మాన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. బీజేపీ కూడా కెప్టెన్‌ అమరీందర్‌ సింగ్‌ను తన పార్టీ సిక్కు ముఖంగా తీసుకొచ్చింది. కానీ అతడి బలం పనిచేయలేదు. మోదీ ప్రభుత్వం ముందున్న తెలివైన ఎంపిక ఏమిటంటే, పంజాబ్‌ను దాని మానాన దాన్ని వదిలేయడమే. లేకుంటే తన చేతులను తానే కాల్చుకోవలసి వస్తుంది.

దీనికంటే మించిన చెత్త ఎంపిక ఏమిటంటే, రాజకీయాలు ఆడటమే. ఎందుకంటే మాన్, ఆయన పార్టీని ఒక పిల్లకాకి విపత్కర పరిస్థితుల్లోకి నెట్టేశాడు. ఇతగాడు గత సంవత్సరం దాకా నీట్‌గా షేవ్‌ చేసుకుని దుబాయ్‌లో ఇదమిత్థం కాని జీవితం గడుపుతుండేవాడు. తనలోని సహజ ప్రతిభలకు అవకాశం లభించనుందని గ్రహించిన అమృత్‌పాల్‌ అప్పటినుంచి గడ్డం పెంచడమే కాకుండా, భింద్రాన్‌వాలేను అనుకరిస్తూ దుస్తులను ధరించడం ప్రారంభించాడు. పోలీసులు చర్య తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు గురు గ్రంథ్‌ సాహిబ్‌ను తన అనుచరులు నిత్యం వెంట ఉంచుకునేలా చేశాడు.

సమస్యను మొగ్గలోనే తుంచేసే అవకాశం లేకుండా పోయింది. రాజకీయ, పోలీసు నాయకత్వం చేయవలసిన పని కష్టతరమైంది. ఆప్‌ ప్రభుత్వం దోబాల్‌ సహాయం తీసుకోవాలి. సలహాదారుగా తన పాత్రను ప్రకటించకుండానే తెర వెనుక ఆయన చాలా చేయగలడు. ఈ సమస్యకు ద్విముఖ వ్యూహం అవసరం. పంజాబ్‌ జనాభాలో చాలా భాగం, ముఖ్యంగా గ్రామాల్లోని జాట్‌ సిక్కు రైతులు 1980, 90ల మొదట్లో ఉగ్రవాదం బీభత్సంతో తీవ్ర బాధలకు గురయ్యారు. ప్రజారాశులతో కమ్యూనికేషన్‌ మార్గాలు పెరిగినందున, అమృత్‌పాల్, అతడి అనుయాయులను అదుపులోకి తీసుకోవాలి. రాజకీయ ప్రతిపక్షాలు, విమర్శకులకు వ్యతిరేకంగా అన్ని చట్టాలను ఉపయోగిస్తున్న బీజేపీ... రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్రాన్ని కాటు వేయడానికి ముందే ఉగ్రవాదంపై ఆ చట్టాలను ఉపయోగించాలి.

*వ్యాసకర్త పోలీస్‌ మాజీ ఉన్నతాధికారి, 'పద్మభూషణ్‌'*
('ద ట్రిబ్యూన్‌' సౌజన్యంతో)

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్‌ మీడియా

### ఎలా వదిలేస్తారు?



ద్వేషం, హింసలను ప్రేరేపించడానికి ఫేక్‌ వీడియోలు వాడిన అందరినీ చట్టపరంగా శిక్షించాలి. అంతమాత్రాన తమిళనాడులోని హిందీ మాట్లాడే జనాల పట్ల బహిరంగంగా హింసను రెచ్చగొడుతున్న వాళ్లు నిర్దోషులైపోరు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన 'నామ్‌ తమిళియర్‌ కచ్చి' పార్టీ సీమన్‌ లాంటివాళ్ల మీద ఎందుకు చర్యలు తీసుకోరు?

– ప్రశాంత్‌ కిశోర్, రాజకీయ వ్యూహకర్త

### పెద్దవాడే...



ఒక అబ్బాయికి ఒక మహిళను అత్యాచారం చేయగలిగేంత శారీరక సామర్థ్యం ఉంటే, అతడి మీద 'జువెనైల్‌' (బాలుడు)గా కాకుండా పెద్దవాడిగానే విచారణ జరపాలి.

– ఐశ్వర్యా ముద్గిల్, సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌

### ఎందుకిలా?



టాయ్‌లెట్‌ను వాడిన తర్వాత ఇండియన్లు ఎందుకు ఆ మొత్తం టాయ్‌లెట్‌ను తడిపేస్తారు? మలం తర్వాత అంత జలం ఎందుకో!

– శ్రీరామ్‌ వి., ఆంట్రప్రెన్యూర్‌

### మనకోసమైనా...



ప్రియమైనవాళ్ల ఆరోగ్యం గురించి తరచుగా ఆందోళన చెందకుండా ఎలా జీవించాలో నేర్చుకుంటున్నాను. అది చాలా కష్టం. కానీ ఒక రకంగా ఆలోచిస్తే, అవసరం కూడా.

– షబ్నమ్‌ ఖాన్, కాలమిస్ట్‌

### మూక తత్వం



అన్ని హోలీ హింస వీడియోల్లోనూ ఉన్నది కొందరు మూక మగవాళ్లు, ఒంటరి అమ్మాయి. ఇది మగవాళ్ల పిరికితనం గురించి ఎంతగానో చెబుతుంది. వాళ్లు గొప్పగా చెప్పుకొనే 'ప్రతాపం' అంతా కేవలం వాళ్ల తలకాయల్లో మాత్రమే ఉంటుంది.

– సంగీతా నంజీ, రచయిత్రి

### వాళ్లు మాట్లాడరు



హిందూ మహిళల స్వేచ్ఛ బొట్టు పెట్టుకోకుండా ఉండటంలో, ముస్లిం మహిళల స్వేచ్ఛ బుర్ఖా ధరించడంలో ఉంది... ఇదీ మొత్తంగా ఇండియా లోని ఉదార వాదుల వైఖరి! ఒక హిందూ మహిళ బొట్టు పెట్టుకోవాలో వద్దో ఆమె ఎంపిక, దానికి నేను మద్దతి స్తాను. కానీ కశ్మీర్‌లో ఒక మహిళ హిజాబ్‌ ధరించనందుకు చంపుతామంటూ వచ్చిన బెదిరింపుల పట్ల ఉదారవాదులు, స్త్రీవాదులు మౌనం వహించడం గమనించాను.

– అమనా బేగమ్‌ అన్సారీ, పాలసీ అనలిస్ట్‌

### ఎక్కువగా ఆలోచించకుండా...



'చాట్‌జీపీటీ' ఇప్పుడున్న రూపంలో జనాలు మరింత, మరింత తక్కువగా నేర్చుకునేట్టు, ఆలోచించేట్టు చేయడానికి నయాఉదారవాదం, దాని ప్రియ రాజకీయ నాయకులు ప్రారంభించిన అత్యంత అధునాత ఆయుధం. అప్పుడే వాళ్లు పడక వినియోగదారుల (కౌచ్‌ కన్స్యూమర్స్‌) ఆదర్శానికి సమీపించగలరు!

– తబీష్‌ ఖైర్, రచయిత

సాక్షి ఎడిటోరియల్‌ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్‌: editpage@sakshi.com

# వయసు పుష్కరం... విజయాలు పుష్కలం

సందర్భం



డా. డి.వి.జి. శంకర రావు

ఈ మార్చి 12న వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ 13వ పుట్టినరోజు జరుపుకొంటోంది. 2011లో ఆవిర్భవించిన ఈ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు రాజకీయ రంగాన్ని శాసిస్తోంది. తన నడకలో తొమ్మిదేళ్ల ప్రతిపక్షంగా, మూడేళ్ల అధికారపక్షంగా పూర్తి చేసుకుని భవిష్యత్‌ వైపు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా నేటి ముఖ్యమంత్రి జగన్‌ వేసిన తొలి ఒంటరి అడుగు, రానురాను లక్షలాది పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా ప్రవాహమై సాగుతోంది. ప్రజల్లో ప్రవహిస్తోంది.

వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పుట్టుక ఒక తిరుగుబాటు బావుటా. దేశాన్ని అప్పుడు పాలిస్తున్న ఒక జాతీయ పార్టీ అహంకారానికి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డ ఒక ప్రాంతీయ ఆత్మ గౌరవం. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కి జీవిత కాలం సేవలందించి అకాల మరణం పొందిన జననేత నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌. ఆయన మృతి వార్త విని తట్టుకోలేక పదుల సంఖ్యలో అభిమానులు అసువులు బాశారు. ఆ కుటుంబాల్ని ఓదార్పు యాత్ర ద్వారా పరామర్శిద్దామని ఆయన తనయుడు జగన్‌ తలిస్తే, అధిష్ఠానం వద్దని అంది. అది సబబు కాదని ఆయన అధిష్ఠానాన్ని ధిక్కరిస్తూ యాత్ర కొనసాగించారు. అక్కడి నుండే వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి బీజం పడింది. ఆ తర్వాత ప్రజల్లోనే ఉంటూ, ప్రజలతోనే నడుస్తూ, వారి ఆశీస్సులతోనే ఎదిగింది.

రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో 44 శాతం ఓట్లు సంపాదించి తృటిలో అధికారాన్ని కోల్పోయింది. నాడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ, తమ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభ పర్చుకున్నా వెనకడుగు వెయ్యలేదు. అడుగు ముందుకే పడింది. అనంతరం వైఎస్‌ జగన్‌ చేపట్టిన పాదయాత్ర ఒక కీలక ఘట్టం. ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల్ని తెలుసుకుంటూ వాటి ఆధారంగా తమ పార్టీ మ్యానిఫెస్టో తయారు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో 151 స్థానాలతో తిరుగులేని విజయాన్ని పొంది ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు.



ఈ మూడేళ్లలో మ్యానిఫెస్టోలోని 95 శాతం హామీల్ని కార్యరూపం లోకి తీసుకురావడం, పూర్తి చెయ్యడం దేశంలోనే ఒక రికార్డు. సచివాలయాలు ఏర్పాటుచేశారు. వలంటీరు వ్యవస్థ ద్వారా గ్రామాల్లో పాలనను ప్రజల గడప దగ్గరకు తీసుకు వచ్చారు. అర్హులకు నేరుగా లబ్ధి చేకూర్చారు. విద్య, ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టి గణనీయమైన మార్పులు తెచ్చారు. వాటి ఫలితంగా మానవ వనరుల అభివృద్ధి సూచీల్లో రాష్ట్రం ర్యాంకు మెరుగు పడింది. కరోనా వంటి విపత్కర కాలంలో కూడా సంక్షేమం ప్రజల చెంతకు చేరింది. జిల్లాల వికేంద్రీకరణ ద్వారా పాలన చేరువైంది. ఎన్నికల్లోనే కాకుండా ఎంపికలలోనూ, పదవుల్లోనే కాకుండా పనుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకూ పెద్దపీట వేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సాధికారికత దిశగా రాష్ట్రం పయనిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఒక బలమైన శక్తి. ప్రజాబలం పుష్కలంగా ఉన్న పార్టీ. 13వ జన్మదిన శుభాకాంక్షలు!

*వ్యాసకర్త మాజీ ఎంపీ, పార్వతీపురం ǀ 94408 36931*

# ఈ సామాన్య మహిళ ఓ చైతన్య దీప్తి!

నివాళి



చల్లపల్లి స్వరూపరాణి

1990ల్లో జరిగిన మహిళల సారా వ్యతిరేక ఉద్యమాన్ని పెత్తందారీ కులాల స్త్రీలు ఎంచక్కా కబ్జా చేశారు. తాగుబోతు భర్తలతో పడలేక బాధిత దళిత ఆదివాసీ స్త్రీలు... ప్రభుత్వం గ్రామాలలో సారా దుకాణాలను బంద్‌ పెట్టాలని అనేక చోట్ల రోడ్డెక్కి నినదించడమే కాదు ప్రభుత్వాల మెడలు వంచారు. వాళ్ళంతా పోలీసుల లాఠీ దెబ్బలు తిని ఇంటికొస్తే లోపలికి రావద్దని భర్తలచేత గెంటేయ బడ్డారు. అయినా ఉద్యమాన్ని కొనసాగించారు. ఇంతలో పట్టణాల నుంచి వచ్చిన సిద్ధాంతాలు తెలిసిన పెత్తందారీ కులాల స్త్రీలు సారా వ్యతిరేక ఉద్యమ విజయాన్ని తమ ఖాతాలో జమ చేసుకుని వెళ్ళారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని అట్టడుగు కులాల స్త్రీలు నడిపితే ఆ ఉద్యమానికి నాయకురాలిగా పెద్ద కులానికి చెందిన దూబగుంట రోశమ్మ పేరు ప్రసిద్ధికెక్కింది. అణగారిన కులాల స్త్రీల పేర్లు మచ్చుకైనా కనబడకపోవడం యాదృచ్ఛికం కాదు. ఈ నేపథ్యం నుండి జయ భాగ్యమ్మ వచ్చింది.

ఇటీవల దళిత ఉద్యమాన్ని ప్రతిఘటనా స్థాయికి తీసుకెళ్ళి అటు ప్రభుత్వాలకు, ఇటు పెత్తందారీ కులాల దౌర్జన్యకారులకు మింగుడు పడకుండా వార్తలలో వ్యక్తిగా అసాధారణమైన గుర్తింపును పొందింది భాగ్యమ్మ. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన నిరక్షరాస్యురాలైన డెబ్బైయ్యేడేళ్ల ఈమె జీవితం పోరాటాల మయం. రెక్కల కష్టంతో బతుకుతూ సారా ఉద్యమం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేవరకూ తన స్ఫూర్తివంతమైన ప్రస్థానాన్ని సాగించిన భాగ్యమ్మ మార్చి 1న కన్ను మూసింది.

పెదగొట్టిపాడు సగటు భారతీయ గ్రామానికి నిలువెత్తు ప్రతినిధి. అక్కడ కుల భూస్వామ్యం బాహాటంగానే బుసలు కొడుతుంది. అయితే ఆ ఊరిలో మాలా మాదిగలు కలిసి సుమారు వెయ్యి గడప ఉండే దళిత వాడ ఉంది. ఆ వాడ బిడ్డే జయభాగ్యమ్మ. ఆమెకు కనీసం ప్రాథమిక స్థాయి చదువు లేకపోయినప్పటికీ అసాధారణమైన జ్ఞానం ఆమె సొత్తు. భాగ్యమ్మ భర్త తాగుబోతు, పేకాట రాయుడు. వ్యసనపరుడైన తన భర్తతో పాటు... దళిత వాడలో తాగి తందనాలాడుతూ భార్యా బిడ్డలకు కూలీ డబ్బులు కూడా మిగలకుండా చేసే భర్తలందరికీ బుద్ధి చెప్పడానికి ఆమె నడుం కట్టింది. ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ సారా దుకాణాన్నీ, లైసెన్స్‌ ఉన్న మరో ప్రైవేటు మద్యం దుకాణాన్నీ మూయించేవరకు ఆమె తన పోరాటాన్ని కొనసాగించింది. జయ భాగ్యమ్మకు అప్పటి నుంచి ఆ గ్రామంలో కొందరు స్త్రీ, పురుషులు అభిమానులుగా మారి ఆమెను తమ నాయకురాలిగా గౌరవించడం మొదలు పెట్టారు.

మద్యం దుకాణాల మూసివేత తర్వాత క్రమంగా పెదగొట్టిపాడు దళితవాడ అభివృద్ధి వైపు పయనించడం మొదలు పెట్టిందనవచ్చు. మారని భర్తతో తెగతెంపులు చేసుకుని ముగ్గురు పిల్లల్ని తన రెక్కల కష్టంతో పెంచి, పెద్ద చేసింది. పిల్లలు ఎవరి దారిన వారు వెళ్తే... తనొక్కతే కూలీ నాలీ చేసుకుంటూ బతుకుపోరు సాగించింది. సారా వ్యతిరేక ఉద్యమం ద్వారా సమర్థ నాయకురాలిగా అందరి దృష్టిలో పడిన భాగ్యమ్మను లోక్‌ సత్తా పార్టీ జయప్రకాష్‌ నారాయణ గుర్తించి ఆమెకు పార్టీ సీటివ్వడంతో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసింది.



జొన్నలగడ్డ జయభాగ్యమ్మ

2018లో గొట్టిపాడు దళితవాడపై అక్కడి పెత్తందారీ కులస్థులు చేసిన దాడికి నిరసనగా వెల్లువెత్తిన ఉద్యమంలో జయభాగ్యమ్మ ఒక నిర్ణయాత్మకమైన పాత్ర పోషించింది. ఆ ఉద్యమం ప్రతిఘటనా స్థాయికి వెళ్ళడంలో ఆమె అందించిన తోడ్పాటు ఎంతో కీలకమైనది. గత ఫిబ్రవరి మాసంలో ఆమె గొట్టిపాడు బాధిత దళిత మహిళలను సమీకరించి వారితో గ్రామంలో నిరాహార దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించి దళిత ప్రతిఘటనా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇంతలోనే మృత్యువు కబళించింది. ఆమె ఎన్నటికీ అగచాట్ల సుడిగుండాల్లో చిక్కుకున్న సామాన్య మహిళలకు చైతన్య దీప్తే!

*వ్యాసకర్త కవయిత్రి, నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా కాలేజ్‌ ప్రిన్సిపల్‌*
(2023 మార్చి 1న జయభాగ్యమ్మ తుదిశ్వాస విడిచారు.)

## క్లుప్తంగా...

### ఆదివాసీ దారుణ హత్య


సప్కా రమేష్

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని సుబ్బంపేట పంచాయతీ పరిధి ఆదివాసీ గూడెమైన క్రాంతిపురం (రాజయ్యనగర్)లో సప్కా రమేష్ (35) గురువారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. ఘటన జరిగిన గ్రామం, మృతుడి నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే మావోయిస్టుల హస్తం ఉండొచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మృతుడి భార్య దేవి తెలిపిన వివరాల ప్రకారం..గురువారం రాత్రి రమేష్ ఇంటి బయట కుటుంబంతో కలిసి నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నల్ల రంగు దుస్తులు ధరించి వచ్చిన ఐదుగురు కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. అడ్డుకున్న దేవిని కూడా కొట్టారు. తర్వాత కత్తితో రమేష్ ఛాతీపై ఇష్టమొచ్చినట్లు పొడిచి అటవీ ప్రాంతం వైపు పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న రమేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మరణించాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గతంలో మావోయిస్టులు ఇదే తరహాలో గ్రామానికి చెందిన ఒకరిని హత్య చేయడంతో, రమేష్ హత్య వెనుక కూడా వారి హస్తం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బి.అశోక్ చెప్పారు.

### తెలంగాణకు 'మార్చి' పన్నుల వాటా రూ.2,682 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాలు తమ అభివృద్ధి వ్యయాలను వేగవంతం చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 14వ విడత పన్ను పంపిణీగా మార్చి నెలలో రూ.1,40,318 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేసింది. అందులో తెలంగాణకు రూ.2,682 కోట్లు పన్నుల్లో వాటాగా కేంద్ర ఆర్థిక శాఖ అందించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.5474 కోట్లు విడుదల చేసింది.

# విరాసత్ నుంచి నాలా వరకు..

- ధరణి పోర్టల్‌లోని 10కిపైగా సమస్యలకు త్వరలోనే మోక్షం
- కంపెనీల పేరిట భూముల రిజిస్ట్రేషన్లు తదితర సమస్యల చిట్టాను రూపొందించిన సీసీఎల్‌ఏ
- వారంలోపే ఆయా సమస్యలకు పరిష్కారం



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లో వ్యవసాయ భూముల లావాదేవీలకు సంబంధించి తలెత్తుతున్న చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్‌మిత్తల్ కసరత్తు ప్రారంభించారు. సమస్యలను గుర్తించి వాటిని సరిచేసేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయిస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు వారంలోపే పూర్తవుతాయని.. ఆ తర్వాత ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో వస్తున్న ఇబ్బందుల్లో పదికిపైగా చిన్న చిన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీసీఎల్‌ఏ వర్గాలు చెబుతున్నాయి.

**చిన్నవే కానీ.. సతాయిస్తున్నాయి**

వాస్తవానికి వ్యవసాయ భూముల లావాదేవీలు మాన్యువల్‌గా జరిగే సమయంలో ఎక్కడికక్కడ సమస్యలు వచ్చినా పెద్దగా వెలుగులోకి వచ్చేవి కావు. వాటి పరిష్కారానికి ఎక్కువ సమయం పట్టినప్పటికీ క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరించేవారు. కానీ ధరణి పోర్టల్ ఆన్‌లైన్ వేదిక కావడంతో ఏ చిన్న సమస్య అయినా రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకరీతిలో ఇబ్బందులు పెడుతోంది. దీనికితోడు భూసమస్యల పరిష్కార అధికారం కలెక్టర్ల చేతిలో ఉండటంతో మరింత జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ధరణి సమస్యలపై సీసీఎల్‌ఏ నవీన్‌మిత్తల్ ప్రత్యేక దృష్టి సారించారు. రెవెన్యూ రికార్డులను ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంలోనే అసలు సమస్య వచ్చిందనే నిర్ధారణకు వచ్చి ఆయా సమస్యల నివృత్తి, పరిష్కారానికి రోజూ కొంత సమయం కేటాయిస్తున్నారు. తన వరకు వస్తున్న దరఖాస్తులు, విజ్ఞప్తులను అధ్యయనం చేయడంతోపాటు సీసీఎల్‌ఏ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు.

**శాశ్వత పరిష్కారం దిశగా..**

ధరణి పోర్టల్ ద్వారా రైతులకు చిన్న సమస్యలు కూడా అగ్నిపరీక్షలుగా మారిపోయాయి. ముఖ్యంగా పట్టాదారు చనిపోయే సమయం నాటికి ఆ వ్యక్తి పేరిట ఉన్న భూమికి సంబంధించిన రికార్డులపై తహసీల్దార్ డిజిటల్ సంతకం లేకపోతే ఆ భూమిని చనిపోయిన పట్టాదారు వారసులకు బదిలీచేసే అవకాశం ధరణి పోర్టల్ సాఫ్ట్‌వేర్‌లో అందుబాటులో లేదు. అలాగే గతంలో నాలా (వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు) భూములు ఇప్పటికీ ధరణి పోర్టల్‌లో వ్యవసాయ భూముల విభాగంలోనే కనిపిస్తున్నాయి. ఈ భూములను నాలా కింద మార్పు చేసే ఆప్షన్ కూడా ధరణిలో లేదు. గతంలో కంపెనీలు, ట్రస్టుల పేర్లపై ఉన్న భూముల వివరాలు ధరణిలో సక్రమంగా అప్‌లోడ్ కాకపోవడంతో వాటి పాసుపుస్తకాలు ఆయా కంపెనీలు, ట్రస్టుల పేరిట రావట్లేదు. ఇలాంటి సమస్యలకు ఇప్పుడు పరిష్కారం చూపగా ఇందుకు సంబంధించిన మార్పులు వారం రోజులు లోపే ధరణిలో కనిపించనున్నాయి. మరోవైపు మరికొన్ని సమస్యలను గుర్తించి వాటికి అవసరమైన మార్పులు చేసే ప్రక్రియను ప్రారంభించారు.

### మిస్సింగ్‌కు మిత్తల్ 'మార్కు'



ధరణిలో ఎదురవుతున్న మరో సమస్య మిస్సింగ్ సర్వేనంబర్లు. రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో కొన్ని సర్వేనంబర్లు మిస్సవడంతో ఈ సర్వే నంబర్లలోని భూముల రైతులు పాసు పుస్తకాలు లేక, ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు అందక ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ధరణిలో మిస్సింగ్ సర్వేనంబర్ల నమోదు కోసం సీసీఎల్‌ఏ ప్రత్యేక ఆప్షన్ కల్పించారు. టీఎం–33 కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించిన సర్వేనంబర్లను పోర్టల్‌లో సరిచేస్తున్నారు. ఇలాంటి సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా వేలల్లో ఉన్న నేపథ్యంలో రోజుకు 500 చొప్పున దరఖాస్తులను పరిష్కరించేందుకు సీసీఎల్‌ఏ కార్యాలయంలో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.

# డిమాండ్లకు 'విద్యుత్' యాజమాన్యాల ఆమోదం

- మరికొన్నింటిపై 13న చర్చిస్తామన్న ఉద్యోగ సంఘాలు

0సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో రాష్ట్ర విద్యుత్ సంస్థల యాజమాన్యాలు శుక్రవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీతో చర్చలు జరిపాయి. విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చలు జరగాల్సి ఉండగా, ఆయన బీఆర్‌ఎస్ సమావేశానికి వెళ్లడంతో రాలేకపోయారు. సోమవారం మరికొన్నింటిపై చర్చలు జరుగుతాయన్నారు. జేఏసీలతో దాదాపు రెండు గంటలకు పైగా విద్యుత్‌సౌధలో జరిగిన చర్చల్లో పలు డిమాండ్లకు యాజమాన్యాలు ఆమోదం తెలిపాయి. సీఎండీలు డి.ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, గోపాల్‌రావు సమక్షంలో టీఎస్‌పీఈ జేఏసీ నాయకత్వంతో సుదీర్ఘంగా జరిగాయి. ఈ చర్చలలో టీఎస్‌పీఈజేఏసీ చైర్మన్, కన్వీనర్లు సాయిబాబు, రత్నాకర్‌రావులతోపాటు నాయకులు పాల్గొన్నారు. ఫిట్మెంట్, ఈపీఎఫ్ తదితర విషయాలపై చర్చలు కొనసాగాయి.

**పలు డిమాండ్లకు ఆమోదం**

ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న సింగిల్ మాస్టర్ స్కేల్, ఆర్టిజన్ ఉద్యోగుల పర్సనల్ పేను బేసిక్‌లో కలపడం, మెడికల్ క్రెడిట్ కార్డుల విషయంలో చిన్న ఆరోగ్య సమస్యలకు రూ.5 లక్షలుగా ఉన్న సదుపాయాన్ని రూ.7 లక్షలకు పెంచడం, సెల్ఫ్ ఫండింగ్ స్కీంను రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడం, 'గ్రాట్యుటీ'వర్తింపజేయడం, హౌస్ రెంట్ అలవెన్స్ సీలింగ్ పెంచడం తదితర డిమాండ్లకు ఆమోదం లభించిందని చైర్మన్, కన్వీనర్లు తెలిపారు. చర్చలలో కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మన్లు వజీర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కీచక తండ్రికి మరణించే దాకా జైలుశిక్ష

- నాంపల్లి సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- 2021లో కూతురిపై పలుమార్లు తండ్రి అత్యాచారం
- అన్నంలో నిద్రమాత్రలు కలిపి ఘాతుకం
- ఎవరికైనా చెబితే చంపేస్తాననడంతో భయపడ్డ బాధితురాలు
- బాలిక గర్భం దాల్చడంతో బయటపడ్డ దురాగతం

బంజారాహిల్స్: కన్నకూతురికి భోజనంలో నిద్రమాత్రలు కలిపి తినిపించి ఆమె నిద్రపోయాక కొంతకాలంపాటు అత్యాచారానికి పాల్పడిన కీచక తండ్రికి న్యాయస్థానం మరణించే వరకు జైలుశిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలసవచ్చింది. కుటుంబ పెద్ద జూబ్లీహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. 2003లో వివాహమైన ఈ దంపతులకు 16 ఏళ్ల కూతురు, 14 ఏళ్ల కొడుకు ఉన్నారు. సొంత జిల్లాలోని బంధువుల ఇంట్లో కొడుకు 8వ తరగతి చదువుతుండగా కూతురు తల్లిదండ్రుల వద్దే ఉంటూ 9వ తరగతి మధ్యలోనే ఆపేసి ఇంట్లోనే ఉంటోంది. 2021 జూలై 16న కూతురు తీవ్ర అనారోగ్యానికి గురై వాంతులు చేసుకోగా ఆందోళన చెందిన తల్లి నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి నాలుగు నెలల గర్భవతి అని తేల్చారు. దీంతో కూతురిని నిలదీయగా తండ్రి భోజనంలో నిద్రమాత్రలు కలిపి తినిపించి నిద్రపోయాక అత్యాచారానికి పాల్పడేవాడని చెప్పింది. నిద్రలోంచి లేచి చూసుకుంటే తన ఒంటిపై బట్టలుండేవి కావని, ఒళ్లంతా నొప్పులు ఉండేవని వివరించింది. ఓసారి మద్యం మత్తులో ఇంటికొచ్చి మరోసారి లైంగికదాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే అందరినీ చంపేస్తానని బెదిరించడంతో భయపడి మిన్నకుండిపోయానని రోదించింది. ఈ ఉదంతంపై బాధితురాలి తల్లి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పోలీసులు పోక్సో చట్టం కింద నిందితుడు వెంకటరమణను అరెస్టుచేసి నాంపల్లిలోని 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. వెంకటరమణపై పక్కా ఆధారాలు సమర్పించారు. వాదనలు విన్న జడ్జి అనిత శుక్రవారం వెంకటరమణను దోషిగా తేల్చి అతనికి మరణించే వరకు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

# ప్రియుడి వేధింపులతో యువతి ఆత్మహత్య

- ఐ లవ్‌యూ.. అని అతడికే లాస్ట్ మెసేజ్!
- అనంతరం ఉరి వేసుకుని బలవన్మరణం


పల్లవి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రియుడి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంగరకలాన్ తండాకు చెందిన అంగోతు సరిత, అంతిరాం దంపతుల రెండో కుమార్తె పల్లవి (21). ఈమె వండర్‌లాలో ఉద్యోగం చేస్తోంది. హైదరాబాద్ మూసాపేటకు చెందిన ఎలుక క్రాంతి, కొంగరకలాన్‌లో ఉంటున్న తన అమ్మమ్మ దగ్గర ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం పల్లవి, క్రాంతి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇదిలా ఉండగా.. వండర్‌లాలో పనిచేస్తున్న ప్రణయ్‌తో పల్లవి చనువుగా ఉంటోందని, ఫోన్‌లు, చాటింగ్ చేస్తోందని క్రాంతికి అనుమానం వచ్చింది. దీంతో రెండు నెలలుగా ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో క్రాంతి గురువారం పల్లవిని కలిసి బైక్‌పై సాయిబాబా గుడి వద్దకు తీసుకెళ్లాడు. 'నీ బాగోతం అంతా నాకు తెలుసు.. అందరికీ చెప్పి పరువు తీస్తా'అని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన పల్లవి.. 'ఐ లవ్ యూ.. లాస్ట్ మెసేజ్' అని క్రాంతికి వాట్సాప్ చేసింది. అనంతరం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలాన్ని డీసీపీ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం బందోబస్తు మధ్య పల్లవి అంత్యక్రియలు పూర్తి చేశారు.

**పోలీసుల అదుపులో ఇద్దరు**

ఇంటికి వెళ్లకుండా పల్లవి ఫోన్ స్విచ్చాఫ్ చేయడం, ఇదే చివరి మెసేజ్ అని పెట్టడంతో క్రాంతికి అనుమానం వచ్చింది. దీంతో అతను ఆదిబట్ల పోలీసులకు తెలిపాడు. పల్లవి ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందని తల్లిదండ్రులకు తెలియడంతో వారు కూడా పోలీసులను ఆశ్రయించారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. శుక్రవారం పల్లవి చెట్టుకు ఉరేసుకొని కనిపించింది. కూతురు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. కాగా, క్రాంతి, ప్రణయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# బరాబర్ ధరణిని రద్దు చేస్తాం

- భూస్వాములు, కేసీఆర్ కుటుంబీకుల కోసమే దాన్ని తెచ్చారు: రేవంత్‌రెడ్డి
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ధరణి సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడి
- పేదల భూములు వారికి చెందే వరకు 'ధరణి అదాలత్'లు: మాణిక్‌రావ్ ఠాక్రే


మాట్లాడుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే. చిత్రంలో రేవంత్‌రెడ్డి, మల్లు రవి తదితరులు

సాక్షి, పెద్దపల్లి/జగిత్యాల రూరల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను బరాబర్ రద్దుచేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాపూర్‌లో భూసమస్యలు ఎదుర్కొంటున్న గ్రామస్తులతో మీభూమి-మీహక్కు నినాదంతో కాంగ్రెస్ పార్టీ 'ధరణి అదాలత్'గ్రామసభను నిర్వహించింది. ధరణి పోర్టల్‌లో పేర్లు నమోదుకాక, ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తుల సమస్యలను కాంగ్రెస్ నేతలు తెలుసుకున్నారు. తర్వాత వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున గ్యారంటీ కార్డులను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, కొప్పుల రాజు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. భూస్వాములు, కేసీఆర్ కుటుంబీకుల కోసమే ధరణి పోర్టల్ తీసుకొచ్చారని.. అందువల్లే గతంలో కాంగ్రెస్ పార్టీ పేదలకు పంచిన 22 లక్షల ఎకరాల భూమి భూస్వాముల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. సీసీఎల్‌ఏ చేతిలో ధరణి పోర్టల్ లేదని.. ఫిలిప్పీన్స్‌కు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టి, వెనక నుంచి కేసీఆర్ కుటుంబీకులు వేలకోట్లు కాజేస్తున్నారని విమర్శించారు.

**అన్ని గ్రామాల్లో 'ధరణి అదాలత్'**

ధరణి పేరుతో కేసీఆర్ సర్కారు పేదల భూములను కబళిస్తోందని.. పేదలకు తిరిగి భూహక్కులు కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని ఏఐసీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థను తిరిగి తీసుకురావడానికే ధరణి పోర్టల్ తీసుకొచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. దివంగత సీఎం వైఎస్సార్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే పేదలకు భూయాజ మాన్య హక్కులు కల్పించారని.. బీఆర్‌ఎస్ సర్కారు ఆ భూములను లాక్కుంటోందని జాతీయ నేత కొప్పుల రాజు ఆరోపించారు.

**కాంగ్రెస్ పంచ సూత్రాలివీ..**

- ధరణి పోర్టల్‌లో 60 లక్షల మంది పేర్లు ఉంటే.. అందులో దాదాపు 20 లక్షల ఖాతాల్లో పేరు, సర్వే నంబర్‌తోపాటు చాలా తప్పులున్నాయి. అన్నీ దిద్ది ఎవరి భూమిపై వారికి హక్కులివ్వాలి.
- మేమొచ్చాక రెండేళ్లలో భూముల రీసర్వే.
- రాష్ట్రంలోని 125 భూచట్టాలు, 3 వేల జీవోలు ఉన్నాయి. వాటన్నింటినీ ఒకే చట్టంగా తీసుకొస్తాం
- బలవంతపు భూసేకరణ పూర్తిగా నిషేధిస్తాం. భూయజమాని అనుమతి లేకుండా సేకరించవద్దంటూ 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తాం.
- తెలంగాణలోని 15 లక్షల మంది కౌలు రైతులకు పథకాలు అందిస్తాం.

### ఇద్దరూ ఆడపిల్లలే.. పట్టా పాస్‌బుక్ ఇవ్వాలి



కాంగ్రెస్ ప్రభుత్వంలో భూమిని కేటాయించి లావణి పట్టా ఇచ్చారు. ఇప్పుడు ధరణి తెచ్చాక భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వలేదు. నాకు ఇద్దరు ఆడపిల్లలే. పనిచేస్తేనే పూటగడిచేది. సర్కార్ ఇప్పటికైనా పాస్‌బుక్ ఇవ్వాలి.

– కవ్వంపల్లి జ్యోతి

**కవితను బహిష్కరించలేదేం: రేవంత్‌రెడ్డి**

అవినీతికి పాల్పడితే కొడుకైనా, బిడ్డ అయినా జైలులో పెడతానని కొన్నిరోజుల కింద సీఎం కేసీఆర్ చెప్పారని, మరి మద్యం కుంభకోణానికి పాల్పడిన ఎమ్మెల్సీ కవితపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యపై ఆరోపణలు వస్తేనే పదవి నుంచి బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు.

# కాంగ్రెస్ 'హామీ కార్డు'

- ధరణి పోర్టల్ సమస్యల నుంచి విముక్తి పేరుతో కార్డుల జారీ
- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా పరిష్కరిస్తామని కార్డుపై లిఖితపూర్వక హామీ
- ఈ కార్డును తహసీల్దార్ లేదా రెవెన్యూ సిబ్బందికి చూపిస్తే పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- పెద్దపల్లిలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
- మండలానికి ఐదుగురు 'భూరక్షక్'లు... అన్ని గ్రామాల్లో ధరణి అదాలత్‌లు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రైతాంగాన్ని ఆకట్టుకొనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. రైతులకు చుక్కలు చూపుతున్న ధరణి పోర్టల్ సమస్యలకు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పరిష్కారం చూపుతామంటూ ఏకంగా 'హామీ కార్డులు' జారీ చేస్తోంది. పెద్దపల్లి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు కింద ఈ 'హామీ కార్డుల'జారీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో ప్రారంభించిన టీపీసీసీ.. కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెబుతోంది. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది.

**ఫొటోతో కార్డు..:** ధరణి పోర్టల్ లావాదేవీల ద్వారా రాష్ట్రంలోని 20 లక్షల మంది రైతుల ఖాతాల్లో సమస్యలున్నాయని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. దీనికి పరిష్కారంలో భాగంగా రైతుల ఫొటోలు, వివరాలతోపాటు ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను కార్డు ముందు భాగంలో ముద్రిస్తోంది. తాము అధికారంలోకి రాగానే ఈ కార్డులను తహసీల్దార్ లేదా రెవెన్యూ అధికారులకు చూపిస్తే సమస్య పరిష్కారం అవుతుందని సూచిస్తోంది. ఈ కార్డుల జారీ కంటే ముందు రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఐదుగురు 'భూరక్షక్'లను నియమించాలని పార్టీ నిర్ణయించింది. భూరక్షక్‌లకు ధరణి పోర్టల్‌పై అవగాహన కల్పించి సమస్యల పరిష్కారంపై శిక్షణ ఇప్పించనుంది. వారు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో 'ధరణి అదాలత్'లు నిర్వహించనున్నారు. ఆయా గ్రామ పరిధిలో ధరణి పోర్టల్ ద్వారా ఇబ్బందులు పడుతున్న రైతుల వివరాలు నమోదు చేసుకొని వారికి కార్డులు అందించనున్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ నేతృత్వంలోని ఓ బృందం ఈ కార్యాచరణ కోసం కొన్ని నెలలుగా అధ్యయనం చేస్తోందని, ఈ అధ్యయనంలో వెల్లడైన అంశాలు, అభిప్రాయాల మేరకు ముందుకెళుతున్నామని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

### మన భూమి-మన హక్కు: జైరాం రమేశ్

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధరణి అదాలత్‌లు నిర్వహిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ వెల్లడించారు. ధరణి పోర్టల్ అంటే ఒకరి స్థానంలో మరొకరి ఫొటో పెట్టడం కాదని, ఎవరి భూమిపై వారికి హక్కులు కల్పించాలని, మన భూమి-మన హక్కు పేరుతో ఇందుకోసం కాంగ్రెస్ పోరాడుతుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమగ్ర భూసర్వే చేపడతామని, రైతుల పక్షపాతిగా వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని జైరాం రమేశ్ హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే రాజయ్య లైంగికంగా వేధిస్తున్నారు

- ఓ మహిళా సర్పంచ్ కన్నీటిపర్యంతం



సాక్షి ప్రతినిధి, వరంగల్/ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తనకు ఫోన్‌చేసి అసభ్యంగా మాట్లాడుతున్నారంటూ ఆయన మద్దతుతో గెలిచిన ఓ మహిళా సర్పంచ్ కన్నీటిపర్యంతమైంది. తనను లైంగికంగా వేధిస్తున్నారని.. అనుచరులతోనూ ఫోన్లు చేయించి వేధిస్తున్నారని అదే నియోజకవర్గంలోని జానకీపురం గ్రామ సర్పంచ్ కురుసపల్లి నవ్య శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆరోపించింది. 'నీ మీద కోరికతో నీకు సర్పంచ్ టికెట్ ఇచ్చా.. నీ భర్తతో కాకుండా ఒంటిరిగా నా వద్దకు రావాలి. నాతో బయటకు వస్తే నీకు కావాల్సినవన్నీ కొనిపెడతా.. పిల్లల చదువుకు అయ్యే ఖర్చు అంతా నేనే చూసుకుంటా'అంటూ వేధిస్తున్నారని చెప్పింది. కొందరు స్థానిక మహిళా నేతలు సైతం ఎమ్మెల్యే మాట వినాలని ఒత్తిడి తేవడం మరింత బాధించిందని వివరించింది. దీనికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేసింది. ఇటువంటి నేతలతో బీఆర్‌ఎస్‌కు చెడ్డ పేరు వస్తోందని, రాజయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నవ్య డిమాండ్ చేసింది. సర్పంచ్ నవ్య భర్త ప్రవీణ్ మాట్లాడుతూ తన భార్యకు ఫోన్‌చేసి ట్రాప్ చేసేలా మాట్లాడడం, ఆశలు చూపడం, ఆయన చెప్పినట్టు వినాలంటూ వేధిస్తున్నారని వాపోయాడు. కాగా, దీనిపై ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమని, అంతా సీఎం కేసీఆర్‌కు చెబుతానని అన్నారు.

## క్లుప్తంగా...

### కర్ణాటక ఎన్నికల ప్రచార కమిటీ సారథిగా సీఎం బొమ్మై



**న్యూఢిల్లీ:** కర్ణాటక అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలకు బీజేపీ సమాయత్తమైంది. రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైను నియమించింది. అదేవిధంగా ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెను ప్రకటించింది. ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా మాజీ సీఎం యెడియూరప్పను నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు కమిటీలకు రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన లింగాయత్, వొక్కలిగ కులాలకు చెందిన బొమ్మై, కరంద్లాజెలకు సారథ్య బాధ్యతలు అప్పగించడం ద్వారా బీజేపీ జాతీయ నాయకత్వం సమతూకం సాధించేందుకు ప్రయత్నించింది.

### బీకేయూ నేత తికాయత్‌కు బెదిరింపులు



**ముజఫర్‌నగర్(యూపీ):** భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చాయి. రైతు సంఘాల ఆందోళనల నుంచి దూరంగా ఉండకుంటే రాకేశ్ తికాయత్, ఆయన కుటుంబాన్ని బాంబు వేసి చంపుతామంటూ ఓ ఆగంతకుడు ఫోన్ ద్వారా హెచ్చరించాడు. ఈ మేరకు రాకేశ్ తికాయత్ సోదరుడు గౌరవ్ తికాయత్, బీకేయూ అధ్యక్షుడు నరేశ్ తికాయత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని భవురా కలాన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో అక్షయ్ శర్మ చెప్పారు. రద్దయిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు సాగిన ఆందోళనలకు నాయకత్వం వహించిన రైతు నేతల్లో రాకేశ్ తికాయత్ ఒకరు. చట్టాలు రద్దయిన తర్వాత కూడా ఆయన దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై రైతు సంఘాలు చేపట్టే నిరసనల్లో పాల్గొంటున్నారు.

# ఉక్రెయిన్ కోసం ఏడ్చేవాళ్లెవరు?

**ఇప్పుడెవరికీ పట్టని యుద్ధం.. ప్రపంచ దేశాల ప్రేక్షక పాత్ర**

(ఎస్.రాజమహేంద్రారెడ్డి)



సరిగ్గా ఏడాది క్రితం యమున మహిషపు లోహపు గంటల గణగణలు విని ప్రపంచం యావత్తూ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ గణగణలు దిక్కులు పిక్కటిల్లేలా భూగోళమంతా మారుమోగుతాయేమోనని ఆందోళన పడింది. రష్యా సమరనాదం ఉక్రెయిన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి అనివార్యంగా ప్రపంచ దేశాలను రెండుగా చీల్చడం ఖాయమని పరిశీలకులూ భయంభయంగానే అంచనా వేశారు. మిత్ర దేశం బెలారస్ భుజం మీద ట్యాంకులను మోహరించి ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగింది. చిరుగాలికే వొణికిపోయే చిగురుటాకులా ఉక్రెయిన్ తలవంచడం ఖాయమనే అనుకున్నారంతా! యుద్ధమంటేనే చావులు కదా. మృతదేహాల ఎర్రటి తివాచీ మీద నుంచే విజయం నడిచో, పరుగెత్తో వస్తుంది. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ, ప్రపంచం దృష్టంతా రణక్షేత్రంపైనే నిలిచింది. అయ్యో అన్నవాళ్లున్నారు, రెండు కన్నీటి చుక్కలతో జాలి పడ్డవారూ ఉన్నారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో వైరి పక్షాల వైపు నిలిచిన దేశాలు మాట సాయమో, మూట సాయమో, ఆయుధ సాయమో చేసి తమ వంతు పాత్రను పోషిస్తూనే ఉన్నాయి. తటస్థంగా ఉన్నవాళ్లూ ఉన్నారు. చమురు కోసమో, తిండిగింజల కోసమో రష్యాపై ఆధారపడ్డ దేశాలు ఇప్పుడెలా అని తల పట్టుకుని ఆలోచనలో పడ్డాయి. ఒకవైపు రష్యా వైఖరిని వ్యతిరేకిస్తూ మరోవైపు దిగుమతులను స్వాగతించడం ఎలాగన్నదే వాటిముందు నిలిచిన మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇండియాకు ఇవేమీ పట్టలేదు. ఉక్రెయిన్‌లో వైద్యవిద్య అభ్యసిస్తున్న భారత విద్యార్థులను స్వదేశానికి తీసుకు రావడాన్నే యుద్ధం తొలినాళ్లలో లక్ష్యంగా పెట్టుకుంది. ఎందుకంటే భారత్ తటస్థ ధోరణికే కట్టుబడింది. నెలలు గడిచి యేడాది పూర్తయ్యేసరికి రెండు దేశాలు యుద్ధం చేస్తూనే ఉన్నాయి. మిగతా దేశాలు తమ సమస్యలను తమదైన రీతిలో, రష్యా మీద ఆధారపడాల్సిన అవసరం లేనంతగా పరిష్కరించుకున్నాయి. ఇప్పుడు యుద్ధం హాలీవుడ్ వార్ సినిమాయే.. ప్రాణ నష్టం గణాంకాలే! యుద్ధం కూడా రోజువారీ దినచర్యలా రొటీన్‌గా మారిపోయినప్పుడు ఒక్క కన్నీటి బొట్టయినా రాలుతుందా? అయినా ఉక్రెయిన్ కోసం ఏడ్చేవాళ్లెవరు? తండ్రినో, భర్తనో, కొడుకునో కోల్పోయిన అభాగ్యులు తప్ప!

**పక్కింటి గొడవ స్థాయికి...**

యుద్ధం తొలినాళ్లలో ఇకపై చమురెలా అన్నదే యూరప్‌ను వేధించిన ప్రశ్న. యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలు తమ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యాపైనే ఆధారపడేవి. సహాయ నిరాకరణలో భాగంగా ఆ దిగుమతులను నిలిపివేయక తప్పలేదు. తప్పని పరిస్థితుల్లో జర్మనీ నుంచి ఇటలీ దాకా, పోలండ్ దాకా తమ దిగుమతుల పాలసీని మార్చుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నాయి. అధిక ధరకు చమురును ఇతర దేశాల నుంచి కొనాల్సి వచ్చినా, పొదుపు మంత్రంవేసి కుదుటపడ్డాయి. ప్రత్యామ్నాయ మార్గం దొరికే వరకు యుద్ధం తమ గుమ్మం ముందే కరాళ నృత్యం చేస్తోందన్నంతగా హడలిపోయి ఉక్రెయిన్ పట్ల కాస్త సానుభూతిని, కాసిన్ని కన్నీటి బొట్లను రాల్చిన ఈ దేశాలన్నీ ఒక్కసారిగా కుదుటపడి ఊపిరి పీల్చుకున్నాయి. ఇప్పుడు యుద్ధం ఈ దేశాలకు పక్కింటి గొడవే..! ఇక భారత్ విషయానికొస్తే నాటో దేశాల సహాయ నిరాకర ణతో లాభపడిందనే చెప్పాలి. బ్యారెళ్లలో మూలుగుతున్న చమురును ఏదో ఒక ధరకు అమ్మేయాలన్న వ్యాపార సూత్రాన్ని అనుసరించి రష్యా భారత్‌కు డిస్కౌంట్ ఇస్తానని ప్రతిపాదించింది. ఫలితంగా గత ఏడాది మార్చి 31 దాకా రష్యా చమురు ఎగుమతుల్లో కేవలం 0.2 శాతంగా ఉన్న భారత్ వాటా ఈ ఏడాది ఏకంగా 22 శాతానికి చేరింది! యుద్ధమంటే బాంబుల మోత, నేలకొరిగిన సైనికులు, ఉసురు కోల్పోయిన సామాన్య పౌరులు మాత్రమే కాదు, కొందరికి వ్యాపారం కూడా! భారత్‌కు చమురు లాభమైతే ఆయుధ తయారీ దేశాలకు వ్యాపార లాభం. యుద్ధమంటే ఆయుధ నష్టం కూడా. జర్మనీ, ఫ్రాన్స్, చెక్ రిపబ్లిక్, పోలండ్ లాంటి దేశాలు సరిగ్గా దీన్నే తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. ఆయుధ ఉత్పత్తిని పెంచి, సొమ్ము చేసుకుంటున్నాయి. ఏడాది తిరిగేసరికి యుద్ధం చుట్టూ పరిస్థితులు ఇంతలా మారితే కదనరంగంలో పిట్టల్లా రాలుతున్న వారి గురించి ఎవరాలోచిస్తారు? ప్రాథమ్యాల జాబితాలో యుద్ధం ఇప్పుడు చిట్టచివరి స్థానానికి నెట్టివేతకు గురైంది. రణక్షేత్రంలోని వైరి పక్షాలకు తప్ప మిగతా దేశాలకు ఇప్పుడది కేవలం ఒక వార్త మాత్రమే!

**కొసమెరుపు**

కదనరంగంలో గెలుపోటములు ఇప్పుడప్పుడే తేలే అవకాశమే లేదు. ఎవరిది పైచేయి అంటే చెప్పడం కూడా కష్టమే. స్థూలంగా చెప్పాలంటే రష్యా ఆక్రమించుకున్న భూభాగంలో 54 శాతాన్ని ఉక్రెయిన్ మళ్లీ తన అధీనంలోకి తెచ్చుకుంది. అన్ని రోజులూ ఒక్కరివి కాదంటారు కదా! ఒకరోజు రష్యాదైతే మరో రోజు ఉక్రెయిన్‌ది..అంతే! ఇప్పుడు ఈ యుద్ధం ప్రపంచానిది ఎంతమాత్రం కాదు, రష్యా–ఉక్రెయిన్‌లది మాత్రమే. కొనసాగించడంతో పాటు ముగించడం కూడా ఆ రెండు దేశాల చేతుల్లోనే ఉంది. అయినా ఈ యుద్ధాన్ని ఎవరు పట్టించుకుంటున్నారిప్పుడు?

**బావుకున్నదేమీ లేదు**

మిత్ర దేశాలు, శత్రు దేశాలు, తటస్థ దేశాలను, వాటి వైఖరులను పక్కన పెడితే వైరి పక్షాలైన రష్యా, ఉక్రెయిన్ కూడా బావుకున్నదేమీ లేదు. ప్రాణనష్టం, ఆయుధ నష్టాల్లో హెచ్చుతగ్గులే తప్ప రెండు దేశాలూ తమ పురోగతిని ఓ నలభై, యాభై ఏళ్ల వెనక్కు నెట్టేసుకున్నట్టే! శ్మశాన వాటికలా మొండి గోడలతో నిలిచిన ఉక్రెయిన్ మునుపటి స్థితికి చేరుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందో యుద్ధం ముగిస్తే తప్ప అంచనా వేయలేం. యుద్ధం వల్ల పోగొట్టుకున్న పేరు ప్రతిష్టలను, కోల్పోయిన వీర సైనికులను రష్యా వెనక్కు తెచ్చుకోగలదా? ఏడాదైనా ఉక్రెయిన్‌పై పట్టు బిగించడంలో ఘోరంగా విఫలమైన రష్యా సైనిక శక్తి ప్రపంచం దృష్టిలో ప్రశ్నార్థకం కాలేదా? నియంత పోకడలతో రష్యాను జీవితాంతం ఏలాలన్న అధ్యక్షుడు పుతిన్ పేరు ప్రతిష్టలు యుద్ధంతో పాతాళానికి దిగజారలేదా? ఆయన తన రాజ్యకాంక్షను, తన అహాన్ని మాత్రమే తృప్తి పరచుకోగలిగారే తప్ప... ప్రపంచాన్ని కాదు, తన ప్రజలను కానే కాదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరిస్థితి కూడా పుతిన్‌కు భిన్నంగా ఏమీ లేదు. గొంగళి పురుగు సీతాకోక చిలుకగా రూపాంతరం చెందినట్టు జెలెన్‌స్కీ హాస్య నటుడి నుంచి హీరో అయ్యారు. రష్యా క్షిపణి దాడుల్లో దేశం వల్లకాడులా మారుతున్నా జెలెన్‌స్కీపై మాత్రం పొగడ్తల వర్షం కురుస్తూనే ఉంది. ఆయన ఎక్కడికెళ్లినా రాచ మర్యాదలతో స్వాగతం పలుకుతున్నారు. సాహసివంటూ పొగుడుతున్నారు. దేశం నాశనమవుతోందని బాధ పడాలో, ఎగురుతున్న తన కీర్తిబావుటాను చూసి సంతోషించాలో జెలెన్‌స్కీకి అర్థం కావడం లేదు. బహుశా ఆయన త్రిశంకుస్వర్గంలో ఉండి ఉంటారు.

### ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం లాలూ కుమార్తెలు, కుమారుడి నివాసాల్లో ఈడీ సోదాలు

**న్యూఢిల్లీ/పట్నా:** 'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణంతో సంబంధం ఉన్న మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణను వేగవంతం చేసింది. బిహార్‌లోని పలు నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేతల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఆర్జేడీ సీనియర్ నేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ముగ్గురు కుమార్తెలు రాగిణి యాదవ్, చందా యాదవ్, హేమా యాదవ్, తనయుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ నివాసాల్లోనూ సోదాలు జరిగాయి. దర్యాప్తులో భాగంగా పట్నా, ఫుల్వారీ షరీఫ్, ఢిల్లీ, రాంచీ, ముంబైలో సోదాలు చేపట్టినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. దక్షిణ ఢిల్లీలో తేజస్వీ యాదవ్ ఇంట్లో సోదాలు జరుగుతున్నప్పుడు ఆయన అక్కడ ఉన్నారో లేదో తెలియరాలేదు. సీబీఐ, ఈడీ ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష నేతలను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆర్జేడీ నాయకుడు మనోజ్ ఝా మండిపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యులు, ఆర్జేడీ నేతలు కొందరు యువకుల వద్ద భూములు తీసుకొని, రైల్వేశాఖలో ఉద్యోగాలు కల్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో మనీ లాండరింగ్ కోణం సైతం ఉండడంతో ఈడీ దర్యాప్తు సాగిస్తోంది. లాలూ, ఆయన భార్య రబ్రీదేవితో పాటు మరో 14 మందిపై సీబీఐ ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసింది.

### ఇరాన్, సౌదీ అరేబియా స్నేహగీతం

**దుబాయ్:** ప్రత్యర్థి దేశాలుగా ఇన్నాళ్లూ కత్తులు దూసుకున్న ఇరాన్, సౌదీ అరేబియా ఇప్పుడు స్నేహగీతం ఆలపిస్తున్నాయి. దౌత్యపరమైన సంబంధాలను పునరుద్ధరించుకొనేందుకు, రాయబార కార్యాలయాలను తెరిచేందుకు ఇరు దేశాలు శుక్రవారం అంగీకారానికొచ్చాయి. ఇరాన్, సౌదీ అరేబియా మధ్య ఏడేళ్ల క్రితం సంబంధాలు తెగిపోయాయి. చైనా చొరవతో మళ్లీ సంబంధాలు మెరుగుపడుతున్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య సాయుధ ఘర్షణ తలెత్తే ప్రమాదం ఇక తప్పినట్లేనని పరిశీలకులు చెబుతున్నారు. గల్ఫ్‌లోని అరబ్ దేశాలు అగ్రరాజ్యం అమెరికా వైపు మొగ్గుచూపకుండా చైనా ఎత్తుగడలు వేస్తోంది. ఇందులో భాగంగా ఇరాన్, సౌదీ అరేబియా నడుమ ఇటీవలే సయోధ్య కుదిర్చింది. ఇది చైనాకు దౌత్యపరంగా అతిపెద్ద విజయమని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనాతో కుదిరిన ఒప్పందంపై ఇరాన్, సౌదీ అరేబియా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. అయితే, దీనిపై చైనా మీడియా ఇంకా స్పందించలేదు. యెమెన్‌లో ఇరాన్, సౌదీ అరేబియా ఘర్షణలు కూడా సమసేలా కనిపిస్తున్నాయి.

## మహిళల సారథ్యంలో అభివృద్ధి వైపు భారత్

**ఎస్‌హెచ్‌జీలను యూనికార్న్‌ల స్థాయికి తీసుకెళ్తాం: ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ:** భారతదేశం గత 9 ఏళ్లలో మహిళాభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి వైపు పయనించిందని ప్రధాని మోదీ అన్నారు. మహిళా స్వయం సహాయక బృందా(ఎస్‌హెచ్‌జీ)లను యూనికార్న్‌ల స్థాయికి తీసుకెళతామని చెప్పారు. మహిళా సాధికారతపై శుక్రవారం జరిగిన పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. 'ఇంజనీరింగ్, సైన్స్, టెక్నాలజీ, మేథ్స్ రంగాల్లో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 43%కి చేరుకుంది. స్వయం సహాయ సంఘాలను కూడా ఈ ఏడాది యూనికార్న్‌లుగా మార్చాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ఎస్‌హెచ్‌జీలకు మద్దతుగా నిలుస్తాం. గత 9 ఏళ్లలో ఎస్‌హెచ్‌జీల్లో 7 కోట్ల మంది మహిళలు చేరారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా అందించిన రుణాలు రూ.6.25 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయేతర ప్రతి ఐదు వ్యాపారాల్లో ఒకటి మహిళే నడుపుతున్నారు'అని ఆయన చెప్పారు. స్టాక్ మార్కెట్‌లో నమోదు కాకుండానే 1 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదిగిన కంపెనీలనే యూనికార్న్‌లంటారు. 'ముద్రా రుణ గ్రహీతల్లో 70% మంది మహిళలే. వీరు తమ కుటుంబ సంపదను పెంచడంతోపాటు దేశానికి నూతన ఆర్థిక మార్గాలను తెరుస్తున్నారు. మహిళల పట్ల గౌరవం, సమానత్వ భావన స్థాయిలను పెంచడం ద్వారా మాత్రమే దేశం ముందుకు సాగుతుంది'అని ప్రధాని చెప్పారు.

**విపత్తులొస్తే నష్టాన్ని తగ్గించుకోగలగాలి**

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారం తీసుకోవాలని ప్రధానమంత్రి అన్నారు. విపత్తు ముంచుకొచ్చాక స్పందించడం కంటే, ముందుగానే ఫ్యూచర్ టెక్నాలజీని వినియోగించుకొని జరిగే నష్టాన్ని తగ్గించుకోవాలన్నారు. నేషనల్ ప్లాట్‌ఫారమ్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (ఎన్‌పీడీఆర్‌ఆర్) మూడో సదస్సును శుక్రవారం ప్రారంభించి ప్రధాని మాట్లాడారు.

## ఈడీ కస్టడీకి మనీష్ సిసోడియా

**సాక్షి, న్యూఢిల్లీ:** లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను ఈ నెల 17 వరకూ కస్టడీలోకి తీసుకునేందుకు రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఈడీని అనుమతించారు. సీబీఐ చేతిలో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న సిసోడియాను, తాజాగా ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేసి శుక్రవారం ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. ఆయన్ను పదిరోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ తరపు న్యాయవాది కోరారు. వాదనల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. కవితతో ఆప్ నేత విజయ్ నాయర్ భేటీ అయ్యారని చెప్పారు.

**సిసోడియా 14 ఫోన్లు ధ్వంసం చేశారు: ఈడీ**

ఎక్సైజ్ పాలసీ అమలులో సిసోడియా పాత్ర ఉందని, కొన్ని ప్రైవేటు సంస్థలకు హోల్‌సేల్ వ్యాపార లాభం 12 శాతం ఇవ్వాలనే కుట్రలో భాగంగా ఈ పాలసీ అమలు చేశారని ఈడీ న్యాయవాది ఆరోపించారు. సౌత్ గ్రూపు సభ్యులు 9 జోన్లలో నియంత్రణ తీసుకున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్ష్యాల ధ్వంసంలో భాగంగా సిసోడియా 14 ఫోన్లు ధ్వంసం చేశారని వీటిలో రెండింటిని మాత్రమే రికవరీ చేయగలిగామని తెలిపారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు పరిశీలిస్తే మద్యం పాలసీ రూపకల్పనలో సిసోడియా ప్రమేయం ఉన్నట్లు స్పష్టం అవుతోందన్నారు. ఇది రూ.292 కోట్లకు పైగా విలువైన నేరమని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించాల్సిన ఉన్నందున సిసోడియాను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ తరపు న్యాయవాది కోరారు.

**ఎల్జీ క్లియర్ చేసిన తర్వాతే అమల్లోకి..**

మనీలాండరింగ్ ఆరోపణలు చేస్తున్నప్పటికీ ఒక రూపాయి కూడా సిసోడియా నుంచి స్వాధీనం చేసుకోలేదని ఆయన తరపు న్యాయవాది కృష్ణన్ తెలిపారు. పాలసీకి సంబంధించిన ఫైల్ లెఫ్టినెంట్ గవర్నర్ క్లియర్ చేసిన తర్వాతే అమల్లోకి వచ్చిందని, కాబట్టి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కూడా ఈడీ ప్రశ్నిస్తుందని భావిస్తున్నామని కృష్ణన్ పేర్కొన్నారు. అనంతరం సిసోడియాను ఈ నెల 17 వరకూ ఈడీ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. కాగా, లిక్కర్ స్కామ్‌కు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో బెయిల్ కోరుతూ మనీష్ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 21న దీనిపై విచారణ చేపడతామని జడ్జి స్పష్టం చేశారు.

## చరిత్రకెక్కిన జిన్‌పింగ్

- చైనా అధ్యక్షుడిగా, సీఎంసీ చైర్మన్‌గా మూడోసారి
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్లమెంట్
- మరో ఐదేళ్లు పదవుల్లో కొనసాగనున్న జిన్‌పింగ్



**బీజింగ్:** డ్రాగన్ దేశం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్(69) సరికొత్త చరిత్ర సృష్టించారు. దేశాధ్యక్షుడిగా, సైన్యాధిపతిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. జిన్‌పింగ్ ఎన్నికకు చైనా పార్లమెంట్ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. ఆయన చైనా అధ్యక్షుడిగా, అత్యంత శక్తివంతమైన సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ) చైర్మన్‌గా మరో ఐదేళ్లపాటు పదవుల్లో కొనసాగుతారు. ఒకవైపు అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ)తో ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతుండడం, మరోవైపు చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న తరుణంలో జిన్‌పింగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన జీవితకాలం ఇదే పదవిలో కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం పార్టీ రాజ్యాంగాన్ని 2018లో సవరించారు.

**ఉపాధ్యక్షుడిగా హన్ జెంగ్**

జిన్‌పింగ్‌ను మరోసారి దేశాధ్యక్షుడిగా, సీఎంసీ చైర్మన్‌గా నియమిస్తూ అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) చేసిన ప్రతిపాదనను రబ్బర్ స్టాంప్ పార్లమెంట్‌గా ముద్రపడిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) లాంఛనంగా ఆమోదించింది. పార్లమెంట్‌లోని 2,952 మంది సభ్యులు అంగీకారం తెలిపారు. చైనాలో ఒక నాయకుడు మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇదే ప్రథమం. జిన్‌పింగ్ కంటే ముందు పనిచేసిన అధ్యక్షులంతా రెండు పర్యాయాలే(10 సంవత్సరాలు) పదవీలో కొనసాగారు. చైనా మాజీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు హన్ జెంగ్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్‌పీసీ నియమించింది. గత ఏడాది అక్టోబర్ జరిగిన కమ్యూనిస్ట్ పార్టీ ప్లీనరీలో జిన్‌పింగ్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. మావో జెడాంగ్ తర్వాత చైనా కమ్యూనిస్ట్ పార్టీకి మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైజిన్‌పింగ్ రికార్డుకెక్కారు.

**దూకుడు పెంచుతారా?**

జిన్‌పింగ్ చేతిలో ప్రస్తుతం మూడు శక్తివంతమైన పదవులు ఉన్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా మరోసారి కుర్చీ దక్కడంతో జిన్‌పింగ్ దూకుడు పెంచే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా. పొరుగు దేశం భారత్‌పై ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఇరు దేశాల నడుమ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదం ఉందంటున్నారు. సెంట్రల్ కేబినెట్(స్టేట్ కౌన్సిల్)కు నేతృత్వం వహిస్తున్న చైనా ప్రధాని (ప్రీమియర్) లీ కెకియాంగ్ పదవీ కాలం ముగిసింది. ఆయన స్థానంలో జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన లీ కియాంగ్‌ను శనివారం ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

### మాజీ అగ్నివీర్‌లకు బీఎస్‌ఎఫ్ ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్

**కేంద్ర హోం శాఖ వెల్లడి**

**న్యూఢిల్లీ:** సైనిక దళాల్లో ఎంపికల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన అగ్నిపథ్ పథకం పట్ల యువతను ఆకర్షితులను చేసే దిశగా కేంద్రం ఒక ప్రకటన చేసింది. అగ్నివీర్ ద్వారా ఎంపికై నిబంధనల మేరకు నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని రిటైరైన అభ్యర్థులకు సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్) ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించింది. అంతేకాదు, గరిష్ట వయోపరిమితిలో కూడా సడలింపులు ఉంటాయని తెలిపింది. ఇందుకు వీలు కల్పిస్తూ బీఎస్‌ఎఫ్ జనరల్ డ్యూటీ కేడర్(నాన్ గెజిటెడ్) రిక్రూట్‌మెంట్–2015 నిబంధనల్లో మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇవి మార్చి 9వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయని ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి బ్యాచ్ మాజీ అగ్నివీర్‌లకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల వరకు సడలింపు ఉంటుందని కేంద్ర హోం శాఖ అందులో వివరించింది. ఇతర బ్యాచ్‌ల వారికైతే మూడేళ్ల వరకు సడలింపు ఉంటుంది. మాజీ అగ్నివీర్‌లకు ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ నుంచి మినహాయింపు కూడా ఉంటుంది.

### దేశంలో మొదటి హెచ్3ఎన్2 మరణాలు నమోదు

- కేరళ, హరియాణాల్లో ఇద్దరు మృతి
- మార్చి చివరికల్లా కేసులు తగ్గుతాయంటున్న కేంద్రం




**న్యూఢిల్లీ:** దేశంలో కొత్తరకం ఇన్‌ఫ్లూయెంజా హెచ్3ఎన్2 ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కర్ణాటక, హరియాణాల్లో ఈ సీజనల్ వైరస్ బారిన పడి ఇద్దరు మృతి చెందారు. వైరస్ వ్యాప్తి, కేసులు, మరణాల సంఖ్య తదితర పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఈ నెలాఖరుకు కేసులు తగ్గుముఖం పడతాయని భావిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. పిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ కలిగించే ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ సీజనల్‌గా వ్యాప్తి చెందుతుంటాయని పేర్కొంది. మనదేశంలో ఇవి ఏటా జనవరి–మార్చి నెలల మధ్య, రుతుపవనాల సీజన్‌లోనూ ఎక్కువగా కనిపిస్తుంటాయని తెలిపింది. 'కర్ణాటకకు చెందిన హీరె గౌడ(82) హెచ్3ఎన్2 వైరస్ బారిన పడి మార్చి ఒకటో తేదీన చనిపోయారు. ఆయనకు ఇప్పటికే డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి సమస్యలున్నాయి. ఫిబ్రవరి 24న ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మార్చి ఒకటో తేదీన చనిపోయారు. అదేవిధంగా, హరియాణాలోని జింద్ జిల్లాకు చెందిన 56 ఏళ్ల లంగ్ కేన్సర్ రోగికి కూడా జనవరి 17న హెచ్3ఎన్2గా నిర్ధారణైంది. ఆయన ఫిబ్రవరి 2న మృతి చెందారు'అని అధికారులు చెప్పారు. దేశంలో జనవరి 2 నుంచి మార్చి 5 వరకు 451 హెచ్3ఎన్2 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ తెలిపింది. అదేవిధంగా, మార్చి 9వ తేదీనాటికి వివిధ రకాల ఇన్‌ఫ్లూయెంజా కేసులు 3,038 వరకు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా జనవరిలో ఇన్‌ఫ్లూయెంజా వంటి లక్షణాలతో వివిధ ఆస్పత్రుల్లో 3,97,814 కేసులు నమోదు కాగా, వాటి సంఖ్య ఫిబ్రవరిలో 4,36,523కు, మార్చి 9వ తేదీకల్లా ఇవి 1,33,412కు చేరాయని పేర్కొంది. ఇందులో తీవ్ర శ్వాసకోశ సమస్యల(ఎస్ఏఆర్ఐ)తో జనవరిలో 7,041, ఫిబ్రవరిలో 6,919, మార్చి మొదటి 9 రోజుల్లో 1,866 కేసులు నమోదయ్యాయి.

**అప్రమత్తంగా ఉండండి:** దేశంలో పెరుగుతున్న హెచ్3ఎన్2 కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాష్ట్రాలను కోరారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి నమోదవుతున్న ఇన్‌ఫ్లూయెంజా కేసుల్లో హెచ్3ఎన్2 రకమే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు.

### బీబీసీకి వ్యతిరేకంగా గుజరాత్ అసెంబ్లీ తీర్మానం

**గాంధీనగర్:** 'ఇండియా: ది మోదీ క్వశ్చన్'పేరుతో 2002లో జరిగిన ఘర్షణలపై బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేసి ప్రధాని మోదీ ప్రతిష్టను దెబ్బతీసిన బీబీసీపై చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతూ శుక్రవారం గుజరాత్ అసెంబ్లీ తీర్మానం చేసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులను స్పీకర్ బహిష్కరించిన అనంతరం బీజేపీ సభ్యుడు విపుల్ వకీల్ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టారు.


### బీజేపీకి మద్దతు పలికిన స్వతంత్ర ఎంపీ సుమలత



**మాండ్య:** కర్ణాటకకు చెందిన స్వతంత్ర ఎంపీ సుమలత అంబరీష్ కేంద్రంలోని బీజేపీకి పూర్తిస్థాయి మద్దతు ప్రకటించారు. మోదీ నాయకత్వంలో భారత్‌కు లభించిన సుస్థిరత, దేశం ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన ఖ్యాతిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. 'నాలుగేళ్లపాటు స్వతంత్రంగా వ్యవహరించాను. ఈ సమయంలో బహిరంగ సమావేశాల్లో పాల్గొనడం వంటి విషయాల్లో పలు సవాళ్లను ఎదుర్కొన్నాను. వీటిని దృష్టిలో ఉంచుకునే మద్దతు అవసరమని భావించాను. అందుకే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తున్నాను'అని ఆమె మీడియాతో అన్నారు. కన్నడ అగ్ర నటుడు దివంగత అంబరీష్ భార్య అయిన సుమలత బహు భాషా నటి.

## ఆలయాలపై దాడులు ఆందోళనకరం

- ఆస్ట్రేలియాలో ఘటనలతో కలత చెందుతున్నాం: ప్రధాని మోదీ
- భారతీయుల భద్రతకు మాది పూచీ: ఆస్ట్రేలియా ప్రధాని అల్బానీస్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మోదీ, పక్కన అల్బానీస్

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. అంతర్జాతీయ పరిణామాలతోపాటు కీలక ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ప్రతిష్టాత్మకమైన వాణిజ్య ఒప్పందం, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రత, పరస్పర సహకారం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. క్లీన్ ఎనర్జీ, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఖనిజాలు, వలసలు, సప్లై చైన్లు, విద్యా, సాంస్కృతికం, క్రీడల్లో ఇకపై కలిసి పనిచేయాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని అంగీకారానికొచ్చారు. ఆస్ట్రేలియాలో హిందూ ఆలయాలపై ఇటీవల జరిగిన దాడుల గురించి అల్బానీస్ వద్ద మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ మద్దతుదారుల కార్యకలాపాలు పెరుగుతుండడాన్ని గుర్తుచేశారు. క్రీడలు, నవీన ఆవిష్కరణలు, ఆడియో–విజువల్ ప్రొడక్షన్, సౌర విద్యుత్ విషయంలో పరస్పర సహకారానికి సంబంధించి నాలుగు ఒప్పందాలపై భారత్, ఆస్ట్రేలియా ప్రతినిధులు సంతకాలు చేశారు. చర్చల అనంతరం ఆంథోనీ అల్బానీస్‌తో కలిసి నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. "ఆస్ట్రేలియాలోని హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నట్లు గత కొన్ని వారాలుగా మీడియాలో నిత్యం వార్తలు వస్తుండడం నిజంగా విచారకరం. అలాంటి దాడులు భారత్‌లో ప్రతి ఒక్కరికీ సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. ఆలయాలపై దాడుల పట్ల మన మనసులు కలత చెందుతున్నాయి. మన మనోభావాలను, ఆందోళనలను ఆస్ట్రేలియా ప్రధానమంత్రికి తెలియజేశా. ఆస్ట్రేలియా సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో భారతీయులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారతీయుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అల్బానీస్ నాకు హామీ ఇచ్చారు. భారతీయుల భద్రత విషయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వానికి సాధ్యమైనంతవరకూ మా వంతు సహకారం అందిస్తాం'' అని పేర్కొన్నారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ద్వైపాక్షిక భద్రతా సహకారం అత్యంత కీలకమని మూలస్తంభమని మోదీ ఉద్ఘాటించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మారిటైమ్ సెక్యూరిటీ, డిఫెన్స్, సెక్యూరిటీ కో–ఆపరేషన్ గురించి తాము చర్చించామని అన్నారు.

**త్వరలోనే ఆర్థిక సహకార ఒప్పందం: అల్బానీస్**

ఇండియా–ఆస్ట్రేలియా సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని(సీఈసీఏ)ను సాధ్యమైనంత త్వరగా కుదుర్చుకోవాలని మోదీ, తాను అంగీకారానికి వచ్చినట్లు ఆంథోనీ అల్బానీస్ తెలిపారు. ఈ ఏడాదిలోనే ఒప్పందాన్ని ఖరారు చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సహకార వాణిజ్య ఒప్పందం(ఈసీటీఏ) గత ఏడాది ఖరారైన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఇరు పక్షాలు సీఈసీఏపై కసరత్తు చేస్తున్నాయి. వలసల ఒప్పందం పురోగతిలో ఉందని, దీనివల్ల ఇరు దేశాల విద్యార్థులకు, వృత్తి నిపుణులకు లబ్ధి చేకూరుతుందని అల్బానీస్ తెలిపారు. భారత్‌తో తమకు బహుముఖ సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాదిలో మే నెలలో తమ దేశంలో 'క్వాడ్' సదస్సు జరగబోతోందని, మోదీ రాకకోసం ఎదురు చూస్తున్నానని వివరించారు. జీ20 సదస్సులో పాల్గొనడానికి సెప్టెంబర్‌లో భారత్‌కు వస్తానని అన్నారు.

# సాక్షి హైదరాబాద్

శనివారం ; 11 ; మార్చి ; 2023




## మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్‌లో మద్యం దుకాణాలు మూసి ఉంటాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, మిలిటరీ క్యాంటీన్లు, స్టార్ హోటళ్లలోని క్లబ్‌లు బంద్ ఉంటాయని హైదరాబాద్ సీపీ ఆనంద్ తెలిపారు.



## బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో ప్రారంభం


మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో- 2023ను నటి అమల ప్రారంభించారు.

-8లో

## మార్చి 12 వరకు 'మనూ' యూజీ కోర్సుల దరఖాస్తులు

రాయదుర్గం: అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ కోర్సుల కోసం దరఖాస్తు ఫారం సమర్పించడానికి మార్చి 12వ తేదీ చివరి రోజని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వనజ శుక్రవారం తెలిపారు. బీఏ, బీఏ(జేఎంసీ), బీకామ్, బీఎస్సీ(ఎంపీసీ, ఎంపీసీఎస్, జెడ్‌బీసీ) కోర్సుల్లో కామన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ) 2023 ద్వారా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.





# కళతప్పి.. ప్రాణం పోయి..!

ఇది కుత్బుల్లాపూర్ పరిధి గాజులరామారంలో స్వయంగా మంత్రి కేటీఆర్ గతేడాది జనవరిలో ప్రారంభించిన 'ప్రాణవాయు' అర్బన్ ఫారెస్ట్ పార్కు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో అందమైన కుర్చీలు, బెంచీలు, రంగురంగుల పక్షులు, జంతువుల బొమ్మలు, పచ్చని చెట్లు, వాకింగ్ ట్రాక్‌తో ఆకర్షణీయంగా ప్రారంభమైన ఈ పార్కు ఏడాదిలోనే కళ తప్పింది. సరైన నిర్వహణ లేక కుర్చీలు, బెంచీలు విరిగిపోయాయి. జింకలు, సింహాలు, పులుల ప్రతిమలు నేలకొరిగాయి. వాష్‌రూంల డోర్లు, కిటికీలు విరిగిపోయాయి. రూ.కోట్లు ఖర్చు చేసి.. ఆర్భాటంగా ప్రారంభించి... నిర్వహణ గాలికొదిలేయడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. - సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్









## న్యూస్‌రీల్

### హవాలా డబ్బు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



డబ్బుతో పట్టుబడ్డ నందకిశోర్

సుల్తాన్‌బజార్: అక్రమంగా హవాలా నగదును రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.40 లక్షలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ బాలగంగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బంజారాహిల్స్‌లోని ఏహెచ్‌ఎస్ ఆర్ట్స్ స్టూడియో నిర్వహిస్తున్న సోనిత్ అగర్వాల్ అనే వ్యాపారి వద్ద నందకిశోర్ జాజు క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రూప్‌బజార్‌లో ఓ వ్యక్తికి రూ.40 లక్షల హవాలా నగదును ఇచ్చి రావాలని యజమాని కోరడంతో నందకిశోర్ నగదుతో కోఠికి వచ్చాడు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులకు దొరికాడు. నందకిశోర్ వద్ద రూ.40 లక్షల నగదును స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టుకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది.

### అటవీ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ అదుర్స్



శిక్షణ పూర్తిచేసుకున్న అధికారులు

సుభాష్‌నగర్: అటవీ క్షేత్ర అధికారుల 8వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను శుక్రవారం దూలపల్లిలోని అకాడమీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకులు ఎలుసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ అధికారులు తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించి అటవీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పాసింగ్ అవుట్ పరేడ్‌ను తనిఖీ చేసిన అనంతరం ముఖ్యఅతిథులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సుమంత గోస్వామి బ్యాచ్ మొత్తంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 10 బంగారు, 3 వెండి పతకాలను సాధించారు. ప్రత్యేక అతిథులుగా అకాడమీ మాజీ సంచాలకులు పి.రఘువీర్, పీవీ రాజారావు, అతిథులుగా విశ్రాంత అటవీ అధికారులు ప్రదీప్, జి.రవీందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వీరు లాంగ్ స్టాండింగ్.. మరి వారు?

## సాధారణ ఉద్యోగులపైనే బల్దియా ప్రతాపం

- ఉన్నతాధికారులను మాత్రం ఎన్నేళ్లయినా కదల్చరా?
- బల్దియాకు భారమైన వారిపై చర్యలు కరువు
- మేయర్ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



సాక్షి, సిటీబ్యూరో: బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలపై సమీక్ష సందర్భంగా ఆ విభాగంలో నాలుగేళ్లు పైబడిన వారిని బదిలీ చేయాలని మేయర్ విజయలక్ష్మి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతవరకు బాగానే ఉంది..కానీ వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి..కొన్ని విభాగాల్లో దశాబ్దానికి పైగా కొనసాగుతున్న వారిని మాత్రం కనీసం కదల్చరా? అనే ప్రశ్నలు వెలువడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏ అవినీతి, అక్రమాలు వెలుగుచూసినా చిరుద్యోగులను, సాధారణ ఉద్యోగులను బలి చేయడం బల్దియాకు అలవాటుగా మారిందని, అదే పెద్దస్థాయిలోని వారు బల్దియా ఖజానాకు భారంగా మారినా వారిని మాత్రం కనీసం కన్నెత్తిచూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెప్పుడు మాటలు వినడం తప్ప వాస్తవాలు గ్రహించరా అనే ప్రశ్నలు సైతం ఈ సందర్భంగా వెలువడుతున్నాయి. పాలకమండలి ఏర్పాటై రెండేళ్లు దాటినా తగిన అవగాహన లేకపోవడం విడ్డూరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల వంటివారిపై మాత్రం ప్రతాపం చూపుతున్నారని, ఆపై స్థాయి వారి జోలికి వెళ్లడం లేరంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులే కానప్పటికీ, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి డిప్యుటేషన్లపై వచ్చి ఇక్కడే తిష్టవేసుకున్న వారిని మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఒక్క విభాగమని కాదు.. విద్యుత్ విభాగం నుంచి మొదలు పెడితే యూసీడీ వరకు.. మేయర్ పేషీతో సహ వివిధ విభాగాల్లో ఏళ్లకేళ్లుగా కొనసాగుతున్న వారి వల్ల, డిప్యుటేషన్లు ముగిసినా ఇంకా కొనసాగుతున్న వారి వల్ల బల్దియా ఖజానాకు లోటు తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని, వారి వాహనాలు తదితరమైన వాటి పేరిట జీహెచ్‌ఎంసీ అదనపు భారాలు మోయాల్సి వస్తోందని జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు చెబుతున్నారు. ఇంకా, పై ఆదాయానికి అలవాటుపడిన వారిపై కనీస చర్యలు లేవని కొందరు డిప్యూటీ, జోనల్ కమిషనర్లతోపాటు టాక్స్, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారి గురించి ప్రస్తావిస్తున్నారు. ఏఎంఓహెచ్‌లపై ఎన్ని విమర్శలున్నా, డిప్యుటేషన్లు ముగిసిపోయినా వారిలో కొందరిని ఇంకా మాతృసంస్థలకు పంపకుండా కొనసాగిస్తుండటం దేనికి నిదర్శనం అనే ప్రశ్నలు సైతం తలెత్తుతున్నాయి.

**వదలనే వదలరు..**

ఇది ఒకవైపు దృశ్యం కాగా, మరోవైపు రిటైరయ్యాక సైతం పీఏలు, తదితర పేర్లతో జీహెచ్‌ఎంసీలోనే కొనసాగుతున్న వారు కూడా ఎందరో ఉన్నారని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. పైరవీలతో తిరిగి జీహెచ్‌ఎంసీలో చేరి కదలకుండా తిష్ట వేసుకున్న వారి వల్ల జీహెచ్‌ఎంసీకి నష్టమేనంటున్నారు. ఇక కొందరు ఉద్యోగులు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో ఎవరూ పట్టించుకోవడం లేరు. పైస్థాయిలోని వారికి నచ్చినట్లు మసలుకుంటే చాలు ఎప్పుడు వచ్చినా, ఎప్పుడు వెళ్లినా, అసలు రాకున్నా హాజరుకు లోటుండదు. జీతానికీ ఇబ్బంది ఉండదు. బల్దియాలో ఎన్నో లొసుగులున్నా ఉన్నతస్థాయిలో కళ్లు తెరచి చూసే యంత్రాంగం లేకపోవడం దౌర్భాగ్యమనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి.

### స్పెషాలిటీ విభాగాలు..

ఎలక్షన్ సెల్‌తో పాటు జీహెచ్‌ఎంసీలోని కొన్ని విభాగాల్లో ఏళ్ల తరబడిగా కొనసాగుతున్న వారు కానీ, రిటైరైన అధికారులు కానీ లేనిదే పనులు జరగడం లేదంటే పరిస్థితి అంచనా వేసుకోవచ్చు. ఆ విభాగాల్లో చిరుద్యోగుల నుంచి పైఅధికారుల వరకు ఇది వర్తిస్తుంది. జీహెచ్‌ఎంసీలో ఎందరో అధికారులున్నా, పాతవారు లేనిదే ఆ విభాగాలు పనిచేయలేకపోవడం బల్దియా దుస్థితికి అద్దం పడుతోంది.



# పన్ను చెల్లించకుంటే 200 శాతం పెనాల్టీ

## ట్యాక్స్ ఎగ్గొట్టే వాహనదారులపై ఇక కఠిన చర్యలు

- త్రైమాసిక పన్ను వసూళ్లపై కొనసాగుతున్న ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్
- గ్రేటర్‌లో 60 మంది ఎంవీఐలతో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కోవిడ్ కాలం నుంచి పెండింగ్‌లో పన్ను బకాయిలు
- తనిఖీలు మరింత ఉధృతం
- హైదరాబాద్ జేటీసీ పాండురంగ నాయక్

సాక్షి, సిటీబ్యూరో: త్రైమాసిక పన్ను చెల్లించకుండా పట్టుబడే వాహనాలపై భారీ ఎత్తున పెనాల్టీలు విధించేందుకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. సాధారణంగా వాహనదారులు పెండింగ్‌ల ఉన్న పన్ను బకాయిలపైన స్వచ్ఛందంగా ముందుకు వస్తే 50 శాతం వరకు అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉంది. కానీ రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే మాత్రం ఏకంగా 200 శాతం వరకు పెనాలిటీల రూపంలో చెల్లించవలసి వస్తుంది. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా ఆర్టీఏ కొనసాగిస్తున్న ప్రత్యేక తనిఖీలు వాహనదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 2.17 లక్షల వాహనాలు త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతుండగా, ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 75 వేలకు పైగా పన్ను చెల్లించని వాహనాలు ఉన్నట్లు అంచనా. ఈ వాహనాల్లో కొన్ని 3 నెలల కాలపరిమితికే పన్ను చెల్లించాల్సి ఉండగా 80 శాతం వాహనాలు కోవిడ్ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. చాలా వరకు 9 నెలల నుంచి 18 నెలల వరకు త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతున్నాయి. దీంతో వాహనాల నుంచి బకాయిలను రాబట్టేందుకు రవాణాశాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఫిబ్రవరి నెలాఖరులోనే తనిఖీలకు శ్రీకారం చుట్టినప్పటికీ ఈ నెల ఒకటో తేదీ నుంచి తనిఖీలను ఉధృతం చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు పన్ను చెల్లింపులకు గడువు విధించడంతో తనిఖీలను తీవ్రతరం చేశారు. ఇందుకోసం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 60 మంది మోటారు వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

**తేలికపాటి వాహనాలే అధికం..**

గ్రేటర్‌లో సుమారు 5 లక్షల వరకు రవాణా వాహనాలు ఉన్నాయి. వీటిలో 2 లక్షల లారీలు ఉన్నాయి. సరుకు రవాణా రంగంలో కీలకమైన లారీల్లో చాలా వరకు ఎప్పటికప్పుడు పన్ను చెల్లించి రవాణాశాఖ నుంచి అనుమతి పొందాయి. అలాగే మరో 10 వేలకు పైగా స్కూల్ బస్సులు, ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు,తదితర వాహనాలు సైతం సకాలంలో పన్ను చెల్లిస్తున్నట్లు అధికారులు చెప్పారు. చాలా వరకు తేలికపాటి రవాణా వాహనాల కేటగిరీ కిందకు వచ్చే టాటాఏస్‌లు, డీసీఎంలు, మినీ బస్సులు, మ్యాక్సీక్యాబ్‌లు వంటి వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. కోవిడ్ కాలంలో ఎలాంటి ఆదాయమార్గాలు లేకపోవడంతో వాహనదారులు త్రైమాసిక పన్ను చెల్లించలేకపోయారు. మరోవైపు రెండేళ్ల కాలపరిమితికి ప్రభుత్వం నుంచి మినహాయింపు లభించవచ్చుననే ఉద్దేశంతో చాలా మంది పన్ను చెల్లించకుండా ఉండిపోయారు. దీంతో ఇప్పుడు భారం పెరిగినట్లు వాహన యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు గతంలోనే రెండు త్రైమాసిక పన్ను వాయిదాలకు ప్రభుత్వం మినహాయింపునిచ్చినట్లు ఆర్టీఏ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సకాలంలో చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో సుమారు రూ.13 కోట్ల వరకు బకాయిలను వసూలు చేశారు. ప్రతి రోజు సగటున రూ.60 లక్షలకు పైగా పన్నులు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో ఎంవీఐకి రూ.7 లక్షల వరకు టార్గెట్ విధించారు.



### తనిఖీలు ఉధృతం

త్రైమాసిక పన్ను బకాయిలు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కార్యాచరణ చేపట్టాం. పన్ను చెల్లించని వాహనాలపైన తనిఖీలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాం. వాహనదారులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో లేదా ఈ సేవా కేంద్రాల ద్వారా పన్ను చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. తనిఖీ బృందాలు వాహనాలను జప్తు చేసి వెహికిల్ చెకింగ్ రిపోర్ట్ (వీసీఆర్) రాస్తే మాత్రం 200 శాతం పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది.

-జె.పాండురంగ నాయక్, జేటీసీ, హైదరాబాద్



## సాయన్నకు సీఎం నివాళి

ఇటీవల మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ముందు సాయన్న చిత్రపటానికి సీఎం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు సాయన్నకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు.

- కంటోన్మెంట్

## హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: డిజైనరీ దుస్తులు, వెడ్డింగ్ వేర్, ఆభరణాలతో ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం నటి గెహన సిప్పీ ప్రారంభించారు. మోడల్ పాలక్ అగర్వాల్, నిర్వాహకుడు డొమినిక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వివాహాది శుభకార్యాలకు అవసరమయ్యే ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

# తొలిసారిగా ఢిల్లీ బయట..

## సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే..

- సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అయినందునే నిస్సా ఎంపిక
- పరేడ్ తిలకించడానికి కేంద్ర హోం మంత్రి రాక
- త్వరలో అన్ని విమానాశ్రయాల్లోనూ ఫుల్ బాడీ స్కానర్లు
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన నిస్సా అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) రైజింగ్ డే కార్యక్రమం చరిత్రలో తొలిసారిగా ఢిల్లీ బయట జరుగుతోందని ఆ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (నార్త్) పియూష్ ఆనంద్ అన్నారు. అధికారులు, సిబ్బందికి అత్యుత్తమ శిక్షణ ఇస్తూ 2016 నుంచి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా నిలుస్తున్న నేపథ్యంలో హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడెమీని (నిస్సా) ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జరుగనున్న పరేడ్‌కు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరుకావడానికి అంగీకరించారని వివరించారు. రైజింగ్ డేకు సంబంధించిన వివరాలు వెల్లడించడానికి ఉన్నతాధికారులు శుక్రవారం హకీంపేటలోని నిస్సాలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 1969లో 3 వేల మందితో ప్రారంభమైన ఈ విభాగంలో ప్రస్తుతం 1.7 లక్షల మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**సెక్యూరిటీ కన్సల్టెన్సీగానూ కీలకపాత్ర...**

'సీఐఎస్ఎఫ్ విభాగం దేశ వ్యాప్తంగా 354 కీలక, సున్నిత సంస్థలకు భద్రతను కల్పిస్తోంది. వీటిలో విమానాశ్రయాలు, స్టీల్ ప్లాంట్స్, అణు ఇంధన సంస్థలు, ఢిల్లీ మెట్రోరైల్‌తో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలు సైతం ఉన్నాయి. దీంతో పాటు వివిధ ఏజెన్సీలు, సంస్థలకు సెక్యూరిటీ ఏర్పాట్లకు సంబంధించిన సలహాలు ఇచ్చే కన్సల్టెన్సీగానూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవలే అయోధ్య రామాలయానికీ భద్రతాంశాలపై కీలక సూచనలు అందించింది' అని ఏడీజీ (నార్త్) పీయూష్ ఆనంద్ పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

**ప్రయోగ దశలో ఫుల్ బాడీ స్కానర్లు..**

ఒకప్పుడు విమానాశ్రయాల్లో తనిఖీల కోసం ఎక్స్‌రే స్కానర్లు వాడే వాళ్లం. వీటి స్థానంలో సీటీ పరిజ్ఞానంతో పని చేసే స్కానర్లు వాడుతున్నాం. ప్రయోగాత్మక దశలో ఉన్న ఫుల్ బాడీ స్కానర్లను తర్వలో అన్ని విమానాశ్రయాల్లోనూ అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం ఇవి హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చిన్, పుణే, చెన్నైల్లో ప్రయోగాత్మకంగా వాడుతున్నాం. వీటిని వాడితే ఎవరినీ తాకాల్సిన పని లేకుండానే మెటల్స్, ఎక్స్‌ప్లోజివ్స్‌తో పాటు డ్రగ్స్‌ను గుర్తించవచ్చు అని ఎయిర్‌పోర్ట్స్ సెక్యూరిటీ విభాగం ఏడీజీ జ్ఞానేందర్ సింగ్ మాలిక్ పేర్కొన్నారు. దేశంలోనే ఉత్తమ సంస్థగా పేరున్న నిసాలో విదేశాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇస్తున్నామని నిస్సా డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు.

**ఏడాది కాలంలో సీఐఎస్ఎఫ్ పనితీరుకు ఉదాహరణలు**

- భద్రత కల్పిస్తున్న విభాగాలు, ఏజెన్సీలతో పాటు సంస్థల వద్ద చోరీలతో పాటు ఇతర నేరాలకు సంబంధించి 4506 కేసులను కొలిక్కి తీసుకువచ్చి 847 మందిని నేరగాళ్లను పట్టుకుంది. తదుపరి చర్యల నిమిత్తం వీరిని స్థానిక పోలీసులకు అప్పగించింది. సీఐఎస్ఎఫ్‌లోని ఫైర్ సర్వీస్ అధికారులు 2567 ప్రమాదాల్లో సమర్థంగా వ్యవహరించి రూ.137.88 కోట్ల ఆస్తినష్టం నివారించడంతో పాటు 18 మంది ప్రాణాలు కాపాడింది.
- గతేడాది ఏప్రిల్-ఈ ఏడాది జనవరి మధ్య వివిధ విమానాశ్రయాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న రూ.40.15 కోట్ల సొత్తు, నగదు గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఇందులో రూ.10.1 కోట్ల సొత్తు యజమానులకు అప్పగించింది. విమానాల్లోకి తీసుకువెళ్లాలని ప్రయత్నించిన 183 రకాలైన మందుగుండు, 15 రకాలైన ఆయుధాలను పట్టుకోవడంతో పాటు 47 నకిలీ ఈ టిక్కెట్లను గుర్తించింది.
- ఇటీవల వరుసగా చోటు చేసుకుటున్న గుండెపోటు ఉదంతాలతో సీపీఆర్‌కు ప్రాధాన్యత పెరిగి ప్రాచుర్యం వస్తోంది. అయితే సీఐఎస్ఎఫ్ అధికారులు 2019 నుంచి దీన్ని వినియోగించి 15 ప్రాణాలు కాపాడారు. వివిధ ప్రాంతాల్లో ఆత్మహత్యాయత్నాలు చేసుకుంటున్న వారినీ సీఐఎస్ఎఫ్ కాపాడింది.

## బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో ప్రారంభం



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న నటి అమల తదితరులు

మాదాపూర్: మిల్లెట్స్ భారతదేశానికి గర్వకారణమని సినీనటి అమల అక్కినేని పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు జరిగే బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో -2023ను మహిళా పారిశ్రామిక వేత్తలతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..సంప్రదాయ ధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. మిల్లెట్లను ఆహారంలో భాగం చేయాలని ప్రజలను కోరారు. ఈ ఎక్స్‌పోలో 15 రాష్ట్రాల నుంచి 220 మందికి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ఐఐఆర్ఎం సైంటిస్ట్ డాక్టర్ కేబీఆర్ఎస్ నిసార్థ, డాక్టర్ శిల్పిరెడ్డి పాల్గొన్నారు.



## పీఎంఆర్‌బీపీ అవార్డుకు హిమేష్ ఎంపిక



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) అవార్డుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన మాస్టర్ హిమేష్ చదలవాడ ఎంపికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం భారత ప్రభుత్వం తరపున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ హైదరాబాద్ కలెక్టర్ ఛాంబర్‌లో ప్రధానమంత్రి స్వదస్తూరితో ఉన్న సర్టిఫికెట్‌తో పాటు మెడల్, ట్యాబ్, వాచ్‌ను అందజేశారు. 2021 సంవత్సరానికి గాను ఇన్నొవేషన్ కేటగిరీలో హిమేష్ అల్జీమర్ వ్యాధిగ్రస్తుల కోసం రిస్ట్ బ్యాండ్‌ను తయారు చేశారు. ఈ రిస్ట్ బ్యాండ్ ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైంది.

## నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



లక్డీకాపూల్ : నిమ్స్‌లో పనిచేస్తున్న 1100 మంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హాస్పటల్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ.. నిమ్స్ యాజమాన్యం గత మూడు సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా యాజమాన్యం కార్మికులను మోసం చేస్తోందన్నారు. నిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. అందుకే తమ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

## హిందువులపై దాడులను అరికట్టాలి: వీహెచ్‌పీ



సాక్షి, సిటీబ్యూరో: గిరిజనులు, దళితులను, వివిధ రంగాలలో పనిచేస్తున్న హిందువులను టార్గెట్ చేసుకొని దుండగులు హత్యలకు పాల్పడుతున్నారని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాపూర్‌లో పవన్ నాయక్, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో హత్యకు గురైన ప్రీతి హంతకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేసింది. శుక్రవారం డీజీపీ అంజనీ కుమార్‌కు వీహెచ్‌పీ నేతలు వినతిపత్రం సమర్పించారు. భాగ్యనగరంలో రోహింగ్యా ముస్లింల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని, వారిని నియంత్రించాలని లేఖలో కోరారు. అలాగే వీహెచ్‌పీ నేత పగుడాకుల బాలస్వామిని టార్గెట్ చేసి రాచకొండ కమిషనర్ వార్నింగ్ ఇవ్వడంపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, ప్రచార సహ ప్రముఖ్ అనిల్ పాల్గొన్నారు.

# సేవకుడిని.. ఆలోచించండి..!

"ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు, 34 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు నాకే ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయభేరి మోగిస్తా. విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై కనీస అవగాహన లేని కొంతమంది డబ్బులతో ఓట్లు పొందాలని భావిస్తున్నారు. అలాంటి వారికి తగిన సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమాజ నిర్మాతలైన టీచర్లపైన ఉంది".



### మంచి మెజార్టీతో విజయం సాధిస్తా

- ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు, 34 సంఘాల మద్దతు నాకే
- 317 బాధితులకు న్యాయం జరిపిస్తా
- పెన్షన్ స్కీం కోసం పోరాడుతా
- 'సాక్షి'తో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'చట్ట సభలకు కార్పొరేట్ యాజమాన్యాల అధిపతులను పంపుతారో..? విద్య, ఉపాధ్యాయ, అధ్యాపక రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, ఏళ్ల తరబడి ఆయా రంగాల్లో పని చేస్తూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్న తనలాంటి సేవకుడిని పంపుతారో? విజ్ఞులైన ఉపాధ్యాయ ఓటర్లే ఆలోచించాలి' అని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే.. చట్టసభల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకనవుతానని చెప్పారు. ఈనెల 13న నిర్వహించనున్న ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జీఓ నంబర్ 317 ద్వారా నష్టపోయిన బాధితులను తిరిగి వారి సొంత జిల్లాలకు రప్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టం చేశారు. మిగిలిన వివరాలు ఆయన మాటల్లోనే..

SAKSHI INTERVIEW సాక్షి

#### రైతు కుటుంబంలో పుట్టా..

మాది రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి. సామాన్య రైతు కుటుంబంలో జన్మించా. ఒకటి నుంచి ఐదు వరకు మొండిగౌరెల్లి ప్రభుత్వ పాఠశాలలో, 10 తరగతి వరకు చింతపట్లలో, మలక్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివా. న్యూసైన్స్ కాలేజీలో డిగ్రీ చదివి, ఉస్మానియా విశ్వవిద్యాయంలో పీజీ పూర్తి చేశా. వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి బీఈడీ పట్టా పొందా. 1983 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆదిబట్ల సమీపంలోని బొంగుళూరులో తొలిసారి విధుల్లో చేరా. ఆ తర్వాత నందివనపర్తి, చీర్యాల, ఇంజాపూర్, బాలాపూర్, శేరిగూడ, కర్మన్‌ఘట్, హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల్లో పనిచేసి, 2018లో ఉద్యోగ విరమణ పొందా.

#### పీఆర్‌టీయూ కార్యకర్తగా

ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన నాటినుంచి పీఆర్టీయూ టీఎస్‌లో క్రియాశీలకంగా పనిచేశా. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ టీచర్స్ జేఏసీ చైర్మన్‌గా, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయలకు సేవలందించా. మహిళా ఉపాధ్యాయులకు అదనంగా ఐదు సీఎల్‌లు, 180 రోజుల ప్రసూతి సెలవులు, 90 రోజుల చైల్డ్‌కేర్ లీవ్స్, అప్రెంటిస్ టీచర్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ పోస్టుల మంజూరు, దేశంలోనే తొలిసారిగా బదిలీల్లో వందశాతం కౌన్సెలింగ్ విధానం, జీఓ నంబర్ 40 ద్వారా హెచ్ఎం, ఎంఈఓలకు అధికారాలు, 2008లో 13 రోజుల సమ్మె, 2011లో 32 రోజుల సకల జనుల సమ్మె కాలానికి పూర్తి వేతనం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించాను.

#### పెన్షన్ స్కీం కోసం ఒత్తిడి తెస్తా

ఉపాధ్యాయుడిగా, సంఘం ప్రతినిధిగా ఏళ్ల పాటు పని చేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. ఎమ్మెల్సీగా గెలిపించి చట్ట సభలకు పంపితే.. అదే స్ఫూర్తితో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. స్కూళ్లలో వసతులు కల్పించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగుల పెన్షన్ స్కీం కోసం పోరాడుతా.



# స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను పెంపొందిస్తాం

**ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్**

రాయదుర్గం: స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో స్కేల్ అఫ్ సమ్మిట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీహబ్ ఈ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకభాగస్వామిగా ఉందన్నారు. స్టార్టప్‌లు పెట్టుబడిదారులు, ఇతర పర్యావరణ వ్యవస్థలతో కనెక్ట్ అవ్వడానికి ఒక అద్భుతమైన వేదికగా టీహబ్ మారిందన్నారు. టీహబ్ ఆధ్వర్యంలో సమ్మిట్ నిర్వహించడం, విజయవంతం కావడం సంతోషానిచ్చిందన్నారు. స్టార్టప్ భవిష్యత్తు కూడా చాలా ఉజ్వలంగా ఉంటుందన్నారు. స్టార్టప్‌లు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే పర్యావరణ వ్యవస్థను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కేల్‌అప్ సమ్మిట్ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. టీహబ్ తన ల్యాబ్ 32 ప్రోగ్రామ్‌లో కోహర్ట్-10 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు.

## వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడ్డ రిత్విక్

రాజేంద్రనగర్: వీధి కుక్కల దాడులు అత్తాపూర్ డివిజన్‌లో స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తేజస్వినగర్‌లో చిన్నారిపై గురువారం దాడి ఘటన మరవక ముందే శుక్రవారం హైదర్‌గూడ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఏడేళ్ల బాలుడిపై దాడి చేశాయి. ఈ సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. హైదర్‌గూడ సుభాష్ చంద్రబోస్ ప్రాంతానికి చెందిన రిత్విక్(7) ఇంటి వద్ద నుంచి రోడ్డు అవతల ఉన్న దుకాణం వద్దకు శుక్రవారం మధ్యాహ్నం వెళ్తున్నాడు. ఇదే సమయంలో రోడ్డుపై ఉన్న రెండు కుక్కలు రిత్విక్ వెంట పడ్డాయి.బాలుడు కిందపడగానే దవడ, పెదవులు, కుడిచేతిపై గాయపరిచాయి. స్థానికులు స్పందించి కుక్కలను తరమడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడ్డ బాలుడికి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలో వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయానికి దాదాపు 25పైగా ఫిర్యాదులు అందాయి.

## పరారైన ఖైదీ పట్టుబడ్డాడు

కుషాయిగూడ: చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రం (ఓపెన్ ఎయిర్ జైల్) నుంచి పారిపోయిన జీవితఖైదీ మాలోతు హుస్సేన్ శుక్రవారం పట్టుబడ్డాడు. ఖైదీ పరారీతో అప్రమత్తమైన జైల్ అధికారులు, పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి 24 గంటలలోపే అరెస్టు చేశారు. జైల్ నుంచి పారిపోయిన హుస్సేన్ చర్లపల్లి నుంచి హయత్‌నగర్ వెళ్లాడని, అక్కడ నుంచి తెలిసన వ్యక్తి ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి డబ్బులు అడినట్లు గుర్తించారు. అప్పటికే జైల్ అధికారులు హుస్సేన్ కుటుంబ సభ్యుల ఫోన్‌లపై నిఘా పెట్టడంతో ఫోన్ చేసిన విషయాన్ని పసిగట్టి ఆ నెంబరు ఆధారంగా హయత్‌నగర్‌లో ఉన్నట్లు గుర్తించి రంగంలోకి దిగిన జైల్ అధికారులు హుస్సేన్ అరెస్టు చేసి కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## నగదుతో పరారైన డ్రైవర్ అరెస్ట్

**రూ. 9.50 లక్షల నగదు స్వాధీనం**

అడ్డగుట్ట: యజమానిని మోసగించి నగదుతో పరారైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత తెలిపిన మేరకు.. పంజగుట్టలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన వంకుడోత్ గణేష్ (36) మియాపూర్‌లోని హేమదుర్గా టవర్స్‌లో నివాసముండే కొంగటి ఫణీంద్ర వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తుకారాంగేట్‌లో ఫణీంద్రకు ధృవ మినరల్స్ అండ్ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. తార్నాకలోని కే అండ్ ఆర్ రైల్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో అసోసియేట్ అయ్యి పనులు చేస్తుంటారు. ఈ నెల 3న కే అండ్ ఆర్ కంపెనీ వారు రూ. 10 లక్షలు ఇస్తారని చెప్పి డ్రైవర్ గణేష్‌ను అక్కడికి పంపించాడు. డబ్బు తీసుకున్నానని యజమాని ఫణీంద్రకు ఫోన్ చేసి చెప్పిన గణేష్ కొద్ది సేపటికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. దీంతో ఫణీంద్ర మరుసటి రోజు లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గణేష్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం అతని ఇంటి వద్దనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతని నుంచి రూ. 9.50 లక్షల నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## 20 వరకు హజ్‌యాత్ర దరఖాస్తుల స్వీకరణ గడువు

సాక్షి, సిటీబ్యూరో: 2023 హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 20 వరకు పెంచినట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10ని ఆఖరు తేదీగా నిర్ణయించామని, అయితే రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 6 వేల వరకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయన్నారు. అంతేకాక సర్వర్ సమస్య కారణంగా దరఖాస్తులు అప్‌లోడ్ కాలేదన్నారు. దీంతో రాష్ట్ర హజ్ కమిటీ కేంద్ర హజ్ కమిటీకి గడువు పెంచాలని ప్రతిపాదనలు పంపగా కేంద్ర హజ్ కమిటీ మరో 10 రోజులు గడువు పెంచినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



కంటి అద్దాలు అందజేస్తున్న సీఎన్ రెడ్డి, వైద్యులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ గ్రంథాలయంలో శుక్రవారం కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువలో కంటి వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే రహమత్‌నగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధ, కంటివైద్య నిపుణులు ఆశ్రిత, స్ఫూర్తి, ఏఎన్‌ఎంలు యోగిత, ప్రియాంక, ప్రభాకర్, ఆశ వర్కర్లు లక్ష్మీదేవి, శ్రీలత, సాలమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

### పాత పుస్తకాలను అందజేయండి

రహమత్‌నగర్: పాత పుస్తకాలు, నోట్ బుక్స్‌ను హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ సంస్థకు అందిస్తే వాటిని రీసైక్లింగ్ ద్వారా కొత్త పుస్తకాలు తయారు చేసి పేద విద్యార్థులకు అందజేస్తారని సెయింట్ సాల్మాన్ హైస్కూల్ చైర్మన్ సుధాకర్ అన్నారు. బ్రహ్మశంకర్‌నగర్‌లో ఆయన శుక్రవారం మాట్లాడుతూ, హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ పేద విద్యార్థుల సహాయార్థం రీసైక్లింగ్ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. పాత పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను సేకరించి రీసైక్లింగ్ ద్వారా కొత్త పుస్తకాలు తయారు చేసి ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులకు అందజేస్తారన్నారు. అన్ని పాఠశాలల యజమాన్యాలు తమ విద్యార్థుల నుంచి పాత పుస్తకాలను సేకరించి ఫౌండేషన్ ప్రతినిధులకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఆర్‌పీఐ (ఏ) ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

లిబర్టీ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ (ఆర్‌పీఐ-ఏ) తెలంగాణ రాష్ట్ర శాఖ ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా బైగల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు దీపక్, జాతీయ ప్రధాన కార్యదర్శి మోహన్‌లాల్ పాటిల్‌లు ఆయనను నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ-ఏ) ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రె రవీందర్ మాట్లాడుతూ , క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలమైన శక్తిగా ఆవిష్కరిస్తామన్నారు. సమావేశంలో దయానంద్, అనంత్ తదితరులున్నారు.

### విద్యార్థుల తల్లులకు సత్కారం



విద్యార్థుల తల్లులను సత్కరిస్తున్న రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: కుటుంబ పోషణ కోసం ఓ వైపు పనులు చేసుకుంటూనే, మరో వైపు తమ పిల్లలను పాఠశాలకు పంపించడంలో అంకిత భావం కనబరిచిన తల్లులను, ఉపాధ్యాయులను రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఘనంగా సత్కరించింది. రాజ్‌భవన్ హైస్కూల్‌లో శుక్రవారం ఈ సంస్థ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వినూత్నంగా నిర్వహించింది. వంద శాతం హాజరుతో విద్యార్థులు చదువుల పట్ల కనబరుస్తున్న శ్రద్ధను గుర్తించిన ఈ సంస్థ తమ పిల్లలను రోజూ బడికి పంపడంలో దృష్టిపెట్టిన తల్లులను మరింత ప్రోత్సహించేందుకు ఘనంగా సత్కరించింది. వీరు మిగతా తల్లులకు స్ఫూర్తిగా నిలుస్తారని వారు వెల్లడించారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని డిజిటల్ సాధికారత అన్న థీమ్‌తో ముందుకు తీసుకెళ్లామని సంస్థ సభ్యులు లక్ష్మణ్, రాధిక, మమత వెల్లడించారు. చక్కని బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల ఉపాధ్యాయులను కూడా సత్కరించారు. స్కూల్ ఇన్‌చార్జి గోపాల్ పాల్గొన్నారు.

### హెచ్‌సీయూలో ముగిసిన రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జే రాణి రత్న ప్రభ రచించిన 'భారత దేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు , సవాళ్లు' అనే పుస్తకాన్ని నోయిడా వివిగిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ అమిత్‌నిర్మల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. హెచ్‌సీయూ ప్రోవీసీ ఆర్‌ఎస్ సర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనుసంధానం అంతంత మాత్రమే!

- తెల్లరేషన్ కార్డుదారులకు 'ఆయుష్మాన్ భారత్'తో ఎంతో మేలు
- రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు
- నత్తనడకన సాగుతున్న రేషన్‌కార్డు అనుసంధానం ప్రక్రియ
- ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తి





'ఆయుష్మాన్ భారత్'లో తెల్లరేషన్ కార్డుదారులను అనుసంధానిస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

బంజారాహిల్స్: సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కూడా ఖరీదైన కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి తెల్లరేషన్ కార్డు అనుసంధాన ప్రక్రియ ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్- 07లో అంతంత మాత్రంగానే సాగుతోంది. తెల్లరేషన్ కార్డుదారులకు ఈ పథకంపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

- తెల్లరేషన్ కార్డుదారులు గతంలో ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. 2 లక్షల వరకు వైద్య చికిత్సలు ఉచితంగా పొందడానికి అర్హత ఉండేది. నాలుగేళ్ల క్రితం ఆరోగ్యశ్రీలో కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్‌ను విలీనం చేశారు. దీంతో అదనంగా మరో రూ. 3 లక్షలు... మొత్తం రూ.5 లక్షల వరకు కార్పొరేట్ వైద్య సేవలు పొందేందుకు అవకాశం కల్పించారు.
- ఇందుకోసం తెల్లరేషన్ కార్డు ఉన్న తమ రేషన కార్డును ఆయుష్మాన్ భారత్ పథకానికి అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ పథకంపై బస్తీవాసువాసుల్లో... ముఖ్యంగా తెల్లరేషన్ కార్డుదారుల్లో అవగాహన కరువు కావడంతో అనుసంధాన ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగుతోంది.
- ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్- 07 పరిధిలో మొత్తం 83,127 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. గత ఐదు నెలలుగా రేషన్ కార్డు అనుసంధాన ప్రక్రియ ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇప్పటి వరకు ఈ సర్కిల్‌లో 50 శాతం కార్డుదారులు మాత్రమే ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదయ్యారు.
- పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ పథకంపై ప్రచారం కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే చెప్పాలి. స్థానిక పట్టణ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో తెల్లరేషన్ కార్డుదారులను ఈ పథకంలో అనుసంధానం చేసేందుకు ఏఎన్‌ఎంలకు పూర్తి అధికారాలు కల్పించారు. పథకంలో చేరాలంటే లాగిన్ సౌకర్యాన్ని కూడా ఏఎన్‌ఎంలకు అందజేశారు. కార్డుదారులు నేరుగా వెళ్లి సంబంధిత సిబ్బందిని కలిస్తే వారే వీరి పేర్లను అనుసంధానిస్తారు. అయితే, ఈ విషయంలో చాలా మంది తెల్లరేషన్ కార్డుదారులకు అవగాహన కరువైంది.
- మరోవైపు 2019 కంటే ముందు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్న వారికి మాత్రమే ఈ పథకంలో చేరేందుకు ఆన్‌లైన్ అనుమతిస్తున్నదని, ఆ తర్వాత తెల్లరేషన్ కార్డులు పొందిన వారికి అవకాశం లేకుండా పోతున్నదని బంజారాహిల్స్ రోడ్ నెం 7లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ వెల్లడించారు.
- తమ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 50 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన యాప్‌లో తమ ఆస్పత్రిలో పని చేస్తున్న నలుగురు ఏఎన్‌ఎంలు ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు.

### 1886 రకాల వైద్య సేవలు

- ఆయుష్మాన్ భారత్ కార్డు ఉన్న వారు దేశంలో ఎక్కడైనా వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. చిన్న చిన్న వ్యాధుల నుంచి గుండె, మోకాలి చిప్పల మార్పిడి వంటి 1886 రకాల వ్యాధులకు వైద్య సేవలు పొందవచ్చు. ఈ ప్రక్రియ మొత్తం ఉచితంగా స్థానికంగా ఉండే ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్ర సిబ్బంది, స్థానికంగా ఉండే పీహెచ్‌సీలలో నిర్వహిస్తారు. రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్ చెబితే చాలు ఈ-కేవైసీ పూర్తి చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా విస్తృత ప్రచారాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉంది. రూ. 5 లక్షల వరకు కార్పొరేట్ వైద్య సేవలు అందించే ఈ పథకం వల్ల పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది.

### అడ్డొచ్చిన కంటి వెలుగు

- ఆయుష్మాన్ భారత్ పథకంలో తెల్లరేషన్ కార్డుదారులను ఆరోగ్య కేంద్రాల ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అనుసంధానిస్తున్న క్రమంలోనే కంటి వెలుగు శిబిరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో యూపీహెచ్‌సీల సిబ్బంది మొత్తం కంటి వెలుగు శిబిరాలకు పరిమితమయ్యారు.అయినప్పటికీ ఆరోగ్య కేంద్రాలకు నేరుగా వచ్చే వారిని ఈ పథకంలో నమోదు చేస్తున్నామని వైద్యాధికారులు చెప్తున్నారు.

## పట్టాలు ఇప్పించండి

**ఎమ్మెల్యే నాగేందర్‌కు అంబేడ్కర్ నగర్ బస్తీవాసుల వినతి**

బంజారాహిల్స్: షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ రోడ్ నం.46 అంబేడ్కర్ నగర్ బస్తీలోని తమ ఇళ్లను జీఓ 58 కింద క్రమబద్ధీకరణ చేయించి పట్టాలు ఇప్పించాలని అంబేడ్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, బస్తీవాసులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు విజ్ఞప్తి చేశారు. బస్తీలో 150 కుటుంబాలు 30 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ నివసిస్తున్నాయని, ఇందులో వంద మందికి జీఓ 58 కింద, మరో 50 మందికి డబుల్ బెడ్‌రూమ్ కింద వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు ఇప్పించాలని కోరారు. తాము ఇళ్లు కట్టుకుంటుంటే ఇటీవల జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 అధికారులు వచ్చి పనులు నిలిపివేయాలని హెచ్చరించారని గుర్తు చేశారు. తాము ఇటీవల రోడ్లు కూడా వేసుకున్నామని, డ్రైనేజీ లైన్లు కూడా తీస్తుండగా పనులు ఆపివేయాలంటూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులను నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము ఇళ్లను నిర్మించుకునే విధంగా అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే దానంను అంబేడ్కర్ నగర్ బస్తీవాసులు కోరారు.

## రేపు క్యాట్ 2023 టాలెంట్ సెర్చ్ పరీక్ష

బంజారాహిల్స్: క్యాట్ 2023-24 పరీక్ష రాయబోయే విద్యార్థుల కోసం టైమ్ ఇనిస్టిట్యూట్ ఈ నెల 12న స్కాలర్‌షిప్ టెస్ట్, టైమ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించనుంది. రెండుస్లాట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని టైమ్ ఇనిస్టిట్యూట్ తెలిపింది. పరీక్ష వ్యవధి ఒక గంట అని, ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఎక్కడి నుంచైనా ఈ పరీక్ష రాయవచ్చన్నారు.

## పేదలకు జీఓ 58,59 కింద ఉచితంగా క్రమబద్ధీకరణ

- నియోజకవర్గంలో 1400 మందికి లబ్ధి
- ఎమ్మెల్యే దానం నాగేందర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలాల్లో చాలా సంవత్సరాలుగా నివాసముంటున్న పేదలకు మరోసారి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఈ సారి జీఓ 58,59 కింద ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, విధి విధానాలు త్వరలోనే విడుదల అవుతాయన్నారు. ఫిలింనగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జీఓ 58,59 వల్ల నగరంలో ఉంటున్న అనేక మంది పేదలకు భరోసా ఏర్పడుతుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 1400 మంది లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. జీఓ 58,59ను 2014లోనే అమలు చేసినప్పటికీ అనేక సమస్యల వల్ల చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని గుర్తు చేశారు. ఇక ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆహ్వానించతగ్గ విషయమన్నారు. బీజేఆర్‌నగర్, మారుతీనగర్, ఎంఎస్ మక్తా, దేవరకొండ బస్తీ, శ్రీరాంనగర్, ఫిలింనగర్ 18 బస్తీలు, హిమాయత్‌నగర్ డివిజనలోని ఆదర్శ్ బస్తీ, గాంధీకుటీర్ ..ఇలా అనేక బస్తీల్లో పేదలు గుడిసెలు, రేకుల ఇళ్లలో నివాసముంటున్నారన్నారు. మొదటి దశలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో 3000 మంది గృహలక్ష్మి పథకం కింది లబ్ధిపొందనున్నారన్నారు. డివిజనకు 500 మంది చొప్పున అవకాశం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. విధి విధానాలు ఖరారు కాగానే పేదలందరికీ ఈ పథకం వర్తించేందుకు కృషి చేస్తామన్నారు. రెండో దశ ప్రతి నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులకు దళిత బంధు ఇచ్చేందుకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. కాశీ, శబరిమలకు వెళ్లే భక్తులకు విడిది ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం హిందువులకు ఆనందం కలిగించే విషయమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మన్నె కవితా రెడ్డి, వనం సంగీతాయాదవ్, వెల్దండ వెంకటేష్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఒమెగా 11 కేవీ ఫీడర్, ఏసీబీ 11 కేవీ ఫీడర్ కమాండ్ కంట్రోల్ సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలోఫర్ సీనీ ఫర్ హౌస్ ఎదురు ఏరియా, ఒమెగా, జనారెడ్డి, కేబీఆర్ పార్కు ఏరియాలు, చర్చి గల్లీ, గోల్డెన్ టెంపుల్, ఎన్‌బీటీ నగర్, గద్వాల్ విజయలక్ష్మి ఇంటి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 14న కవి సమ్మేళనం

లిబర్టీ: మహనీయుల పోరాట యోధులు త్యాగం వల్ల దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 75 ఏళ్ల స్వాతంత్ర్యం, ఆత్మబలిదానం చేసిన మహనీయులను స్మరించుకోవడానికి ఆదిలీలా ఫౌండేషన్ లావణ్య ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఢిల్లీలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆటలతో ఆరోగ్యం, ఆనందం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: ఆటలతో ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఆటపోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం ఆయన బహుమతులు అందజేశారు. ఆటల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ మహిళా విభాగాల అధ్యక్షుడు సర్దార్, ధర్మ, బాబానాయక్, సైట్- 3 అధ్యక్షుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విద్యకు మార్గదర్శి సావిత్రీబాయి

హిమాయత్‌నగర్: భారత దేశంలోని మహిళల విద్యకు, సాధికారతకు సావిత్రీబాయి పూలే మార్గదర్శకురాలని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉస్తెల సృజన, నేదునూరి జ్యోతి అన్నారు. సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ.డబ్ల్యూ వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, సహాయ కార్యదర్శి ముదుపు నలిని రెడ్డి, ఉపాధ్యక్షురాలు లతా దేవి, నేతలు లక్ష్మి, పూర్ణిమ, విజయలక్ష్మి పండిట్, మల్లేశ్వరి, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు సాధ్యం



స్పోర్ట్స్ డేను ప్రారంభిస్తున్న పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్

పంజగుట్ట: పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎర్రమంజిల్ కాలనీలోని రబీంద్ర నికేతన్ పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షా కాలమని, పరీక్షలంటే భయపడకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చని అన్నారు. ఫోన్లు, టీవీలు చూడకుండా కష్టపడి చదవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ కరుణ మాట్లాడుతూ, అణగారిన వర్గాల పిల్లలకు విద్యనందించాలనే ఉద్దేశంతో ఫౌండర్ రేణుకా ముఖర్జీ ఈ పాఠశాలను స్థాపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు బాగా చదువుతున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పంజగుట్ట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, పాఠశాల అధ్యక్షురాలు మీనాక్షి భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

## రేడియంట్ హైస్కూల్‌కు ఐఎస్‌ఓ గుర్తింపు




ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌ను అందుకుంటున్న ప్రిన్సిపాల్

శ్రీనగర్‌కాలనీ: ఎలారెడ్డిగూడకు చెందిన రేడియంట్ హైస్కూల్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్‌టైజేషన్ (ఐఎస్‌ఓ) గుర్తింపు లభించింది. ఈ మేరకు స్కూల్ ప్రిన్సిపాల్ అహ్మద్ షరీఫ్ శుక్రవారం ఐఎస్‌ఓ ప్రతినిధి నుంచి సర్టిఫికేషన్ అందుకున్నారు. విద్యా బోధనలో తాము ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నామని, తమ స్కూల్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ రావడంతో తమ బాధ్యత మరింత పెరిగిందని ప్రిన్సిపాల్ అన్నారు.

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బంజారాహిల్స్: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానా, వెంకటేశ్వర నగర్ బస్తీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సర్కిల్-18 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ ఈ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రతి మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్య ఉన్నా దగ్గరిలోని ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరాల్లో కార్మికులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్మించి, అవసరమైన మందులను అందించారు.



పారిశుద్ధ్య కార్మికురాలికి వైద్యసేవలందిస్తున్న వైద్యులు

## మద్యం మత్తులో గుండెపోటుతో వ్యక్తి మృతి



మల్లె రామారావు (ఫైల్)

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తికి గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కార్మికనగర్‌లో నివసించే మల్లె రామారావు(35) సెంట్రింగ్ వర్కర్. భార్య, పిల్లలు ఈ నెల 7న పెద్దపల్లిలో ప్రార్థనకు వెళ్లగా రామారావు ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. గురువారం రాత్రి జవహర్‌నగర్‌లోని సతీష్ వైన్స్ వద్ద మద్యం తాగేందుకు వెళ్లాడు. అక్కడే నలుగురు స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో ఆస్పత్రికి చేర్చగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అయితే స్నేహితులతో జరిగిన గొడవలో మద్యం మత్తులో ఇద్దరు స్నేహితులు పిడిగుద్దులు గుద్దడం వల్లే రామారావు మృతి చెందినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఇక్కడి సీసీ పుటేజీలను పరిశీలించగా, ముగ్గురు యువకులు గొడవ పడుతున్నట్టు నిర్ధారణ అయింది. అయితే, ఆ గొడవకు రామారావు చాలా దూరంలో ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు రామారావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఒంటిపైన ఎలాంటి గాయాలు లేవని కార్డియక్ అరెస్ట్ వల్లే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మద్యం మత్తులో గుండె పోటు రాగా వెనక్కి కుప్పకూలాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యూబీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: సోమాజిగూడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) వేదికగా ఎంపవర్ హిమ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పంజగుట్ట రీజినల్ హెడ్ కె.దుండేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ ఆధ్వర్యంలో అత్యున్నత సేవలు అందించడంతో పాటు మహిళా దినోత్సవం సందర్భంగా పింక్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిబిరంలో 80 మందికి పైగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోగా, 15 మంది ఖాతాదారులు పింక్ పాలసీని తీసుకున్నారు. కార్యక్రమంలో సోమాజిగూడ ఏజీఎం జె.జుమ్మీలాల్, మల్లికార్జున్ రెడ్డి, పియూష్, సూరజ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కళలను భవిష్యత్ తరాలకు అందించాలి

హిమాయత్‌నగర్: ప్రాచీన సంప్రదాయ కళలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్లో చేతి నీడ తోలు బొమ్మల ప్రదర్శన కార్యక్రమం హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగింది. భట్టు రమేష్ మాట్లాడుతూ..ప్రాచీన తోలు బొమ్మలతో కథల రూపంలో బోధించడంతో పాటు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. 200 ఏళ్ల వైభవం కలిగిన కొయ్య బొమ్మ లాట ఉనికిని చూ పించిన జనగామ జిల్లాకు చెందిన మోతె జగన్నాథంను సత్కరించారు. ప్రముఖ డచ్ పప్పెట్రీ కళాకారుడు, హక్కే మార్స్ పప్పెట్రీ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు మంగళా భట్, రాఘవరాజ్ భట్, జేబీఆర్‌ఎసీ ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రతినిధి భాస్కర్ రావు, స్కూల్ వైస్ చైర్మన్ ప్రార్థన, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, స్ఫూర్తి థియేటర్ ఫౌండర్ డైరెక్టర్ పద్మిని, హెచ్‌ఎం రామాంజుల, ఫమీదా షామీన్ పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాల ఆకస్మిక తనిఖీ



ఎన్బీటీ నగర్ కంటి వెలుగు శిబిరంలో వివరాలు సేకరిస్తున్న డాక్టర్ విజయ్‌పాల్

బంజారాహిల్స్: కంటి వెలుగు శిబిరాల్లో అందుతున్న సేవలపై క్వాలిటీ కంట్రోల్ ఉన్నతాధికారి డాక్టర్ విజయ్ పాల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానాలోని శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. శిబిరంలో అందిస్తున్న కళ్లజోళ్లను పరిశీలించారు. సిబ్బంది పనితీరుతో పాటు హాజరును పరిశీలించారు. 15 రోజుల క్రితం ఫిలినగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఓ వైద్యాధికారి పనితీరు సరిగ్గా లేకపోవడంతో ఆయనను వేరే కేంద్రానికి బదిలీ చేశామన్నారు. కంటి వెలుగు శిబిరాల్లోని సిబ్బంది లేదా అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు.

## ఒక్కసారి ముందుకు అడుగేస్తే వెనక్కి చూడొద్దు..



మాట్లాడుతున్న జ్యోతిరెడ్డి

వెంగళరావునగర్: ఏ రంగంలో విజయం సాధించాలన్నా గట్టి నమ్మకంతో ముందుకు అడుగువేయాలని, ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయొద్దని యూఎస్‌లోని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ జ్యోతిరెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలో గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం (నిమ్స్ మే) శిక్షణ సంస్థ ఆడిటోరియంలో శుక్రవారం ఉమెన్స్ మారథాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతిరెడ్డి మాట్లాడుతూ, మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. లక్ష్యసాధన కోసం మనం వెళ్లే మార్గంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటంకాలు ఎదురవుతాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వాటిని చూసి భయపడి నిలిచిపోతే మళ్లీ వెనక్కి వెళ్లాల్సి వస్తుందని, అందువల్ల విజయం సాధించే వరకు అలుపెరుగని పట్టుదలతో ముందు సాగాలన్నారు. కార్యక్రమంలో వీఐఎం డైరెక్టర్ డాక్టర్ సామిని సుంకర, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ విజయ, ఫ్యాకల్టీలు స్వప్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు..

## సోమవారం వరకు అరెస్టు సహా.. ఏ చర్యలూ వద్దన్న తెలంగాణ హైకోర్టు

### సీబీఐకి మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అన్ని విచారణ ఫైళ్లను, రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని సీబీఐ దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. విచారణ వివరాలను పెన్‌డ్రైవ్ లేదా హార్డ్ డిస్క్‌లో పూర్తిగా సీల్డ్ కవర్‌లో సోమవారం కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. వివేకా హత్య జరిగిన చోట లభించిన లేఖ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికను కూడా సమర్పించాలని సూచించింది. అప్పటి వరకు అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించింది. పిటిషనర్ (కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి) 14న ఉదయం 11 గంటలకు సీబీఐ ముందు హాజరు కావాలని సూచించింది. ఆయన వెంట న్యాయవాది వెళ్లొచ్చని చెప్పింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై స్టే విధించాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా.. అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున అనిల్ కొంపెల్లి వాదనలు వినిపించారు.

**పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..**

'వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ 160 కింద జనవరి 24న హాజరు కావాలని ఒకరోజు ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 24న ఎంపీ విచారణకు హాజరయ్యారు. తన విచారణ వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని, విచారణ సమయంలో తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ జనవరి 27న దర్యాప్తు అధికారులకు అవినాశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీన్ని దర్యాప్తు అధికారి అనుమతించలేదు. మళ్లీ ఫిబ్రవరి 24న హాజరు కావాలంటూ ఫిబ్రవరి 16న నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 22న కూడా అవినాశ్‌రెడ్డి వీడియో, ఆడియో రికార్డింగ్‌పై విన్నవించారు. అప్పుడు కూడా అనుమతించలేదు. మరోసారి మార్చి 10న విచారణకు రావాలని మార్చి 5న సీఆర్‌పీసీ 160 కింద మరో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ పారదర్శకంగా సాగడం లేదని, నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు' అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

**విచారణ పేరుతో వేధిస్తున్నారు..**

'వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు పిటిషనర్ విచారణ ముగియగానే, మీడియా ఇష్టం



వచ్చినట్లు కథనాలు రాస్తూ, ఆయన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. వాస్తవాలను పట్టించుకోవడం లేదు. అందువల్లే వీడియో, ఆడియో రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులను ఎంపీ కోరారు. అయినా దర్యాప్తు అధికారి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. విచారణ సమయంలో పిటిషనర్ చెబుతున్న అంశాలను టైపిస్ట్ టైప్ చేస్తుండగా, దర్యాప్తు అధికారి కంప్యూటర్ మౌస్‌ను పలుమార్లు తన చేతుల్లోకి తీసుకుని కొన్ని లైన్లు తీసివేయాలంటూ టైపిస్ట్‌కు సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ దర్యాప్తు అధికారికి, టైపిస్ట్‌కు మాత్రమే కనిపించేలా ఉండటంతో ఏం డెలీట్ చేస్తున్నారో పిటిషనర్ చూడలేకపోయారు. అవినాశ్‌ను విచారణ చేసే సమయంలో నలుగురైదుగురు అధికారులు ఉన్నారు. విచారణ ముగిశాక దీనికి సంబంధించిన ఓ ప్రతిని ఇవ్వమని కోరినా, దర్యాప్తు అధికారి నిరాకరించారు. నిబంధనలు అంగీకరించవని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్ వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలివ్వాలి. ఎఫ్ఐఆర్ సహా ఎక్కడా అవినాశ్ పేరు లేదు. అయినా పలుమార్లు విచారణ పేరుతో వేధిస్తున్నారు. దర్యాప్తు అధికారి.. ముందే ఓ ఊహాజనిత స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని, ఆ మేరకు కావాల్సిన విధంగా సాక్షులను సిద్ధం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డితోపాటు భాస్కర్‌రెడ్డిని కూడా దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. దస్తగిరిని వారికి అనుకూలంగా మలచుకుని, ఆ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు' అని వాదనలు వినిపించారు.

**వీడియో రికార్డింగ్‌తోనే విచారణ**

వీడియో, ఆడియో రికార్డింగ్‌పై దర్యాప్తు అధికారి వివరణ తీసుకుని కోర్టుకు తెలియజేయాలని న్యాయమూర్తి.. సీబీఐ న్యాయవాదిని ఆదేశించారు.

### వివేకా లేఖను తొక్కిపెట్టారు..

'వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను దర్యాప్తు అధికారులు తొక్కిపెడుతున్నారు. వైఎస్ వివేకా అల్లుడే ఆయన్ను హత్య చేశాడని నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే ఈ కేసు అంశాలను మాత్రం సీబీఐ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదు. సీఆర్‌పీసీలో పేర్కొన్న నిబంధనల మేరకు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వీడియో, ఆడియో రికార్డు చేసేలా, న్యాయవాదిని విచారణ సమయంలో అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని పిటిషనర్ న్యాయవాది నివేదించారు.

భోజన విరామం అనంతరం వాదనలు పునఃప్రారంభం కాగా, వీడియో, ఆడియో రికార్డింగ్‌లతోనే పిటిషనర్ విచారణ సాగుతోందని సీబీఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు. వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను ఫోరెన్సిక్‌కు పంపినట్లు చెప్పారు. లేఖ విషయాన్ని 2021 జనవరి 31 నాటి అనుబంధ చార్జీషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అవినాశ్‌రెడ్డి.. సాక్షినా? లేక నిందితుడా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అవినాశ్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు ఇచ్చామని.. అవసరమైతే ఆయన్ను, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని సీబీఐ న్యాయవాది చెప్పారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన సీబీఐ ఎస్పీ.. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్‌డిస్క్, కేసు ఫైళ్లను ఇప్పుడే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. పిటిషన్‌లో తన పేరు ప్రస్తావించినందున తన వాదనలు కూడా వినాలని కోరారు.

### దస్తగిరి ఎందుకు రాలేదు?

వైఎస్ వివేకా హత్య కేసులో ఏ–4గా ఉన్న దస్తగిరి విచారణకు ఎందుకు రాలేదని సీబీఐని ప్రత్యేక న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితులంతా హాజరు కావాలని చెప్పాం కదా.. అని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు అందరూ రావాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కూడా హాజరయ్యారు. సీబీఐ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో కొన్ని పేజీలు లేవని, దీంతో దాన్ని తిరిగి పంపించామని న్యాయమూర్తి వెల్లడించారు.

కేసు విచారణను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు. అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఎంపీ అవినాశ్‌రెడ్డి వెంట వచ్చిన 15 మంది మద్దతుదారులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య

- సీబీఐ విచారణ అనంతరం ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి
- హత్యా స్థలి నుంచి లెటర్‌ను మాయం చేశారు
- గుండెపోటని నేను చెప్పలేదు..
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డిది మర్డర్ ఫర్ గెయిన్ (ఆస్తి, సొమ్ము కోసం జరిగిన హత్య) అని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తప్పుదోవలో వెళ్తోందని తాను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానని, అది గూగుల్ టేకౌట్ కాదు టీడీపీ టేకౌట్ అని అన్నారు. తప్పుడు సాక్ష్యాలతో అన్యాయంగా అమాయకులను ఇరికించేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో చాలా కీలక అంశాలను పక్కన పెట్టి, సిల్లీ అంశాలను తెరపైకి తెచ్చి తనకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. సీబీఐ విచారణకు మూడోసారి శుక్రవారం హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**వివేకాకు రెండో పెళ్లి.. వారికి ఓ కుమారుడు..**

- వివేకం సార్‌కు 2006 నుంచి ఒక యువతితో సంబంధం ఉంది. 2011లో ఆమెను పెళ్లి చేసుకున్నారు. దానికి ఇస్లాం లా ప్రకారం తన పేరు షేక్ మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారు. పెళ్లి తర్వాత వారికి షేక్ షెహన్‌షా అనే అబ్బాయి కూడా పుట్టాడు. ఆ అబ్బాయినే వారసుడిగా ప్రకటించాలనే తపన, ఆలోచన ఆయనలో ఉండింది.
- హత్య జరగడానికి ముందు ఇల్లంతా డాక్యుమెంట్ల కోసం వెతికారని అప్రూవర్ స్టేట్‌మెంట్‌లోనే ఉంది. హత్య తర్వాత కూడా డాక్యుమెంట్లు వెరిఫై చేసుకుని వెళ్లారని చెప్పారు. నా అనుమానం ఏమిటంటే.. నోటరైజ్డ్ విల్లు అది. ఆమె (వివేకా రెండో భార్య) పేరుతోనో, వారి అబ్బాయి పేరుతోనో ఆస్తిని ఇవ్వాలనుకోవడం.. దీన్ని అడ్డుకోవాలనుకోవడం.. ఇందులో ఆసక్తి ఎవరికి ఉందో తెలియాలి.
- నా అనుమానం ప్రకారం ఇది మర్డర్ ఫర్ గెయిన్. అందులో భాగంగానే వాళ్లు వివేకానందరెడ్డి గారిని ఇలా చేశారు. రాబోయే రోజుల్లోనూ న్యాయ పోరాటం చేస్తా.

**ఆ లేఖ ఎందుకు దాచారు?**

- నేను గాలి మాటలు మాట్లాడట్లేదు. సొంత కవిత్వాలు చెప్పట్లేదు. రికార్డుల్లో ఉన్నవి, వాటి ద్వారా తెలిసినవే మాట్లాడుతున్నా. నేను వెళ్లే లోపలే సీన్ ఆఫ్ క్రైమ్‌లో ఉన్న లేఖను సునీతమ్మ భర్త రాజశేఖర్ దాచి పెట్టారు. పీఏ కృష్ణారెడ్డికి ఆ లెటర్ విషయం కానీ, అందులో ఉన్న అంశాలు కానీ ఎవరికీ చెప్పొద్దని చెప్పారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌ను దాచిపెట్టడం తప్పు కాదా?
- నన్ను వెళ్లమని చెప్తేనే అక్కడకు వెళ్లాను. లెటర్ ఉన్న విషయం నాకు కూడా చెప్పలేదు. ఆ లెటర్ చాలా కీలక ఆధారం. సరైన సమయానికి దాని విషయం బయటకు చెప్పకపోవడం ఈ కేసులో పెద్ద తప్పు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి

- నేను ఏ ఒక్కరికీ గుండెపోటని (వివేకా మరణానికి కారణం) చెప్పలేదు. కావాలంటే ఆ రోజు మార్చురీ దగ్గర, మార్చ్ 17న మాట్లాడిన మాటలు చూడండి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నేను అలా చెప్పినట్లు చిత్రీకరించింది.
- నేను చూసి బయటకు వచ్చి పోలీసులు, కుటుంబీకులు, దగ్గర బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పా. ఇవన్నీ చేయకుంటే తప్పంటారనుకున్నా. చేస్తే తప్పంటారని ఊహించలేదు.

**ముమ్మాటికీ అది కట్టుకథే**

- అప్రూవర్ థీయరీనే ఓ కట్టుకథ. ప్రారంభంలోనే గొడవ ప్రస్తావన. రూ.8 కోట్ల డబ్బు రావాల్సి ఉందో, వచ్చిందో వాటి గురించి గొడవ మొదలైందని చెప్తారు. ఆ షేర్ల పంపకం మీద వివేకం సారేమో మొత్తం నాకే కావాలని అన్నట్లు, వీళ్లేమో నువ్వు సగం తీసుకో, నేను సగం తీసుకుంటా అన్నట్లు గొడవ మొదలై ఉండొచ్చంటారు.
- ఇదే సీబీఐ విచారణలో ఆ బెంగళూరు సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఎనిమిది మంది సాక్షులు (ఎల్‌డబ్ల్యూ 10 నుంచి మొదలై) చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది.. ఒక్క రూపాయి డబ్బు కూడా వచ్చే అవకాశం లేదు.. ఆ డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ అని చెప్తారు. అంటే రాని, వచ్చే అవకాశమే లేని డబ్బు కోసం ఎవరైనా గొడవ పెట్టుకుని కొట్టి చంపుకుంటారా? ఇది కట్టు కథ అనడానికి ఇది చాలదా?

**ఇది కుమ్మక్కు కాదా?**

- సుప్రీంకోర్టులో మా సోదరి (సునీత) వైల్డ్ అలిగేషన్స్‌తో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను సమర్థిస్తూ సీబీఐ వాళ్లు కౌంటర్ అఫిడవిట్ వేస్తారు.

**అందుకే నోరు విప్పాల్సి వస్తోంది..**

- కేవలం కుట్రలకు ఉపయోగపడే వాంగ్మూలాలు తప్ప నిజాలను వెల్లడించే వాంగ్మూలాలు తీసుకోవట్లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను సరిగ్గా మద్దతు ఇవ్వలేదని ప్రచారం చేశారు. అభియోగాలు మోపారు. దాదాపు 800 పైచిలుకు ఎమ్మెల్సీ ఓటర్లు.. ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు. వారిని పిలిచి అడగండి. అదీ చేయరు. అప్రూవర్ థియరీ.. కట్టుకథను అడ్డం పెట్టుకుని విచారణను ఓ వ్యక్తి టార్గెట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు.
- దీన్ని ఎవరూ హర్షించరు. దీంతో గళమెత్తడం మొదలుపెట్టాం. ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు వచ్చినా, మీడియా ఎన్ని విమర్శలు చేసినా, మా సోదరి సునీతమ్మ సుప్రీంకోర్టులో, ఆంధ్ర హైకోర్టులో నాపై ఎన్ని ఆరోపణలు చేసినా మౌనంగానే ఉన్నా. ఎందుకంటే వివేకం సార్ చనిపోయారు.. ఈమె ఆయన కూతురు అని.. విచారణ జరుగుతున్నప్పుడు విచారణ సంస్థపై నమ్మకం ఉండాలని మౌనంగా ఉన్నాను. అయితే విచారణ తప్పుడుదోవలో వెళ్తోందని స్పష్టం కావడంతో నోరు విప్పుతున్నాను. నేను ఎటువంటి తప్పు చేయలేదని ప్రతి ఒక్కరికీ గట్టిగా చెబుతున్నా.

గురువారం లంచ్ మోషన్ మూవ్ చేస్తూ రెస్పాండెంట్స్‌గా సీబీఐ డైరెక్టర్, దర్యాప్తు అధికారిని పెట్టాం. మధ్యాహ్నం 2 గంటల కల్లా సీబీఐ వారి కంటే ముందు మా సోదరి తరపు అడ్వకేట్లు వచ్చారు. అంటే వారికి ఎవరు సమాచారం ఇచ్చారు?

- సీబీఐ వాళ్లకు నోటీసు వచ్చిన వెంటనే చిటికలో సమాచారం ఇస్తున్నారు. ఆ రోజు సుప్రీంకోర్టులో కుమ్మక్కై పిటిషనర్‌కు అనుకూలంగా కౌంటర్ వేసి కోర్టులను తప్పుదోవ పట్టించారు. లంచ్ మోషన్‌లోనూ ఆమెకు సమాచారం ఇచ్చి ఇంప్లీడ్ చేయిస్తున్నారు. ఇది కుమ్మక్కు కాదా? దీని వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయి. ఈ రాజకీయ కుట్రలను తప్పకుండా ఛేదిస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. కంచే చేను మేస్తే.. సీబీఐ ఈ రకంగా కుమ్మక్కై విచారణ చేస్తే మాకు ఎవరు దిక్కు?.

### తప్పుదోవలో విచారణ

- ఉదయం 10.40–10.45 గంటల మధ్య ఇక్కడికి వచ్చాను. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారించారు. ఆ తర్వాత కోర్టు నుంచి పిలుపు వచ్చిందని దర్యాప్తు అధికారి వెళ్లారు. అయినప్పటికీ 3.30 గంటల వరకు అక్కడే కూర్చోమన్నారు. ఆపై సీబీఐ వాళ్లు వచ్చి మీరు వెళ్లండి.. మళ్లీ మేము పిలిచినప్పుడు రండని చెప్పారు.
- విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలని దర్యాప్తు అధికారిని మొదటి నుంచీ అడుగుతూనే ఉన్నాం. రెండోసారి ఇదే అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌నే అడిగాం. ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మూడోసారి హైకోర్టును ఆశ్రయించాం. విచారణ తప్పుదోవలో వెళ్తుండటంతో ఇలా చేయక తప్పలేదు.
- ఎంపీ టిక్కెట్టే ఈ హత్యకు కారణం అంటే మా జిల్లా వాళ్లు నవ్వుతారు. వివేకం సర్ చనిపోయే రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలంలో దాదాపు 300 ఇళ్లు డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డికి.. ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌కు ఓటెయ్యండని ప్రచారం చేశారు. కావాలంటే ఆ ఇళ్లకు వెళ్లి అడగచ్చు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అడగచ్చు.. వాంగ్మూలం తీసుకోవచ్చు. కానీ వీళ్లు (సీబీఐ) అలా అడగరు. వాంగ్మూలం తీసుకోరు.

---

**నగర వార్తలు**

### మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధానికి మేయర్ లేఖ

సాక్షి, సిటీబ్యూరో: మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. కేంద్రంలో సంపూర్ణ మెజార్టీ ఉన్న తమ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అది పెద్ద కష్టమేమీ కాదని ఆమె పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి భారత జాగృతి అధ్యక్షురాలు కవిత ఢిల్లీలో చేపట్టిన దీక్ష విజయవంతమైందని పేర్కొంటూ మహిళా రిజర్వేషన్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో చట్ట ప్రకారం 33 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించాల్సిన నిబంధన ఉండగా, దాన్ని దాటి 50 శాతం పదవులు దక్కేలా తమ ప్రభు త్వం రిజర్వేషన్లు తప్పనిసరి చేసిందన్నారు. రాష్ట్రంలోని 13 మేయర్ స్థానా ల్లో 8 స్థానాలు మహిళలకే కట్టబెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఆమె లేఖలో పేర్కొన్నారు.

### బిజినెస్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి



కాచిగూడ: బిజినెస్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. నారాయణగూడలోని రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌పై(ఎన్‌బీఏ) నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎంబీఏ పూర్తి చేసిన వారికి విభిన్న రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, సాంకేతిక రంగంలో పోటీ పడుతూ అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యత లక్ష్యాన్ని చేరుకోవడానికి సంస్థల అక్రిడిటేషన్ ఆవశ్యకతను తెలియజేశారు. ఎన్‌బీఏ సన్నద్ధతపై చర్చలు ప్రారంభించినందుకు కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అక్రిడిటేషన్‌తో సంస్థలు ఫ్యాకల్టీ సెంట్రిక్ నుంచి స్టూడెంట్ సెంట్రిక్ ఓరియెంటేషన్‌కు మారతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎస్.వి.రమణారావు, హెచ్ఎంవీఎస్ కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి.సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి, ఎంబీఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ రేణుకాసాగర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కవిత పాల్గొన్నారు.

# 'గ్లకోమా'తో జీవితం అంధకారం

- అంధత్వ నివారణపై విస్తృత అవగాహన
- 12 నుంచి 18 వరకు 'ప్రపంచ గ్లకోమా వారం'
- వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు
- 15న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆరు భాషల్లో ఇంటరాక్టివ్ లైవ్ సెషన్

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి కాలంలో ప్రజలను వెంటాడుతున్న ఆరోగ్య సమస్యల్లో గ్లకోమా ఒకటి. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్న ఈ వ్యాధి లక్షల మంది శాశ్వత అంధులుగా మారడానికి కారణమవుతోంది. తిరిగి పునరుద్ధరించలేని విధంగా కంటి చూపు కోల్పోయేలా నరాలను తీవ్రంగా దెబ్బతీయడం దీని సహజ లక్షణం. 2040 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా గ్లకోమాతో బాధపడే రోగుల సంఖ్య 76 మిలియన్ల నుంచి 111.8 మిలియన్లకు పెరుగుతుందని నిపుణుల అంచనా. ఈ రోగుల్లో అత్యధికంగా ఆఫ్రికా, ఆసియాకు చెందినవారే. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం పిల్లలతో సహా 1.12 కోట్ల మంది భారతీయులు (భారతదేశ జనాభాలో 4.5%) గ్లకోమాతో బాధపడుతున్నారు. ఇందులో 11 లక్షల మంది గ్లకోమా కారణంగా శాశ్వతంగా అంధులయ్యారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ గ్లకోమా అసోసియేషన్, ప్రపంచ గ్లకోమా రోగుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో 'ప్రపంచ గ్లకోమా వారం' నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మార్చి 12 నుంచి 18 వరకు ప్రపంచ గ్లకోమా వారంగా ప్రకటించారు. గ్లకోమా వారంలో వ్యాధిపై అవగాహన పెంచేందుకు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్‌వీపీఈఐ) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న తెలుగుతో పాటు బెంగాలీ, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, ఒడియా భాషల్లో ఎల్‌వీపీఈఐ యూట్యూబ్ చానెల్‌లో లైవ్ పేషెంట్ ఇంటరాక్టివ్ సెషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సెషన్‌లో ఎవరైనా గ్లకోమా, ఇతర కంటి సమస్యల గురించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. 12వ తేదీన అవేర్‌నెస్ వాక్ సైతం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

### వైద్యుల సలహా మేరకే మందులు వాడాలి..



డాక్టర్ సిద్ధార్థ్

ప్రపంచ గ్లకోమా వారానికి సంబంధించిన విషయాల గురించి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గ్లకోమా కన్సల్టెంట్ డాక్టర్ సిద్ధార్థ్ దీక్షిత్ మాట్లాడుతూ.. 90 శాతం చూపు కోల్పోయే వరకు గ్లకోమా లక్షణాలు కనిపించవన్నారు. ఈ వ్యాధితో చూపు కోల్పోతే తిరిగి పునరుద్ధరించలేమని, సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే చికిత్సతో మిగిలిన చూపును సంరక్షించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కళ్లద్దాల కోసం చేసే ప్రాథమిక కంటి పరీక్షతో ఈ వ్యాధిని గుర్తుపట్టలేమని, ఐ ప్రెషర్ టెస్ట్, డెలైటెడ్ ఫండస్ టెస్ట్, గోనియోస్కోపీ ద్వారా ఈ వ్యాధిని గుర్తిస్తారని ఆయన చెప్పారు. అవగాహన లోపంతో 7 మిలియన్ల మంది గ్లకోమా బారిన పడి అంధులుగా మారగా, అందులో 2/3వ వంతు మహిళలే ఉన్నారన్నారు. కంటి మందు చుక్కలు, ఇన్హేలర్లు, ఆయింట్మెంట్లు లేదా మాత్రల వంటి స్టెరాయిడ్లను డాక్టర్ల సలహా మేరకే వినియోగించాలని, లేనిపక్షంలో గ్లకోమా బారిన పడే ప్రమాదం ఉందని సిద్ధార్థ్ దీక్షిత్ పేర్కొన్నారు. సాధారణంగా 40 ఏళ్ల వయసు పైబడిన వారిలో ముఖ్యంగా మయోపియా, మధుమేహం ఉన్న వారికి గ్లకోమా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు.

# మాజీ భార్య వేధిస్తుందంటూ..

### సెల్ఫీ వీడియో తీసి వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: విడాకులు తీసుకున్నప్పటికీ తన భార్య వేధిస్తుందంటూ ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకున్న అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అత్తాపూర్ నౌనెంబర్ ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ కుమారుడు సయ్యద్ అష్రఫ్(26)కు నాలుగు సంవత్సరాల క్రితం సానా అనే యువతితో వివాహమైంది. పెళ్లయిన తర్వాత అష్రఫ్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు చికిత్స అందించి మందులు ఇస్తుండడంతో వాడుతున్నాడు. అయితే అష్రఫ్ భార్య సానా రెండు సంవత్సరాల క్రితమే అతడికి విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. విడాకుల అనంతరం అష్రఫ్ మరింత మానసికంగా కుంగిపోయాడు. గురువారం రాత్రి నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో తండ్రి ఇస్మాయిల్ నచ్చజెప్పి పడుకోబెట్టాడు. అనంతరం అష్రఫ్ ఇంటి ముందున్న షెడ్‌లోకి వెళ్లి తన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తాను మంచివాడినని, తనకేమి మెంటల్ లేదని, తన భార్య వేధిస్తుందని అందులో చెప్పాడు. ఇందుకు సంబంధించిన ఫోన్ రికార్డింగ్‌లు, వీడియోలు సైతం ఉన్నాయని చెప్పాడు. పోలీసులు చట్టరీత్యా ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్తూ తన ఫోన్ లాక్ నెంబర్‌ను తెలిపి వీడియో ముగించాడు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు గమనించి అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అష్రఫ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

అల్వాల్: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నో మతపరమైన సున్నిత ప్రదేశాలు ఉన్నాయన్నారు. వివిధ పండుగల రోజున, మతపరమైన ఊరేగింపుల సమయంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనే కార్యక్రమాలు, బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రదేశాలలో బాంబు తనిఖీ బృందాలు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాలలో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, మల్కాజిగిరి డీసీపీ ధరావత్ జానకి, యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్ర, రోడ్ సేఫ్టీ అధికారి బాల, డీసీపీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళల అభ్యున్నతికి కృషి



సీబీఐటీలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న సునీతాలక్ష్మారెడ్డి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

మణికొండ: మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించేందుకు మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వి.సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సాధించిన ప్రగతిని చాటిచెప్పేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. తల్లి, చెల్లి, భార్య వంటి బంధాలతో ముడిపడి ఉన్న జీవితంలోనూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమాజంలో మహిళలపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. చదువుల్లో, వృత్తిలో రాణించేందుకు మాత్రమే స్నేహం పరిమితం కావాలని, వ్యక్తి గతంగా దగ్గరయ్యే ప్రయత్నం చేస్తే సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉందన్నారు. మనకు అవసరమైన మేరకు మాత్రమే సాంకేతికతను వినియోగించుకోవాలని, దీనిని అతిక్రమిస్తే అనర్థాలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలని లేదా 181 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వారు 1930 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి ఆమెను సత్కరించారు.

## బీసీ రిజర్వేషన్లు లేని మహిళా బిల్లు ఎందుకు..?

- జాజుల శ్రీనివాస్‌గౌడ్



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, మణిమంజరి తదితరులు

కవాడిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, బీసీ రిజర్వేషన్లు లేని బిల్లు ఎందుకని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు బి.మణిమంజరి ఆధ్వర్యంలో శుక్రవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత బిల్లుతో అణగారిన వర్గాల మహిళలకు ఒరిగేదేమీ లేదన్నారు. మహిళా బిల్లుకు బీసీలు వ్యతిరేకం కాదని, బీసీల ప్రాతినిధ్యం లేని బిల్లుకు మాత్రమే వ్యతిరేకమన్నారు. బీసీల జనగణన, ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్ల సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి ఢిల్లీ పెద్దల మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, విద్యా సంఘం కేంద్ర అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మహిళా దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని పేట్లబుర్జులో ఉన్న సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఉమెన్స్ డే వేడుకలకు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ విభాగంలో పనిచేస్తున్న దాదాపు 500 మంది సిబ్బంది, అధికారిణులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, సంయుక్త సీపీ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా అధికారిని సన్మానిస్తున్న సీపీ సీవీ ఆనంద్

క్లుప్తంగా...

## పరిస్థితులకు అనుకూలంగా జాతీయ విద్యావిధానం

- షరతులతో విదేశీ వర్సిటీలకు అనుమతులు
- యూజీసీ చైర్మన్ ప్రొ. జగదీశ్ కుమార్



భవనాన్ని ప్రారంభించిన యూజీసీ చైర్మన్ ప్రొ. జగదీశ్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాతీయ విద్యావిధానాన్ని రూపొందించినట్లు యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చైర్మన్ ప్రొ.జగదీశ్‌కుమార్ అన్నారు. మాజీ వీసీ ప్రొ.రాంచంద్రం హయాంలో వర్సిటీ క్యాంపస్‌లో నిర్మించిన యూజీసీ హెచ్‌ఆర్‌సీ (అకాడమిక్ స్టాఫ్ కాలేజీ) భవనాన్ని శుక్రవారం ఆయన ఓయూ అధికారులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు, మీడియా సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడారు. దేశంలోకి విదేశీ యూనివర్సిటీలు అనివార్యమని, వాటికి షరతులతో కూడిన అనుమతులే ఉంటాయని, వాటిల్లో పేద విద్యార్థులు కూడా చదివేవిధంగా విధివిధానాలను రూపొందిస్తామన్నారు. జాతీయస్థాయిలో డిజిటల్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి అందరికీ ఒకే విధమైన ఉన్నతవిద్య అందించనున్నట్లు వివరించారు. డీమ్డ్, ప్రవేటు విశ్వవిద్యాలయాలతో ఎలాంటి ముప్పులేదని, మనదేశంలో కొనసాగుతున్న సంప్రదాయ యూనివర్సిటీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అధ్యాపక ఉద్యోగాలకు పీహెచ్‌డీ అర్హత తప్పనిసరికాదని, యూజీసీ నెట్‌తో ఉద్యోగాన్ని పొందవచ్చని అన్నారు. మాతృభాషలో బోధన జరిగే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక స్థితిగతులపై అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. అనంతరం అధ్యాపకులు అడిగిన వివిధ ప్రశ్నలను నివృతి చేశారు. ఓయూలో చేపడుతున్న సంస్కరణలను ఓయూ వీసీ ప్రొ.రవీందర్ వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతోపాటు వివిధ విభాగాలకు చెందిన ఓయూ అధికారులు పాల్గొన్నారు.

## కొత్తగా 38 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 4,972 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 38 మంది వైరస్ బారినపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది.



బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం కేసీఆర్

## 'ఇద్దరు పిల్లల' నిబంధన తొలగించాలి

### మంత్రి ఎర్రబెల్లికి ప్రజాప్రతినిధుల వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి కూడా పోటీ చేసే అర్హత కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు చట్ట సవరణ జరిగేలా చూడాలని శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రిని కలసిన వారిలో స్థానిక సంస్థల ఎన్నికల చట్టం 1995 రద్దు ఉద్యమ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ తదితరులు ఉన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న హెచ్‌సీఏఏ కార్యవర్గం. చిత్రంలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, ఏజీ బీఎస్ ప్రసాద్ తదితరులు

## రైలు పట్టాల్లా బార్ అండ్ బెంచ్ ఉండాలి

### సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రైలు పట్టాల మాదిరిగా బార్ అండ్ బెంచ్ ఉండాలని, ఎక్కడా కలవకూడదని, న్యాయం కోసం సమాంతరంగా పనిచేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ అన్నారు. నాణేనికి రెండువైపులా బొమ్మా, బొరుసూ ఉంటేనే విలువ ఉంటుందని, బార్ అండ్ బెంచ్ కూడా అలాంటివేనని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి హైదరాబాద్ వచ్చిన జస్టిస్ సంజయ్‌కుమార్‌ను తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ శుక్రవారం సన్మానించింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు. జస్టిస్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కోర్టులో అడుగు పెట్టగానే పాతరోజులు గుర్తుకు వచ్చాయన్నారు. దాదాపు 20 ఏళ్లు న్యాయవాదిగా, 11 ఏళ్లు న్యాయమూర్తిగా పనిచేశానని, అందులో దాదాపు 28 ఏళ్లు తెలంగాణ హైకోర్టుతో అనుబంధం ఉందన్నారు. ఇక్కడ పనిచేసిన పెద్దలు ఎందరో తనకు మార్గదర్శకులుగా ఉన్నారని, తాను ఈ స్థానానికి ఎదగడంలో వారి పాత్ర కూడా ఉందన్నారు. కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రఘునాథ్, ఉపాధ్యక్షుడు పాశం కృష్ణారెడ్డి, కార్యదర్శులు గాడిపల్లి మల్లారెడ్డి, జల్లి నరేందర్, స్పోర్ట్స్ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

# జెనెటిక్.. హార్ట్‌ఎటాక్.. బ్రెయిన్‌స్ట్రోక్



## గుండె, మెదడు జబ్బులకు కుటుంబ చరిత్రకు లింకు

- తల్లి గర్భంలోనే శిశువులపై ప్రభావం
- జీవనశైలిలో మార్పులూ ఓ కారణం
- కోవిడ్‌తో మరింత ప్రమాదకరంగా మారిన వైనం

గాంధీ ఆస్పత్రి: వ్యాయామం చేస్తూ కొందరు హఠాత్తుగా కుప్పకూలి మృతిచెందుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఎటువంటి లక్షణాలు కనిపించనప్పటికీ తీవ్రమైన గుండెపోట్లతో వారు మరణిస్తున్నట్లు వైద్యులు ధ్రువీకరిస్తున్నారు. ఇంకొందరు బ్రెయిన్‌స్ట్రోక్‌తో కుప్పకూలుతున్నారని అంటున్నారు. కుటుంబంలో ఎవరైనా ఇలా మరణిస్తే మిగిలిన వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి వ్యాధులు, రుగ్మతలు జన్యుపరంగా రక్త సంబంధీకులకు వస్తున్నట్లు గతంలోనే నిర్ధారణైందని చెబుతున్నారు. గుండెపోటుతో కుప్పకూలి మరణిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ ఎందుకు వస్తున్నాయి?, నివారణ, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోవిడ్ పాత్ర తదితర అంశాలపై గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు 'సాక్షి'కి చెప్పి వివరాలు ఆయన మాటల్లోనే...



ప్రొఫెసర్ రాజారావు

- గుండె, మెదడు జబ్బులు వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశం ఎక్కువ. కాబట్టి రక్తసంబంధీకులంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, స్థూలకాయం, మాదకద్రవ్యాల సేవనం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, శారీరకశ్రమ లేకపోవడం గుండె, మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.
- కోవిడ్ బారినపడిన వారిలో రక్తం చిక్కబడే అవకాశం ఉంది, పోస్టు కోవిడ్ లక్షణాల్లో ఇది ప్రధానమైనది. రక్తం చిక్కబడి రక్తనాళాల్లో ప్రసరణ సరిగా జరగకపోవడంతో హార్ట్‌ఎటాక్, బ్రెయిన్‌స్ట్రోక్‌కు ఆస్కారం ఏర్పడుతుంది.
- తల్లి గర్భంలో పిండం పెరిగి శిశువుగా రూపాంతరం చెందుతున్నప్పుడే కొన్నిరకాల రుగ్మతలకు గురవుతారు. డయాబెటిస్ వంటివి ఇటువంటివే. తల్లి ఆరోగ్యంగా లేనప్పుడు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నప్పుడు వాటి ప్రభావం శిశువులపై పడుతుంది.
- చిన్నారులు, యువతలో శారీరక శ్రమ లేకపోవడం ఇటువంటి రుగ్మతలకు మరో కారణం.

### ఇలా చేస్తే పదిలం..

- వంశపారంపర్యంగా గుండె, మెదడు సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నవారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.
- జీవనశైలి, ఆహార అలవాట్లు మార్చుకోవాలి. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి. మాదకద్రవ్యాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. పండ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.
- గుండెపోటుకు గురైన వారిని వెంటనే కాపాడేందుకు వీలుగా అన్ని వర్గాల ప్రజలకు అత్యవసర ప్రాథమిక చికిత్స అయిన సీపీఆర్‌పై అవగాహన కల్పించి శిక్షణనివ్వాలి.
- యోగా, ధ్యానం చేసేందుకు వీలుగా కార్పొరేట్ సంస్థలు ఉద్యోగులకు తప్పనిసరిగా 45 నిమిషాల సమయం కేటాయించాలనే నిబంధన విధించాలి.

## సింగపూర్ రూటులో 'స్కిల్' లూటీ!

- షెల్ కంపెనీలతో టీడీపీ పెద్దల స్కామ్
- సూత్రధారుల అరెస్టులకు ఈడీ రెడీ

సాక్షి, అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) నిధులను టీడీపీ పెద్దలు షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టినట్లు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో నిగ్గు తేల్చింది. టీడీపీ హయాంలో 'ముఖ్య'నేత నలుగురు వ్యక్తుల ద్వారా నల్లధనాన్ని విదేశాలకు తరలించినట్లు సాక్ష్యాధారాలతో గుర్తించింది. కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి కాజేసిన రూ.370 కోట్లను షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు అక్రమంగా తరలించి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు తేల్చింది. ఈ కుంభకోణంలో ప్రధాన భాగస్వామిగా ఉన్న సౌమ్యాద్రి శేఖర్‌బోస్ అలియాస్ సుమన్ బోస్ (సీమెన్స్ ఇండియా మాజీ ఎండీ)తోపాటు వికాస్ ఖన్విల్కర్ (డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ), ముకుల్ చంద్ర అగర్వాల్(పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ సీఈవో), సురేశ్ గోయల్(చార్టెడ్ అకౌంటెంట్)లను ఈ నెల 4న అరెస్టు చేసి విశాఖలోని పీఎంఎల్‌ఏ న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. నలుగురు నిందితులు విచారణకు ఏమాత్రం సహకరించనందున క్షుణ్ణంగా ప్రశ్నించేందుకు కస్టడీకి అప్పగించాలని ఈడీ అధికారులు శుక్రవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

**నల్లధనం సింగపూర్‌కు చేర్చింది ఆ నలుగురే...**

టీడీపీ అధికారంలో ఉండగా 'ముఖ్య'నేత నలుగురి ద్వారా నల్లధనాన్ని విదేశాలకు తరలించారని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. సీమెన్స్ కంపెనీ ఇండియా హెడ్‌గా వ్యవహరించిన సుమన్ బోస్ ఈ కుంభకోణంలో చంద్రబాబుకు కుడిభుజంగా వ్యవహరించారు. టీడీపీ పెద్దలు కాగితాలపై సృష్టించిన రూ.3,300 కోట్ల ప్రాజెక్టుపై సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా చెప్పుకుంటూ సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలు పెట్టుబడి పెట్టాల్సిన 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద రూ.370 కోట్లను డిజైన్‌టెక్ కంపెనీకి టీడీపీ సర్కారు చెల్లించింది. ఏపీఎస్ఎస్‌డీసీలో కీలక స్థానాల్లో ఉన్న చంద్రబాబు సన్నిహితులు కె.లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావు, అపర్ణ చటోపాధ్యాయ అందుకు సహకరించారు. వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్ సహకారంతో సుమన్ బోస్ రూ.241 కోట్లను సింగపూర్‌లోని ఓ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. రూ.241 కోట్లు హవాలా మార్గంలో టీడీపీ పెద్దల ఖాతాలకు చేరినట్లు ప్రాథమికంగా గుర్తించింది.

## మహిళల పురోగతికి కొత్త మార్గాలు అన్వేషించాలి

### స్వయం సహాయ మహిళలకు పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సూచన

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. శుక్రవారం ఇక్కడ ఓ హోటల్‌లో సెర్ప్ అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో సుల్తానియా మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలు మరింత పురోగతి సాధించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) కొత్త కొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. సెర్ప్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వారి సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఔత్సాహిక మహిళలను ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళాసాధికారతకు దోహదపడాలని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో వచ్చిన మార్పుపై క్షేత్రస్థాయిలో సెర్ప్ ఉద్యోగులు తరచూ అధ్యయనం చేయాలన్నారు. పలువురు మహిళా అధికారులు మాట్లాడుతూ మహిళలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, రాజకీయంగానూ మరింత సాధికారత సాధించాలన్నారు. సెర్ప్ డైరెక్టర్లు సువిధ, పద్మ, వైఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాక్షి రియల్టీ

# వావ్.. వీకెండ్ హోమ్స్



మెట్రో నగరాలలో వీకెండ్ అంటే సంథింగ్ స్పెషల్. నిద్ర లేచే సమయం నుంచి తినే తిండి, తిరిగే ప్రాంతం వరకూ.. ప్రతీది డిఫరెంట్‌గా ఉండాలనుకుంటారు. కరోనా తర్వాతి నుంచి ఈ అభిరుచికి పర్యావరణం కూడా తోడైంది. దీంతో వారంలో కనీసం రెండు రోజులైనా పచ్చని ప్రకృతిలో సేదతీరాలని భావిస్తున్నారు. చుట్టూ చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, రణగొణ ధ్వనులు, కాలుష్యం లేని ప్రాంతం.. ఇంటికి తిరిగొస్తూ వారానికి సరిపడా కూరగాయలు, పండ్లు వెంట తెచ్చుకునే వీలూ ఉండాలని భావిస్తున్నారు. ఈక్రమంలోనే వీకెండ్ హోమ్స్ ఆదరణ పెరిగింది.

- కరోనా తర్వాతి నుంచి పెరిగిన డిమాండ్
- సాధ్యమైనంత స్థలం గ్రీనరీకే కేటాయింపు
- మౌలిక వసతులు ఉండే ప్రాంతాలలో కొనుగోళ్లకు ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: కడ్తాల్, తలకొండపల్లి, షాద్‌నగర్, శంకర్‌పల్లి వంటి ప్రాంతాలలో వీకెండ్ హోమ్స్‌కు డిమాండ్ ఉంది. చార్టెడ్ అకౌంటెంట్లు, వైద్యులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీకెండ్ హోమ్స్ అంటే ఎకరాల కొద్దీ స్థలం అవసరం లేదు. కొద్ది స్థలంలోనే ప్రణాళికబద్ధంగా వినియోగిస్తే.. అందమైన వీకెండ్ హోమ్స్‌ను డిజైన్ చేయవచ్చు. ఈ నిర్మాణంలో వినియోగించే ప్రతి వస్తువూ పర్యావరణహితమైనవే ఉంటాయి. ఉష్ణోగ్రతను నిరోధించేలా మట్టి ఇటుకలు, కలపతో నిర్మాణం ఉంటుంది. వర్షపు నీటి సేకరణతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ సహజ వనరులకు ఏమాత్రం విఘాతం కలిగించకుండా ఉంటుంది.

**ఎక్కడ చూసినా గ్రీనరీనే..**

వీకెండ్ హోమ్స్ ప్రాజెక్ట్‌లలో సాధ్యమైనంత స్థలాన్ని గ్రీనరీకే కేటాయిస్తారు. ఉదాహరణకు.. కడ్తాల్‌లోని డ్రీమ్‌స్కేప్ ఎకో వీకెండ్ హోమ్స్ ప్రాజెక్ట్‌లో 300 గజాల ప్లాట్‌లో కేవలం 60 గజాలలో మాత్రమే నిర్మాణం ఉంటుంది. 620 చ.అ.లలో రెండు బెడ్ స్పేస్‌లు, ఓపెన్ టెర్రస్, ప్యాంట్రీ కిచెన్, బాత్‌రూమ్ ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో పార్క్‌లను అరణ్యాని జోన్ పేరుతో వినూత్న తరహాలో చేపట్టారు. రావి, మర్రి, వేప వంటి అడవి జాతికి చెందిన చెట్లను పెంచుతారు. వీటితో ఆక్సిజన్ ఎక్కువ మొత్తంలో విడుదల అవుతుంది. జామ, మామిడి, దానిమ్మ, సీతాఫలం, అంజీర్ వంటి 12 రకాల పండ్ల మొక్కలు, పూలు, కూరగాయల తోట ఉంటుంది. పంచ తులసి వంటి ఆయుర్వేద మొక్కలుంటాయి. 10 ఏళ్ల పాటు ఆయా మొక్కల నిర్వహణ కంపెనీయే చూసుకుంటుంది. కొనుగోలుదారులు ఏ సీజన్‌లో వెళ్లినా ఆ సీజన్‌లో దొరికే పండ్లు లభిస్తాయి.

**వద్దనుకుంటే అద్దెకు కూడా..**

ఒకవేళ వీకెండ్ హోమ్స్‌ను కస్టమర్లు వినియోగించలేని పక్షంలో కంపెనీయే అద్దెకు తీసుకుంటుందని డ్రీమ్‌స్కేప్, ఫౌండర్ అండ్ చైర్మన్ ఎస్. నాగరాజు తెలిపారు. వాటిని డెస్టినేషన్ వెడింగ్స్ కోసం వినియోగించి.. వచ్చే లాభాలలో కస్టమర్లకు వాటా ఇస్తామన్నారు. వాటి నిర్వహణ బాధ్యత కంపెనీదే. ఒకవేళ కొనుగోలుదారులు ఇంటిని నిర్మించుకునేందుకు వీలుగా మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాలు వంటి అన్ని రకాల మౌలిక వసతులను కల్పించామని చెప్పారు.

## ఓసీ వచ్చాక ఫర్ సేల్ ఉందా?

సాక్షి, హైదరాబాద్: నిర్మాణ అనుమతులు రాకముందే ప్రీలాంచ్‌లో విక్రయాలు చేయడం లీగల్ సమస్యలు తలెత్తి, అనుమతులు రాక చేతులెత్తేస్తే మధ్యతరగతి కొనుగోలుదారుల పరిస్థితేంటని డెవలపర్లు ఒక్కసారి పునరాలోచించుకోవాలి. కొనుగోలు చేసే ముందు కస్టమర్లు కూడా ప్రాజెక్ట్ పూర్వాపరాలను పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. బిల్డర్ చరిత్ర, ఆర్థిక స్తోమత, ప్రమోటర్లు ఎవరనేది తెలుసుకోవాలి. పాత ప్రాజెక్ట్స్‌లో అన్ని ఫ్లాట్లు అమ్ముడుపోయాయా? లేక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చాక కూడా ఫర్ సేల్ బోర్డ్ ఉందా గమనించాలి. సొంత డబ్బుతో ప్రాజెక్ట్‌ను ఎవరూ పూర్తి చేయలేరు. ఆర్థిక స్తోమత ఉన్న వాళ్లకే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

## 3 శాతం తగ్గిన రిజిస్ట్రేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్లలో స్వల్ప క్షీణత నమోదయింది. గత నెలలో గ్రేటర్‌లో రూ.2,816 కోట్లు విలువ చేసే 5,274 అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే రిజిస్ట్రేషన్లలో 3 శాతం, ప్రాపర్టీల విలువలో 1 శాతం క్షీణత కనిపించింది. 2023 రెండో నెలలో రూ.2,837 కోట్లు విలువ చేసే 5,420 ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి.



- గత నెలలో రిజిస్ట్రేషన్ జరిగిన ప్రాపర్టీలలో 51 శాతం గృహాలు రూ.25–50 లక్షలు మధ్య ధర ఉన్నవే కాగా.. 32 శాతం ఇళ్లు రూ.50 లక్షలకు పైగా ధర ఉన్నవే కావటం గమనార్హం. 68 శాతం ఇళ్లు 1,000 నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం ఉన్నవేనని నివేదిక పేర్కొంది.

## క్లుప్తంగా...

### కోమటిరెడ్డి చంపుతామన్నారు

**హెచ్ఆర్సీకి చెరుకు సుధాకర్ కుమారుడు సుహాస్ ఫిర్యాదు**

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ కుమారుడు డాక్టర్ సుహాస్.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)కి ఫిర్యాదు చేశారు. తనను, తన తండ్రి సుధాకర్‌ను చంపుతానని వెంకట్‌రెడ్డి బెదిరిస్తున్నారని, ఆయన నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం నల్లగొండకు చెందిన పి.సైదులు, మరికొందరితో కలసి సుహాస్ హెచ్ఆర్సీకి ఫిర్యాదును అందజేశారు. ఈనెల 5వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో కోమటిరెడ్డి తనకు ఫోన్ చేసి తన తండ్రిని చంపేందుకు 10 కార్లలో మనుషులు తిరుగుతున్నారని, తన ఆసుపత్రిని కూడా వారు కూల్చేస్తారని బెదిరించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియో క్లిప్పింగ్‌ను కూడా మానవ హక్కుల సంఘానికి అందజేశారు. ఈ విషయంలో తన ఫిర్యాదుపై ఐపీసీ సెక్షన్ 506 కింద నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినా దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని వెల్లడించారు. తన రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి పోలీసు దర్యాప్తు ముందుకు సాగనివ్వకుండా, నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని డాక్టర్ సుహాస్ ఆరోపించారు. వెంకట్‌రెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో సుహాస్ మానవ హక్కుల కమిషన్‌ను కోరారు. ఫిర్యాదును హక్కుల సంఘానికి అందజేసిన అనంతరం డాక్టర్ సుహాస్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదని, అందుకే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

### పార్టీ ఆదేశిస్తే కామారెడ్డి నుంచి పోటీ



లింగంపేట: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నీతి, నిజాయితీతో పని చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ రెండూ.. అవినీతికి పాల్పడుతూ ప్రజలను నిలువునా ముంచుతున్నాయన్నారు. దేశ ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

### 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ'కి 137 పోలింగ్ కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు 137 పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 126 మెయిన్ పోలింగ్ కేంద్రాలు కాగా, మిగతావి అదనపు కేంద్రాలని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 15, నాగర్‌కర్నూలులో 14, వనపర్తిలో 7, జోగులాంబ గద్వాలలో 11, నారాయణపేటలో 5, రంగారెడ్డిలో 31, వికారాబాద్‌లో 18, మేడ్చల్‌లో 14, హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

### ఎమ్మెల్సీ ఎన్నిక రోజు స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

సాక్షి, హైదరాబాద్: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే రోజున ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజాభాను చంద్రప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, విద్యాశాఖ కార్యదర్శికి మెయిల్ పంపారు. ఉపాధ్యాయులంతా ఓటు హక్కును వినియోగించుకుంటారని, దీంతో స్కూళ్లలో విద్యార్థుల నియంత్రణ సాధ్యం కాదని ఆయన తన మెయిల్‌లో పేర్కొన్నారు.

### బీసీలకు 11 ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ఘనత జగన్‌దే



సత్తుపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా, బీసీల దామాషా కంటే ఎక్కువగా 11 ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగిన జిల్లా బీసీ గర్జన మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను ఏపీ వాసిని కాకపోయినా బీసీలకందిస్తున్న సేవలను గుర్తించి ఏపీ సీఎం తనకు రాజ్యసభ సీటు ఇచ్చారని చెప్పారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, అగ్రవర్ణాల పాలనను అంతమొందించేందుకు బీసీలంతా కొట్లాడాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు యర్రా సత్యం, నారాయణవరపు శ్రీనివాస్, లాల్ కృష్ణ, మోదేపల్లి కృష్ణమాచారి సభలో పాల్గొన్నారు.

# ముందస్తు మాటే లేదు!

## రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి: సీఎం కేసీఆర్



బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ, తలసాని, హరీశ్‌రావు, మహమూద్‌అలీ, తోట చంద్రశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్‌రెడ్డి

### దళితబంధు, గృహలక్ష్మిలో చేతివాటాన్ని సహించబోం

అణగారిన దళిత వర్గాలను ఉన్నత స్థితికి తెచ్చేందుకు పెట్టిన పథకం దళితబంధు. ఒక దళిత కుటుంబం బాగుపడటానికి రూ.10 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది. కానీ దళితబంధు లబ్ధిదారుల నుంచి కొందరు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు లంచాలు తీసుకుంటున్నట్టు నా దృష్టికి వచ్చింది. వరంగల్‌లో ఓ ఎమ్మెల్యే, ఆదిలాబాద్‌లో మరో ఎమ్మెల్యే డబ్బులు తీసుకున్న వ్యవహారంపై నా దగ్గర సమాచారం ఉంది. ప్రభుత్వం, పార్టీ తరఫున సాయం అందించాలే తప్ప.. లబ్ధిదారుల నుంచి లంచాలు తీసుకోవడమేంటి? దళితబంధు, గృహలక్ష్మి వంటి పథకాల్లో అక్రమాలకు పాల్పడితే సహించే ప్రసక్తి లేదు.

– సీఎం కేసీఆర్ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు వస్తాయని జరుగుతున్న ప్రచారానికి బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెరదించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని, షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు నియోజకవర్గాల్లో ప్రజల మధ్యే ఉండాలని.. పనులన్నీ పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గంతోపాటు కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు నివాళి అర్పించిన తర్వాత సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ కక్ష సాధింపు, సిట్టింగ్‌లకు సీట్లు, దళితబంధులో చేతివాటం, సంక్షేమ పథకాల అమలు, వాటి ప్రచారం తదితర అంశాలపై ప్రసంగించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేస్తోంది. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గాల్లో జరిగిన పనులను జనానికి చెప్పాలి. ఎమ్మెల్యేలు వీలైనంత వరకు ప్రజల్లోనే ఉండాలి. అందుకోసం పాదయాత్రలు చేయాలి. వేరే పార్టీలు చేస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిని జనం ముందు పెట్టాలి. సెప్టెంబర్ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చు. సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇస్తాం. ఎమ్మెల్యేలు ప్రజలతో, కార్యకర్తలతో మమేకమై పనిచేయాలి.

**కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు**

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం. వారితో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి. ఇందుకు ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. ప్రతి పది గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకొని ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించాలి. వీటికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లను, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు తదితర పార్టీ ముఖ్యులను కలుపుకొని పోవాలి. ఆత్మీయ సమ్మేళనాలను 2 నెలల్లోపు పూర్తి చేయాలి.

**బీఆర్ఎస్వీని బలోపేతం చేయాలి**

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ)ను మరింత బలోపేతం చేయాలి. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి చర్యలు చేపట్టాలి. ఇంకా మిగిలిన పార్టీ జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలను పూర్తి చేయాలి.

**ఏప్రిల్‌లో ప్రతినిధుల సభ.. అక్టోబర్‌లో ఆవిర్భావ సభ**

పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో.. ఏప్రిల్ 25న గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలి. తర్వాత నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజాప్రతినిధుల సభ నిర్వహించాలి. ఏప్రిల్ 27న ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సభ నిర్వహిస్తాం. సభలో పార్టీకి సంబంధించిన అన్ని కేటగిరీల ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభను అక్టోబర్‌లో వరంగల్‌లో నిర్వహిస్తాం.

**తలసరి ఆదాయంలో దేశంలోనే ముందు..**

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పోరాడి సాధించుకున్న తెలంగాణలో తలెత్తి నిలబడ్డాం. తలసరి ఆదాయంలో దేశంలోనే ముందు వరుసలో తెలంగాణ దూసుకుపోతోంది. రాష్ట్రం సాధించిన పురోగతిని చూసిన ప్రజలు తర్వాత జరిగిన ప్రతీ ఎన్నికలో మనకు అండగా నిలబడ్డారు. విద్యుత్ కోతలు లేకుండా చేసుకున్నాం. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దుకున్నాం. ఇవాళ ప్రతీ ఇంటికి నల్లాల ద్వారా తాగునీరు అందుతున్నది. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ స్థాయికి చేరాం. విదేశాల నుంచి రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. మన పారిశ్రామిక విధానాలను ప్రపంచం మెచ్చుకుంటోంది. మొన్న రాష్ట్రానికి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ ఫాక్స్‌కాన్ చైర్మన్ తెలంగాణ అభివృద్ధిని చూసి నేర్చుకోవాల్సినది చాలా ఉందనడం మనందరికీ గర్వకారణం..'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

### సమావేశంలో సీఎం చెప్పిన మరిన్ని అంశాలివీ..

- జూన్ 2న అన్ని నియోజకవర్గాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి.
- ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగతా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని పూర్తి చేయాలి.
- 58, 59 జీవోల ప్రకారం భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువు పెంచిన నేపథ్యంలో.. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకునేలా ఎమ్మెల్యేలు చూడాలి.
- దళితబంధు రెండో విడత పంపిణీకి స్థానిక ఎమ్మెల్యేల ప్రతిపాదనల మేరకు కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలి. పథకం అమల్లోకి వచ్చిన ఆగస్టు 16న దళితబంధు వేడుకలను నిర్వహించాలి.
- గృహలక్ష్మి పథకం కింద సొంత జాగాలో ఇండ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యేలు సిద్ధం చేసి కలెక్టర్లకు పంపించాలి. ఈ పథకంలో అవినీతికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే.
- త్వరలో ప్రారంభించే భూముల పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యేలు అర్హులందరికీ న్యాయం జరిగేలా చూసుకుంటూ జాగ్రత్తగా జరిపించాల్సిన అవసరం ఉంది.
- త్వరలో నిర్వహించే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలకు సిద్ధమై ఉండాలి. అన్ని కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

## ప్రజాస్వామిక తెలంగాణకు కృషి చేయాలి

**ప్రొఫెసర్ కోదండరాం**



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తితో పిలుపునిచ్చిన 'తెలంగాణ బచావో' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థ కొనసాగుతుందని ఆరోపించారు. రాష్ట్ర సాధనకు పనిచేసిన అమరవీరుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలో అందరూ ప్రజాస్వామిక పాలన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ రమా మెల్కోటే మాట్లాడుతూ ప్రజాపోరాటాల ద్వారా వచ్చిన తెలంగాణలో నాయకత్వం అప్రజాస్వామికంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణకు కేసీఆర్ పాలన చీడలా పట్టిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజాగాయకుడు గద్దర్, ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, జె.బి.చలపతిరావు, కె.గోవర్ధన్, జేఏసీ నాయకులు కోలా జనార్దన్, ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ముస్తాక్ మాలిక్ ప్రసంగించారు.

## బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్

**ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్**



సాక్షి, అమరావతి: దేశంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని, బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ ఆవిర్భవించిందని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ చెప్పారు. బీజేపీ నియంతృత్వ పోకడలకు కేసీఆర్ అడ్డుకట్ట వేస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఏపీలోని ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

# ఏప్రిల్ 30న కొత్త సచివాలయం ప్రారంభం

- అంబేడ్కర్ జయంతి రోజున 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ
- రాష్ట్రావతరణ దినోత్సవమైన జూన్ 2న అమరుల స్మారకం ప్రారంభం
- హుస్సేన్‌సాగర్ తీరాన మూడు ప్రధాన నిర్మాణాల ముహూర్తాలు ఖరారు
- ఆయా పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్



కొత్త సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కొత్త సచివాలయం, తెలంగాణ అమరవీరుల స్మారకం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించే ముహూర్తాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. కొత్త సచివాలయాన్ని ఏప్రిల్ 30న ప్రారంభించాలని, ఆలోపు అన్ని పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అంతకన్నా ముందే అంబేడ్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. తెలంగాణ ఆవిర్భవించిన జూన్ 2న అమరవీరుల స్మారక జ్యోతిని ప్రారంభించనున్నారు. ఈ 3 నిర్మాణాలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం మధ్యాహ్నం వాటిని పరిశీలించారు.

**అనుకున్నట్టే అద్భుతంగా..**

తొలుత సచివాలయాన్ని సందర్శించిన కేసీఆర్.. ప్రధాన ద్వారం, దానికి భోపాల్ నుంచి తెచ్చి ఏర్పాటు చేసిన వుడ్ కార్వింగ్, ఫౌంటెయిన్లు, పచ్చిక బయళ్లు, గుమ్మటాల పనులను.. ప్రహరీ, దాని అవతల వెడల్పు చేస్తున్న రోడ్లు, పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంతకుముందు పర్యటించినప్పుడు ఆరో అంతస్తులోని సీఎం చాంబర్‌లో చేయాల్సిందిగా సూచించిన మార్పులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లిన సీఎం కేసీఆర్.. విగ్రహం దిగువన సిద్ధమవుతున్న విశాలమైన హాళ్లు, ఫౌంటెయిన్‌లు, పచ్చిక బయళ్లను పరిశీలించారు. పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని, నాణ్యతలో లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. తర్వాత తెలంగాణ అమరవీరుల స్మారక భవనం వద్దకు సీఎం చేరుకున్నారు. ఆడిటోరియం, ప్రదర్శనశాల, లేజర్‌షో ప్రాంగణం, ర్యాంప్, సెల్లార్ పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం వెంట మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుమన్, జీవన్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు ఉన్నారు.

### వరుసగా వాయిదా పడుతూ..

తొలుత దసరాకు, ఆ తర్వాత సంక్రాంతికి కొత్త సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని రాష్ట్ర సర్కారు భావించింది. కానీ పనులు పూర్తి కాకపోవటంతో వాయిదా వేసుకుంది. తర్వాత సీఎం కేసీఆర్ పుట్టిన రోజైన ఫిబ్రవరి 17ను ముహూర్తంగా ఖరారు చేసింది. పనులు పూర్తి కాకున్నా ప్రారంభించేందుకు సిద్ధమైంది. అయితే సీఎం కార్యాలయం తప్ప మిగతావి పూర్తిస్థాయిలో సిద్ధం కావని అధికారులు పేర్కొనడంతో పునరాలోచించింది. ఇదే సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడంతో మరోసారి వాయిదా వేసింది. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందున ఆయన జయంతి అయిన ఏప్రిల్ 14న ప్రారంభిస్తారని అనుకున్నారు. కానీ ఆ రోజు కాకుండా ఏప్రిల్ 30ని ముహూర్తంగా ఎంచుకుంది. మార్చి 23 తర్వాత శూన్యమాసం మొదలై ఏప్రిల్ 29 వరకు కొనసాగుతుందని.. ఆ తర్వాతి రోజు (ఏప్రిల్ 30) వైశాఖ శుద్ధ దశమి నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయని పండితులు చెప్పారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 30ను కొత్త సచివాలయ ప్రారంభోత్సవం జరగనుంది.



నిజామాబాద్ జిల్లాలో సాగుచేస్తున్న ఎర్రజొన్న పంట

# ఎర్రజొన్న సీడ్.. కేరాఫ్ అంకాపూర్

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని అంకాపూర్ అనగానే రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ దేశీ చికెన్ గుర్తొస్తుంది. ఇతర రాష్ట్రాలు, దేశాలకు సైతం ఈ దేశీ చికెన్ పార్సిళ్ల రూపంలో వెళుతోంది. అయితే ఇదే అంకాపూర్ పశుగ్రాసం కోసం పెంచే ఎర్రజొన్న విత్తనాల ఎగుమతిలోనూ ప్రత్యేకత పొందింది. ఇక్కడి నుంచి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, పంజాబ్‌తోపాటు బంగ్లాదేశ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికాకు సైతం ఎర్రజొన్న విత్తనాలు ఎగుమతి చేస్తున్నారు.

**ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలు, పాక్, బంగ్లాదేశ్‌లకు ఎగుమతి**

- పశుగ్రాసం సాగులో ఉపయోగపడుతున్న ఎర్రజొన్నలు
- నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోనూ సాగు విస్తరణ

### ఉత్తరాదిలో పశుగ్రాసానికి ఆధారం ఇదే..

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ డివిజన్‌లో సుమారు 40 వేల ఎకరాల్లో రైతులు ఏటా ఎర్రజొన్న సాగు చేస్తున్నారు. పక్కనే ఉన్న నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోనూ రైతులు మరో 30 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఉత్తరాదిలో పశుగ్రాసం పెంచేందుకు ఇక్కడి నుంచి తీసుకెళ్లిన ఎర్రజొన్నలను వాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్మూర్ డివిజన్‌లో 40 చోట్ల ఎర్రజొన్న సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. వాటిలో 10 యూనిట్లు చుట్టుపక్కల ఉండగా ఒక్క అంకాపూర్‌లోనే 30 ఎర్రజొన్న యూనిట్లు ఉన్నాయి. దీంతో ఎర్రజొన్న విత్తనాలకు కేరాఫ్‌గా అంకాపూర్ పేరుగాంచింది.



ఎర్రజొన్న ప్రాసెసింగ్

**ఏపీలో చూసొచ్చి..**

1983లో ఏపీలోని ఏలూరులో ఎర్రజొన్న విత్తనాల పంటలను పరిశీలించి వచ్చిన ఆర్మూర్ ప్రాంత రైతులు ఈ సాగు ప్రారంభించారు. రైతులు ఏటా అక్టోబర్, నవంబర్‌లలో ఒప్పందం ద్వారా విత్తన వ్యాపారుల నుంచి ఫౌండేషన్ సీడ్‌ను తీసుకుంటారు. ఫిబ్రవరిలో పంట చేతికి రాగానే ఫౌండేషన్ సీడ్స్ ఇచ్చిన వ్యాపారులకే రైతులు అమ్ముతారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలను వ్యాపారులు ఆయా యూనిట్లలో శుద్ధిచేసి ప్యాక్ చేసి ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

**నిజామాబాద్ భూములే సాగుకు అనుకూలం..**

దేశం మొత్తంలో తెలంగాణలోని నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రమే భూములు ఎర్రజొన్న విత్తనాలు పండించేందుకు అనుకూలంగా ఉన్నాయి. కర్ణాటకలోని బళ్లారిలో 15 శాతం ఎర్రజొన్న విత్తనాలు పండిస్తుండగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో కలిపి 85 శాతం ఎర్రజొన్న విత్తనాలను పండిస్తున్నారు. రైతుల నుంచి కిలో రూ.45 చొప్పున ఎర్రజొన్నలను తీసుకుంటున్న వ్యాపారులు వాటిని శుద్ధిచేసి కిలో రూ.65 చొప్పున అమ్ముతున్నారు. ఏటా ఇక్కడి నుంచి 60 వేల మెట్రిక్ టన్నుల ఎర్రజొన్న విత్తనాలను శుద్ధిచేసి ఎగుమతి చేస్తున్నారు.

**ప్రభుత్వం కొంటేనే మేలంటున్న రైతులు..**

సీడ్ వ్యాపారులు సిండికేట్‌గా మారుతుండడంతో ఏటా ధర విషయంలో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వమే విత్తన విధానాన్ని రూపొందించి రైతులతో బైబ్యాక్ ఒప్పందం చేసుకునే విధానాన్ని తయారుచేస్తే రైతులకు మేలు కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఇక్కడి ఎర్రగరప నేలలు అనుకూలం**




నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో ఎర్రగరప నేలలు ఎర్రజొన్న పంటకు అనుకూలంగా ఉన్నాయి. అలాగే, పశువుల పెంట, చెరువు నల్లమట్టి ఈ భూముల్లో వేస్తారు. మరోవైపు ఈ మూడు జిల్లాల్లోని వాతావరణ పరిస్థితులు ఎర్రజొన్న సాగుకు కలిసివస్తున్నాయి. రైతులు పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న పంటల మార్పిడి వ్యవసాయం చేస్తుండడంతో మరింత మేలు చేస్తోంది. ప్రైవేటు వ్యాపారులు అంకాపూర్‌లో యూనిట్లు ఏర్పాటు చేసి రైతులను ప్రోత్సహిస్తుండడంతో ఎర్రజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

– హరికృష్ణ, వ్యవసాయాధికారి, ఆర్మూర్

# దేశంలో నయాహిట్లర్ ప్రభుత్వం

- రాష్ట్రాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలను కూలగొట్టేందుకు కుట్ర
- కేంద్రంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఆయా రాష్ట్రాల్లోని బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలను కూలగొట్టడంపైనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టి సారించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ఢిల్లీలోని ఆప్, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలను కూలగొట్టే పనిలోనే నిమగ్నమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేకుట్రలో సీబీఐ, ఈడీ, ఇతర నిఘాసంస్థలను, చివరకు న్యాయవ్యవస్థను ఉపయోగించాలనే చూస్తోందని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గమైన నయాహిట్లర్ ప్రభుత్వం భారతదేశంలో ఎప్పుడూ లేదన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆ పార్టీనేత మందా పవన్ అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనీ ల్యాండరింగ్, ఇతర కేసుల్లో 51 మంది బీజేపీ ఎంపీలపై ఆరోపణలు, 78 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు వచ్చాయని, ఒక్కరిపైనైనా విచారణ జరిపారా? అని ప్రశ్నించారు. అదానీ రూ.13 లక్షల కోట్ల కుంభకోణం, విజయ్ మాల్యా, లలిత్ మోడీలు స్కామ్‌లు చేసినా వారిని ఎందుకు అరెస్టు చేయలేదని మండిపడ్డారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ హఠావో... దేశ్ బచావో పేరుతో ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు గల్లీగల్లీలో పాదయాత్ర చేస్తామన్నారు.

# బీఆర్ఎస్‌తో కాంగ్రెస్‌కు పొత్తుండదు

**కేంద్ర మాజీమంత్రి జైరాం రమేశ్**



విలేకరులతో మాట్లాడుతున్న జైరాం రమేశ్. చిత్రంలో మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు పెట్టుకోబోదని కేంద్ర మాజీమంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కాకుండా మిగిలిన పార్టీలతో పొత్తుల గురించి ఆలోచిస్తామని, వివిధ రాష్ట్రాల్లో పలు పార్టీలతో తమకు పొత్తు ఉందని, వామపక్షాలతో కూడా కొన్నిరాష్ట్రాల్లో పొత్తు ఉందని చెప్పారు. శుక్రవారం ఇక్కడి గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 15 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని, తాము అధికారంలోకి వచ్చాక వారికి అండగా నిలుస్తామని, రైతుల నుంచి బలవంతపు భూసేకరణను నిరోధిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్‌లో అభిప్రాయభేదాలు సహజమని వ్యాఖ్యానించారు. మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మీద రాష్ట్ర ప్రజలకు విశ్వాసం ఉందని, అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

**13 ఏళ్ల తర్వాత ధర్నా చేయడం హాస్యాస్పదం**

2010 మార్చిలోనే కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, 13 ఏళ్ల తర్వాత ఇప్పుడు దానిపై ఎమ్మెల్సీ కవిత ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. మహిళా బిల్లుపై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులతో జరిగిన భేటీలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ మాత్రమే పనిచేస్తుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశాల్లో ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా, సోషల్ మీడియా చైర్మన్ సుప్రియ, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావేద్, వంశీచంద్‌రెడ్డి, మాజీమంత్రి పుష్పలీల, నేతలు హర్కర వేణుగోపాల్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మన్నె సతీశ్‌రెడ్డి, బొర్రెడ్డి అయోధ్యరెడ్డి పాల్గొన్నారు.

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 671 | 59,135 |
| నిఫ్టీ ▽ | 177 | 17,413 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 11,233 | ▽ 105 |
| డోజోన్స్ | 32,093 | ▽ 161 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,748 | ▽ 132 |
| డాక్స్ | 15,428 | ▽ 205 |
| షాంఘై | 3,230 | ▽ 46 |
| నికాయ్ | 28,144 | ▽ 479 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారట్) | 55,669 △ 383 |
| బంగారం (22 క్యారట్) | 55,446 △ 381 |
| వెండి (కిలో) | 61,791 ▽ 2 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 81.38 | 83.05 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 96.38 | 99.64 |
| € | యూరో | ఎస్‌బీఐ | 85.60 | 88.64 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 59.23 | 61.15 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 52.93 | 55.28 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 59.68 | 61.62 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 20.88 | 22.55 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.44 | 23.23 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.69 | 12.76 |

## హెచ్‌యూఎల్ ఎండీగా రోహిత్ జావా

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ



విరమణ చెందుతున్న సంజీవ్ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్ ట్రాన్స్‌ఫర్మేషన్ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆశీనులు కానున్నారు.

## సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

**భారత్, అమెరికా మధ్య ఎంవోయూ**

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్ వివరించారు.




సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్ అమెరికా వాణిజ్య మంత్రులు

## పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్
- విద్యుత్, తయారీలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2 శాతం పెరిగింది. 2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.



**రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)**

| | 2023 జనవరి | 2022 డిసెంబర్ |
|---|---|---|
| తయారీ | 3.7 | 2.6 |
| మైనింగ్ | 8.8 | 9.8 |
| విద్యుత్ | 12.7 | 10.4 |
| క్యాపిటల్ గూడ్స్ | 11.0 | 7.6 |
| కన్జూమర్ డ్యూరబుల్స్ | - 7.5 | - 10.4 |
| కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్ | 6.2 | 7.2 |
| ఇన్‌ఫ్రా/నిర్మాణం | 8.1 | 8.2 |
| ప్రైమరీ గూడ్స్ | - 9.6 | 8.3 |
| ఇంటర్మీడియట్ గూడ్స్ | -0.1 | -0.3 |

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

## అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ రుణ భారం దాదాపు 24 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో గ్రూప్ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.




## కనెక్ట్ స్మార్ట్ సన్‌గ్లాసెస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కనెక్ట్ గ్యాడ్జెట్స్ రిథమ్ పేరుతో బ్లూటూత్ కాలింగ్ స్మార్ట్ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది. ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్ కాల్స్ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్ లాంచ్ ఆఫర్ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్ టైమ్ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో–ఫౌండర్ ప్రదీప్ యెర్రగుంట్ల తెలిపారు.




## ఐపీవోకు టాటా టెక్నాలజీస్

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అందించే టాటా టెక్నాలజీస్ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా



ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్ వన్ కంపెనీ టీసీఎస్ 2004లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.

### గ్లోబల్ సర్ఫేసెస్ @ రూ. 133-140

నేచురల్ స్టోన్స్ ప్రాసెసింగ్, ఇంజనీర్డ్ క్వార్ట్జ్ తయారీ కంపెనీ గ్లోబల్ సర్ఫేసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.

## మార్కెట్లకు గ్లోబల్ షాక్

- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ



ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్ఈ మార్కెట్ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

**బ్యాంకింగ్‌కు దెబ్బ**

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్ఎస్ఈలో బ్యాంకింగ్, మీడియా, రియల్టీ, మెటల్, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యురబుల్స్ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్, ఇండస్ఇండ్, ఎస్‌బీఐ, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ, ఎల్అండ్‌టీఆర్ఐఎల్, కొటక్ బ్యాంక్ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, టైటన్ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

## మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్

న్యూయార్క్: ఇన్సూర్డ్ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్ వ్యాలీ, టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసం 2.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్ అంచనా వేసింది. యూఎస్ వెంచర్ క్యాపిటల్(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్, హెల్త్‌కేర్ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్ ఇంక్, షాపిఫై ఇంక్, సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ హోల్డింగ్స్ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్ బెకర్ అభ్యర్థించారు.

**బ్యాంక్ షేర్లకు సెగ**

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్ ఇండెక్స్ 8% కుప్పకూలింది. యూఎస్ దిగ్గజాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

**కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)**

| 11-3-2023 | |
|---|---|
| విశాఖ | 430-00 |
| చిత్తూరు | 458-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 423-00 |
| విజయవాడ | 423-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **10-3-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 415-00 |
| వరంగల్ | 417-00 |
| రిటైల్ ధర | 4.75 |

# సాక్షి స్పోర్ట్స్

## జర్మనీపై భారత్ విజయం

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో ప్రపంచ చాంపియన్ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ రెండు ఫీల్డ్ గోల్స్ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్ గోల్స్ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్ పాల్ ఫిలిప్, 57వ నిమిషంలో స్ట్రతఆఫ్ మైకేల్ గోల్స్ కొట్టారు. మూడో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 3-1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.



## మన బ్యాటర్లపైనే భారం

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్
- కామెరాన్ గ్రీన్ సెంచరీ



అశ్విన్

**భారత్, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.**

అహ్మదాబాద్: ఈ సిరీస్‌లో స్పిన్ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్ గ్రీన్ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ పది ఓవర్లు ఆడి వికెట్ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

**ద్విశతక భాగస్వామ్యం...**

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్ ఖాజా– గ్రీన్ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగియగా, రెండో సెషన్ మొదలైన కాసేపటికే గ్రీన్ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్ ఖాజా, గ్రీన్ 208 పరు గులు జోడించారు. 1979 తర్వాత భారత్ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్ (6)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టీ విరామానికి వెళ్లారు.

**విసిగించిన మర్ఫీ, లయన్**

ఆఖరి సెషన్లో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్ పటేల్ చెక్ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.

**స్కోరు వివరాలు**

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్ 180; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114; క్యారీ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0; స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6; లయన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్ 41; కునెమన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్) 480. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480. **బౌలింగ్:** షమీ 31-3-134-2, ఉమేశ్ 25-2-105-0, అశ్విన్ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్ 28-8-47-1, అయ్యర్ 1-0-2-0.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ బ్యాటింగ్ 17; గిల్ బ్యాటింగ్ 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 36. బౌలింగ్:** స్టార్క్ 3-1-7-0, గ్రీన్ 2-0-11-0, లయన్ 3-0-14-0, కునెమన్ 2-0-3-0.

**611** ఖాజా బ్యాటింగ్ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్ బ్యాటర్ సుదీర్ఘ ఇన్నింగ్స్ ఇదే. ఆసీస్ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్ చేయగలిగారు.

**32** ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్ సవరించాడు.



గ్రీన్

### కమిన్స్ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

## బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్, హీలీ
- డబ్ల్యూపీఎల్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్; 18 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలైస్ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్ నైట్ (2), శ్రేయాంక (15), బరేస్స్ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



హీలీ



ఎకిల్‌స్టోన్

**డబ్ల్యూపీఎల్‌లో నేడు**

గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

### న్యూజిలాండ్ 162/5

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్ మిచెల్ (40 బ్యాటింగ్), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

### దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్ బౌలర్లలో మేయర్స్, అల్జారి జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## క్లుప్తంగా...

### నేడు హైదరాబాద్‌కు అమిత్ షా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా హైదరాబాద్ రానున్నారు. శనివారం రాత్రి 8.30 గంటలకు ఆయన హకీంపేట ఎయిర్‌పోర్ట్‌లో దిగుతారు. అక్కడికి దగ్గరలోనే ఉన్న నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా)లో రాత్రి పూట బసచేస్తారు. సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం అక్కడే నిర్వహించనున్న కార్యక్రమంలో అమిత్ షా పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం కేరళలోని కొచ్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడి నుంచి బయలుదేరి వెళతారు. కాగా, శనివారం రాత్రి లేదా ఆదివారం ఆయన రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలతో భేటీ అయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలు, ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత దీక్ష, ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో ప్రశ్నించేందుకు కవితకు ఈడీ నోటీసులు, కేంద్రం, ప్రధాని మోదీ, బీజేపీలపై బీఆర్ఎస్, ఇతర విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న తీరు.. తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. అమిత్ షా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా సంగారెడ్డిలో వివిధ రంగాలకు చెందిన మేధావులతో భేటీ కావాలని భావించారు. అయితే కొచ్చి కార్యక్రమం కారణంగా ఈ సమావేశం రద్దయినట్టు పార్టీనేతలు వెల్లడించారు.

### అనురాగ్‌లో ముగిసిన టెక్నో కల్చరల్ సింపోజియం

సాక్షి, హైదరాబాద్: అనురాగ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల టెక్నో-కల్చరల్ సింపోజియం శుక్రవారం ముగిసింది. దేశం నలుమూలలనుంచి వచ్చిన 4,500 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని, 175 సాంకేతిక, సాంకేతికేతర కార్యక్రమాలు నిర్వహించామని అనురాగ్ వర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ తెలిపారు. హైదరాబాద్‌లోని హిటాచీ వంటరా టాలెంట్ అక్విజిషన్ మేనేజర్ ప్రశాంత్ నిడమర్తి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం, ప్రొఫెసర్ సమీన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి పీపుల్స్‌ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 24 వరకు పీపుల్స్‌ప్లాజాలో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ తెలిపింది. ప్రదర్శనలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాలకు చెందిన వైవిధ్యభరిత వస్త్రాలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. తెలంగాణ వస్త్ర ఉత్పత్తులపై 20 నుంచి 30 శాతం డిస్కౌంట్ ప్రకటించారు.

## వైభవంగా పార్వతీ రాజరాజేశ్వర కల్యాణం

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ పార్వతీరాజరాజేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఐదు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మున్సిపాలిటీ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పలువురు కౌన్సిలర్లు స్వామి వారికి పట్టువస్త్రాలు, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తలంబ్రాలు సమర్పించారు. చేతిలో త్రిశూలం, బాసింగం, నెత్తిన జీలకర్రలతో రాజన్నను శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు పెళ్లాడారు. ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు.

– వేములవాడ



చేతిలో త్రిశూలం పట్టుకుని రాజన్నను వివాహమాడుతున్న శివపార్వతులు. జోగినులు, హిజ్రాలు (ఇన్‌సెట్‌లో) పార్వతీ రాజరాజేశ్వరుల కల్యాణోత్సవం

## ముందే అనుబంధ గుర్తింపు సాధ్యమేనా?

### ఇంటర్, డిగ్రీ కాలేజీల అఫిలియేషన్ల ప్రక్రియ అమలుపై సందేహాలు

- ఆదేశాలు జారీ అయినా కార్యాచరణ దిశగా పడని ముందడుగు
- వందలాది ఇంటర్ కాలేజీల్లో లేని మౌలిక వసతులు
- బోర్డు నోటీసులిచ్చినా పట్టించుకోని యాజమాన్యాలు
- డిగ్రీలో కుదించే సీట్లు.. కొత్తగా ప్రవేశపెట్టే కోర్సులపై రాని స్పష్టత




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను ఈసారి మేలోగా పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించినా దాని అమలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా ఆదేశాలు జారీ అయి రెండు నెలలైనా ఇప్పటికీ కార్యాచరణ ప్రారంభం కాకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఇందుకు చాలా కారణాలే కనిపిస్తున్నాయి.

**జాప్యాన్ని నివారించాలనుకుంటున్నా..**

ఏటా కాలేజీలకు అనుబంధ గుర్తింపు జారీ ప్రక్రియ విద్యాసంవత్సరం మొదలైన కొన్ని నెలల వరకూ జరుగుతుండటంతో గుర్తింపు రాకుండానే చాలా కాలేజీలు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. నిబంధనలు పాటించనందుకు ఆయా కాలేజీలకు గుర్తింపు ఇవ్వరాదని అధికారులు భావిస్తున్నప్పటికీ అప్పటికే చేరిన విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గుర్తింపు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఇది విద్యాశాఖకు తలనొప్పిగా మారుతోంది. దీన్ని నివారించేందుకే ఈ ఏడాది విద్యాసంవత్సరం ముగిసేలోగా గుర్తింపు పక్రియ పూర్తిచేయాలని నిర్ణయించారు.

**నిబంధనలు బేఖాతర్ చేస్తున్న యాజమాన్యాలు..**

రాష్ట్రంలోని 1,856 ప్రైవేటు ఇంటర్ కాలేజీల్లో దాదాపు 400 కాలేజీలు ఇరుకైన ప్రదేశాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో నడుస్తున్నాయి. అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రాలు లేకున్నా ఆయా బోధన సాగిస్తున్నాయి. మరికొన్ని కాలేజీల్లో కనీస మౌలిక వసతుల్లేవు. దీనిపై ఇంటర్ బోర్డు కొన్నేళ్లుగా నోటీసులిస్తున్నా యాజమాన్యాలు పెద్దగా పట్టించుకోవట్లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోగా అనుబంధ గుర్తింపు ఇవ్వాలంటే ఆయా యాజమాన్యాలు తాము నడిపే కాలేజీల ప్రాంతాలపై స్పష్టత ఇవ్వాలి. అప్పుడే గుర్తింపు ప్రక్రియ సాధ్యం కానుంది. మరోవైపు ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు మొదలు కానుండగా ఏప్రిల్, మే నాటికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. జూన్ నుంచి కాలేజీలు ప్రారంభం కావాల్సి ఉండటంతో ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తయ్యేలోగా ముందే అనుబంధ గుర్తింపు ఎలా ఇవ్వగలరనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గుర్తింపు అనుకున్నట్టు పూర్తవ్వడం కష్టమేనని బోర్డు వర్గాలు అంటున్నాయి.

**డిగ్రీ సీట్లపై స్పష్టత ఏదీ?**

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో దాదాపు 4.6 లక్షల సీట్లున్నాయి. వాటిల్లో ఏటా భర్తీ అవుతున్నవి సుమారు 2.25 లక్షల సీట్లే. సగానికిపైగా సీట్లు మిగిలిపోతున్నాయి. కొన్ని కాలేజీల్లో జీరో అడ్మిషన్లు ఉంటున్నాయి. మరికొన్ని కోర్సుల్లో జీరో ప్రవేశాలుంటున్నాయి. వాటిని రద్దుచేస్తామని ఉన్నత విద్యామండలి ఏటా చెప్పడమే తప్ప కార్యాచరణకు దిగడం లేదు. ఈ ఏడాది దాదాపు లక్ష సీట్లను ఫ్రీజ్ చేయగా వచ్చే ఏడాది ఇలాంటి సమస్య రాకుండా కాలేజీలే అవసరం లేని సీట్లను వదులుకోవాలనే అవగాహన కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. దీనికితోడు ఈ ఏడాది కొత్తగా విభిన్న కోర్సుల సమ్మేళనంతో డిగ్రీ ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఆర్ట్స్ విద్యార్థి కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సుచేసే అవకాశం ఇస్తామంటున్నారు. ఇది జరగాలంటే ప్రైవేటు కాలేజీల్లో డిమాండ్ లేని కోర్సులను రద్దు చేసుకోవాలి. డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లను పెంచుకోవాలి. వచ్చే మే నాటికి ఈ ప్రక్రియ పూర్తవ్వాలని ఉన్నత విద్యామండలి అన్ని వర్సిటీలకు సూచించింది. కానీ ప్రైవేటు కాలేజీలు సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఇప్పటికిప్పుడు కోర్సులను మార్చుకోవడం, అందుకు తగ్గ ఫ్యాకల్టీ ఏర్పాటు చేసుకోవడం కష్టమని పేర్కొంటున్నాయి.

### వర్సిటీలను అప్రమత్తం చేశాం



మార్పులను స్వాగతించేలా ప్రైవేటు కాలేజీలకు నచ్చజెప్పి వారి భాగస్వామ్యాన్ని పెంచుతాం. ఈ దిశగా అన్ని వర్సిటీలను అప్రమత్తం చేస్తాం. విద్యార్థులకు అవసరమయ్యే కోర్సులనే తీసుకోవడం కాలేజీలకు మంచిది. డిమాండ్ లేకుండా అనుమతులివ్వడం వల్ల ఉపయోగం లేదు. వీలైనంత త్వరగా అనుబంధ గుర్తింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తాం. – ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

## మహిళల సురక్షిత ప్రయాణానికి ఏర్పాటు చేయండి

### డీజీపీని కోరిన మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రైల్వే, బస్ స్టేషన్ల వద్ద మహిళా ప్రయాణికులు రాత్రిపూట ధైర్యంగా ప్రయాణాలు చేయడానికి వీలుగా క్యాబ్/ఆటో, ప్రజా రవాణాను ట్రాక్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు డీజీపీ అంజనీ కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య మహిళలు, యువతులు ప్రయాణించే సమయాల్లో వారికి రక్షణ కల్పించేలా ప్రజా రవాణాలో ట్రాకింగ్ పద్ధతిని ఏర్పాటు చేయాలంటూ హర్షిత అనే యువతి ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్‌ను కోరిన నేపథ్యంలో ఆయన వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా అమలు చేయాలని డీజీపీకి సూచించారు. దీనిపై స్పందించిన డీజీపీ అంజనీకుమార్, మహిళల సురక్షిత ప్రయాణానికి వీలైన చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

## 2046 ప్రేమికుల రోజు ప్లానింగ్‌లేమీ వద్దు!

### ఎందుకంటే.. గ్రహశకలం వచ్చేస్తోంది..

మీరు విన్నది నిజమే.. ఎందుకంటే.. ఆ రోజున ఓ గ్రహ శకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం ఉందట. అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' ఈ మేరకు హెచ్చరించింది. మరి ఏమిటా గ్రహశకలం? ఎక్కడ పడే అవకాశముంది? ఎంత నష్టం జరుగుతుందనే వివరాలు మీకోసం..

– సాక్షి సెంట్రల్ డెస్క్



### పీసా టవర్ అంత పెద్దగా..

ఒక భారీ గ్రహశకలం.. దాదాపు ఆరు కోట్ల ఏళ్ల కింద భూమిని ఢీకొడితే డైనోసార్లు సహా 90శాతానికిపైగా జీవరాశి తుడిచిపెట్టుకుపోయింది. తర్వాత మరికొన్ని గ్రహశకలాలు వాటి స్థాయిలో విధ్వంసం సృష్టించాయి. ఇప్పుడూ అలాంటి ప్రమాదం ముంచుకు వస్తోందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా హెచ్చరించింది. 2046 ఫిబ్రవరి 14న సాయంత్రం 4.44 గంటల (ఈస్టర్న్ టైం)కు '2023డీడబ్ల్యూ' గ్రహశకలం భూమిని ఢీకొనవచ్చని పేర్కొంది (భారత కాలమానం ప్రకారం.. ఫిబ్రవరి 15న తెల్లవారుజామున 3.14 గంటలకు). ఇటలీలోని పీసా టవర్(186 అడుగులు)కు కాస్త దగ్గరగా 165 అడుగుల పరిమాణంలో ఈ గ్రహ శకలం ఉందని తెలిపింది.




### కొన్ని వారాలుగా పరిశీలించాక..



'2023డీడబ్ల్యూ' గ్రహశకలాన్ని కొన్నివారాల క్రితమే గుర్తించారు. దాని ప్రయాణమార్గం, వేగం, ఇతర అంశాలను పరిశీలించిన ఓ ఇటాలియన్ ఆస్ట్రొనమర్.. భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని నాసాను అలర్ట్ చేశారు. తొలుత 1,200 చాన్సుల్లో ఒకసారి అది ఢీకొట్టవచ్చని భావించారు. నిశితంగా పరిశీలించాక.. 710 చాన్సుల్లో ఒకసారికి, తర్వాత 560 చాన్సుల్లో ఒకసారికి మార్చారు. అంటే ప్రమాద అవకాశం మరింత పెరుగుతోందన్న మాట.

'2023డీడబ్ల్యూ' గ్రహశకలం హిందూ మహా సముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం దాకా ఎక్కడైనా పడొచ్చని నాసా అంచనా వేసింది. అమెరికాలోని హవాయి, లాస్ ఏంజిలిస్, వాషింగ్టన్ వంటి నగరాలూ ఈ మార్గంలో ఉన్నాయని పేర్కొంది.

### అమెరికా నుంచి భారత్ దాకా..

నాసా అంచనా వేసిన మ్యాప్ ప్రకారం.. తర్వాతి స్థానాల్లో ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ థాయ్‌లాండ్, ఇండియా, గల్ఫ్ దేశాలు కూడా ఉన్నాయి. అయితే.. వీటికి ప్రమాదం తక్కువ.



భూకంపాలను రిక్టర్ స్కేల్‌తో కొలిచినట్టే.. గ్రహశకలాలు ఢీకొట్టే ప్రమాదాన్ని టొరినో స్కేల్‌తో కొలుస్తారు. దాని పరిమాణం, వేగం, భూమికి ఎంత దగ్గరగా ప్రయాణిస్తుందనే

### టొరినో స్కేల్‌పై లెవల్‌-1 వద్ద..

అంశాల ఆధారంగా లెవల్ రేటింగ్ ఇస్తారు. '2023డీడబ్ల్యూ'తో ప్రమాదాన్ని లెవల్-1 వద్ద సూచించారు. మరింత కచ్చితమైన పరిశీలన తర్వాత స్థాయిని పెంచుతారు. లెవల్-3 దాటితే ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తారు.

1908లో దాదాపు 160 అడుగుల గ్రహశకలం రష్యాలోని సైబీరియా గగనతలంలో ఐదారు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయింది. దీని ధాటికి సుమారు 2వేల చదరపు కిలోమీటర్లలో అడవి, జీవజాలం నాశనమైంది. జనావాసాలకు దూరంగా జరగడంతో మరణాలు నమోదు కాలేదు. కానీ ఆ

### ఇంతకుముందుతో పోలిస్తే..

పేలుడు తీవ్రత జపాన్‌లోని హిరోషిమాపై వేసిన అణుబాంబు కంటే వెయ్యి రెట్లు ఎక్కువని, నేరుగా భూమిని ఢీకొని ఉంటే భారీ విధ్వంసం జరిగేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

→ ఇప్పుడు '2023డీడబ్ల్యూ' గ్రహశకలం జనావాసాలు ఉన్నచోట ఢీకొంటే.. ఒక పెద్ద నగరమంత వైశాల్యంలో అంతా నామరూపాలు లేకుండా పోతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

## పెన్షనర్ ఉద్యోగులకు హెల్త్ స్కీం అమలు చేయాలి

### రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్ ఉద్యోగులకు హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) అమలు చేయాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. మోహన్‌నారాయణ, ఎస్. నర్సరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలసి వినతి పత్రం సమర్పించారు. నగదు రహితంగా అన్ని జబ్బులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ విధానం అమలు అయ్యే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పింఛన్‌దారులకు 2023 సంవత్సరం నుంచి పీఆర్‌సీని అమలు చేయాలని, ప్రతీ నెల 1వ తేదీన పెన్షనర్లకు చెల్లింపులు జరిపించాలని హరీశ్‌రావును కోరారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 